ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-4-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 79 పేజీలు: 10+4 వెల: 6.50



సూట్‌కేసులో బంగారు ఇటుకలు
నిర్బంధ హిందీపై ఏకమవుతున్న థాకరేలు
5


# హైదరాబాద్‌లో ఎకో టౌన్

## భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం

### హైదరాబాద్‌లో జపనీస్ భాషా పాఠశాలలు!

### జపాన్ సంస్థలతో తెలంగాణ ఒప్పందం: సిఎం

### కిటాక్యూషు నగరాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ బృందం



ఆదివారం జపాన్‌లో కిటాక్యూషు నగర మేయర్‌తో సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్20:** జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పర్యావరణ హిత కిటాక్యూషు నగరాన్ని ఆదివారం సందర్శించింది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకుంటుంది. కిటాక్యూషు సిటీ మేయర్ కజుహిసా టేకుచితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు అధికారులు భేటీ అయ్యారు. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర మోడల్స్, నదుల పునరుజ్జీవన విధానాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్‌పీ, నిప్పాన్ స్టీల్ ఇంజినీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యూషు మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు జరిగాయి. ఒకప్పుడు పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులుపడ్డ కిటాక్యూషు నగరం ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా >>2

# త్వరలో ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలు



## నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)లో 3038 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలోనే జారీ చేయనున్నట్టు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టిసిలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తుండడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. 3038 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని త్వరలోనే నోటిఫికేషన్ వేసి సాధ్యమైనంత త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తుందని.. తద్వారా ఆర్‌టిసిలో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. ఇప్పటి వరకు ఆర్‌టిసిలో 165 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని.. వారు రూ. 5500 కోట్ల రూపాయలు ఆదా చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మహాలక్ష్మీ పథకం కోసం కొత్త బస్సులు కొనుగోలు చేశామని.. ఇప్పుడు ఉద్యోగాల భర్తీకి సంస్థ సన్నద్ధం అయిందని మంత్రి తెలిపారు. 3038 ఉద్యోగాల్లో.. డ్రైవర్ పోస్టులు2000,శ్రామిక్ 743, డిప్యూటీ సూపరిండెంట్ (ట్రాఫిక్), 84 డిప్యూటీ సూపరిండెంట్ (మెకానికల్), 114 డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 25 అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్, 18 అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్), 23 సెక్షన్ ఆఫీసర్(సివిల్) 11, అకౌంట్ ఆఫీసర్స్ 6, మెడికల్ ఆఫీసర్స్ జనరల్ 7,మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ 7 పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. >>2



## జమ్ముకాశ్మీర్‌లో వర్ష బీభత్సం

### రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు మృతి

### విరిగిపడిన కొండచరియలు

**శ్రీనగర్, ఏప్రిల్ 20:** జమ్ముకశ్మీర్‌లో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. శనివారం రాత్రంతా కురిసిన భారీ వర్షం ధాటికి పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. రాంబన్ జిల్లాలో >>2



## ట్రంప్ తీరుపై అగ్రరాజ్యంలో నిరసనల హోరు

### అధ్యక్షుడికి వ్యతిరేకంగా ఆందోళనలు

**వాషింగ్టన్, ఏప్రిల్ 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా మరోసారి >>2



## నేటి నుంచి భారత్‌లో యుఎస్ వైస్ పర్యటన

### మూడు రోజులపాటు ఫ్యామిలీ టూర్!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ తన కుటుంబంతో కలిసి సోమవారం న్యూఢిల్లీకి చేరుకోనున్నారు.అయితే, భారత పర్యటనలో ఎక్కువదృష్టి సాంస్కృతిక కార్యక్రమాలు మరియు జైపూర్ మరియు ఆగ్రాలోని పర్యాటక ప్రదేశాల సందర్శనలపై ఉంటుంది, వాన్స్ ముగ్గురు పిల్లలు కుమారులు ఇవాన్ మరియు వివేక్ మరియు కుమార్తె మిరాబెల్ వారితల్లి ఉషా తన మూలాలను >>2



## ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశానం

### కుల భేదాలకు స్వస్తి పలకండి: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్20:** కుల భేదాలకు స్వస్తి పలకాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ప్రజలకు పిలుపునిచ్చారు. "ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశానవాటిక" అనే సూత్రానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు. దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలని ఆయన కోరారు. అలీగఢ్‌లో 5 రోజుల పర్యటనలో ఉన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, హిందూ >>2

## విద్యార్థి మొబైల్‌కి ఎప్‌సెట్ ఫలితాలు!

### జెఎన్‌టియు వినూత్న ప్రయోగం

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం గత ఏడాది వరకు ఎంసెట్‌గా కొనసాగించి.. ఈ ఏడాది నుంచి ఎప్(ఈఏపి) సెట్‌గా మారిన ఎప్ సెట్ ఫలితాల కోసం విద్యార్థులు టెన్షన్ పడాల్సిన పనిలేదు. ఇకపై విద్యార్థుల మొబైల్ నంబర్లకే వారి ఎప్ సెట్ ఫలితాలను పంపించేలా జెఎన్‌టియూ చర్యలు తీసుకుంటోంది. ఇందుకు సంబంధించి ఈ ఏడాది ఎప్‌సెట్-2025 ఫలితాలను విద్యార్థులు దరఖాస్తు సమయంలో సమర్పించిన రిజిస్టర్ >>2

### మేధావుల కోసం ప్రపంచం చూపు

## భారత్ వైపు



### కార్పొరేట్ రంగంలో కంపెనీ సెక్రటరీలదే కీలకపాత్ర: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### ఐసిఎస్‌సి హైదరాబాద్ చాప్టర్ నూతన భవనానికి భూమి పూజ చేసిన కేంద్రమంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ఇంటెలెక్చువల్స్ కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఐసిఎస్‌సి హైదరాబాద్ చాప్టర్ నూతన భవనానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ ఇది హైదరాబాద్ చాప్టర్‌కి మాత్రమే కాకుండా దేశంలోని కార్పొరేట్ గవర్నెన్స్‌కు కీలక ఘట్టం అన్నారు. కంపెనీ సెక్రటరీలు దేశ కార్పొరేట్ రంగానికి రూపురేఖలు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలు విలువలను పాటిస్తూ పారదర్శకంగా చట్టాలను అనుసరించేలా చేస్తూ దేశ కార్పొరేట్ గవర్నెన్స్‌కు మీరు వెన్నెముకలా నిలిచారని అన్నారు. కంపెనీల సమగ్రత కాపాడడంతో పాటు కార్పొరేట్ వ్యవహారాల నిర్వహణ సరిగా ఉండేలా చూస్తూ దేశ ఆర్థిక వృద్ధిలో కూడా మీరు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. 2017లో జరిగిన ఐసిఎస్‌సి జూబ్లీ వేడుకల్లో ప్రధాని నరేంద్రమోడీ సైతం ఇదే విషయాన్ని పేర్కొన్నారని అన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్కృతిని పెంపొందించడంతో పాటు దేశీయ వ్యాపారంపై నమ్మకం కలిగేలా చేశారని ఆయన ప్రశంసించారు. ఈ నమ్మకంతోనే దేశ,విదేశీ పెట్టుబడిదారులు మనదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారుఅన్నారు. అందుకే మన దేశం గ్లోబల్ ఎకనామిక్ పవర్ హౌస్‌గా వడివడిగా ముందుకు సాగుతుందన్నారు.సత్యం వధ ధర్మంచర అనే సూత్రం ఆధారంగా ఐసిఎస్‌సి పనిచేస్తుందని, ప్రతి కంపెనీ సెక్రటరీ ప్రతిరోజు ఈ సూత్రాన్ని ఆధారంగా పని చేస్తే దేశ వ్యాపార రంగం నిజాయితీ పారదర్శకతతో ముందుకు సాగుతుందన్నారు. ఇప్పటికే భారతదేశం ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అన్నారు. మరో రెండేళ్లలోనే 5 బిలియన్ మార్క్ దాటనుందన్నారు. ఈ విజయం మీలాంటి ప్రొఫెషనల్స్ హార్డ్ వర్క్, అంకితభావం, విలువలతో కూడిన వ్యాపారం వల్లే సాధ్యమైందని, ఇప్పటికే జర్మనీ, జపాన్ లాంటి దేశాలు మనటాలెంట్‌ని గుర్తించి, కంపెనీ సెక్రటరీలు, లాయర్లు, అకౌంటెంట్లను వారి దేశాల్లో పనిచేసేందుకు నియమించుకుంటున్నాయని, ఇంటలెక్చువల్, ప్రొఫెషనల్‌స్కిల్స్ పెంచుకోవడం అంటే కేవలం వ్యక్తిగత అభివృద్ధి మాత్రమేకాదు. సమాజంతోపాటు ప్రపంచ అభివృద్ధికి >>2

## కార్పొరేట్‌కు దీటుగా యంగ్ ఇండియా విద్యాలయాలు

### పేదల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పాలన

### మహిళలను సంపన్నులు చేసే దిశగా ఇందిరా మహిళా శక్తి: మధిరలో డి.సిఎం భట్టి విక్రమార్క



మధిరలో ఆదివారం పలు అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన డి.సిఎం భట్టి

**మధిర ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు సమాంతరంగా నిర్వహిస్తూ పాలన కొనసాగిస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మధిర నియోజకవర్గ పరిధిలో మధిర మండలంలో రూ.72.33 కోట్ల అంచనా లతో వైరా నదిపై సిరిపురంలో చెక్ డ్యాం, మహాదేవపురం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును ప్రారంభించి, రాయపట్నం గ్రామాలలో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణాలకు, సిరిపురం గ్రామంలో నూతనంగా జూనియర్ కళాశాల ప్రభుత్వ ఐటిఐ భవనాల నిర్మాణాలకు, మధిర మున్సిపాలిటీ పరిధిలో అంబారుపేట నుండి నిదానపురం వరకు రహదారి విస్తరణ పనులకు ఆయన భూమి పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఆర్థిక విధ్వంసం సృష్టించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్లారని, ప్రజల దీవెనలతో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజల సంక్షేమానికి అభివృద్ధి కార్యక్రమాలకు సమానమైన రీతిలో నిర్మాణాత్మకమైన ప్రణాళికలతో కృషి చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నదని అన్నారు .గత ప్రభుత్వ పాలకులు సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒ అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం,ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జిల పెంపు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలను సంపన్నులను చేసే దిశగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద కార్యక్రమాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమం క్రింద వివిధ పనులు చేపట్టామని, ఇందిరమ్మ క్యాంటీన్‌లు ఏర్పాటు, మండలాలలో పెట్రోల్ బంకుల ఏర్పాటు, ఆర్టీసీలో అద్దెబస్సుల నిర్వహణ,రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు.ప్రభుత్వ విద్య రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు కార్పోరేట్‌కు ధీటుగా మన పిల్లలు చదువుకోవాలని యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను నిర్మిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్క అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని, మొదటి దశలో నిరుపేదలకు మంజూరు చేస్తామని అన్నారు. ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని తెలిపిన ఆయన రైతుల సంక్షేమం దిశగా రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్న బియ్యం పండించిన రైతులకు క్వింటాల్ వడ్ల కు 500 రూపాయల బోనస్, రైతు బీమా, ఉచిత విద్యుత్ కు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేశామని >>2

### కల్లాల్లోనే ధాన్యం విక్రయాలు

### కూలీలు, యంత్రాలకు డిమాండ్

### భారీగా అద్దె పెంచేసిన నిర్వాహకులు

### అకాల వర్షాలతో ఆందోళనలో అన్నదాతలు



## జోరందుకున్న వరి కోతలు

### మబ్బులు పడితే చాలు రైతుల గుండెల్లో గుబులు!

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుత యాసంగి సీజనుకు సంబంధించి వరి కోతలు జోరందుకున్నాయి. ముందుగా నాట్లు వేసిన వారికి పంట చేతికి రావడంతో పాటు, రాష్ట్రంలో అకాల వర్షాల భయంతో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరత పెద్ద ఎత్తున ఏర్పడటంతో రైతులు వరి కోత యంత్రాలనే నమ్ముకుని వాటిపై ఆధారపడ్డారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలులు తరచూ పడుతుండటంతో లక్షలాది ఎకరాల్లో వరి చేలు నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మబ్బులు పడతే చాలు రైతుల గుండెల్లో గుబులు పుడుతోంది. ఈ నేపథ్యంలో వరి కోతలపైన రైతులు దృష్టిసారించారు. ఫలితంగా వరి కోత మిషన్లకు డిమాండ్ పెరిగి సకాలంలో దొరకడం లేదు. ఇదే అవకాశంగా చేసుకుని వరి కోత మిషన్ల నిర్వాహకులు వాటి అద్దె రేటును పెంచేస్తున్నారు. సాధారణ రోజుల్లో వసూలు చేసే రేట్ల కంటే అదనంగా 600 నుండి 900 రూపాయల వరకూ రైతుల వద్ద వసూలు చేస్తున్నారు. గత ఏడాది వరికోసినందుకుగాను గంటకు 1,600 రూపాయల నుండి 1,800 రూపాయల వరకూ అద్దె వసూలు చేశారు. ఈ ఏడాది గంటకు 2,500 రూపాయల నుండి 3,000 రూపాయలవరకూ వీలును బట్టి వసూలు చేస్తున్నట్లు పలువురు రైతులు వాపోతున్నారు. మరోపక్క రాష్ట్రంలోని పలుజిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించక పోవడంతో కోసిన ధాన్యాన్ని రైతులు నేరుగా మిల్లర్లకే >>2



## ఈ యేడాదే 'ఉప పోరు'

### కెసిఆర్ మరోసారి సిఎం కావడం చారిత్రక అవసరం: కెటిఆర్

### పలువురు అత్తాపూర్ నేతలు బిఆర్‌ఎస్‌లో చేరిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్20:** రాబోయే ఎన్నికల్లో మనం గెలవడం మన కోసం కాదు.. తెలంగాణ సమాజానికి మళ్లీ తిరిగి కేసీఆర్‌ను సీఎం చేసుకోవడం చారిత్రక అవసరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉంది. కచ్చితంగా ఏప్రిల్ 27వ తేదీ నాడు.. వరంగల్‌కు తరలి రావాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం >>2



అమెరికాలోని బోస్టన్ లోగాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

# కాశ్మీర్‌లో వర్షబీభత్సం

>> సంభవించిన వివిధ ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. ఇళ్లు, వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పెద్దఎత్తున రాళ్లు పడటంతో జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు. దీనితో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.ఆకస్మిక వరదల కారణంగా దోడా జిల్లాలోని ధరమ్ కుండ్ గ్రామంలో 40 ఇళ్లు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని, శిథిలాల కింద చిక్కుకున్న 100 మందిని కాపాడారు. మరోవైపు పెద్ద ఎత్తున రాళ్లు పడటం సహా ఓ చోట స్వల్పంగా ధ్వంసం కావడం వల్ల జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారిని అధికారులు మూసివేశారు. ఎస్ఎస్‌జీ, ముఘల్, సింథాన్ రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. వాతావరణం మెరుగుపడే వరకు ప్రయాణికులెవరూ ఈ మార్గాలను వినియోగించవద్దని జమ్మూకశ్మీర్ ట్రాఫిక్ పోలీసులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొండచరియల కారణంగా రోడ్లపై వాహనాలు చిక్కుకున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. రాంబన్‌లో కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడం బాధించిందని సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. ప్రజలంతా చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. వరదల వల్ల భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అవసరమైన చోట తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ట్రంప్ తీరుపై అగ్రరాజ్యంలో నిరసనల హోరు

>> దేశవ్యాప్తంగా ఆందోళనకారులు నిరసనలు చేపట్టారు. నగర వీధుల్లోకి వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ అధ్యక్షుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యూయార్క్‌లోని ప్రధాన గ్రంథాలయం వెలుపల జనం గుమిగూడి, అమెరికాలో రాజులు ఎవరూ లేరు, ఈ దౌర్జన్యాన్ని ఎదిరించండి, ఫాసిజం వద్దు అంటూ నినాదాలు చేశారు. తాత్కాలిక వలసదారులకున్న చట్టపరమైన నివాస హోదాను రద్దు చేయడం, వారిని బహిష్కరించడంపై నిరసనకారులు మండిపడ్డారు. ఎలాంటి భయం లేదు వలసదారులకు స్వాగతం అంటూ నినాదాలు చేశారు. రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా డొనాల్డ్ ట్రంప్ పాలన సాగుతోందని మండిపడ్డారు. ట్రంప్ తన తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఎఫ్1 విద్యార్థి వీసా ముగిసినప్పటికీ అమెరికాలోనే ఉంటున్న పాలస్తీనాకు చెందిన విద్యార్థిని లెకా కోర్డియాను అక్కడి అధికారులు అరెస్టు చేశారు. మరో పాలస్తీనా విద్యార్థిని కూడా అంతకు ముందు అదుపులోకి తీసుకున్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే వీసా రద్దు అవుతున్న వారిలో ఎక్కువ మంది భారతీయ విద్యార్థులే ఉంటున్నారు. ఇప్పటివరకు మొత్తంగా వీసా రద్దుల్లో దాదాపు 50శాతం మంది భారతీయులవేనని అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోషియేషన్ తెలిపింది. ట్రంప్ పని తీరును నిరసిస్తూ ఇటీవల అమెరికా ప్రజలు దేశమంతటా ర్యాలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. న్యూయార్క్ నుంచి అలస్కా దాకా వీధుల్లోకి వచ్చిన జనం హ్యాండ్సాఫ్ అంటూ నినదించారు. రిపబ్లికన్ పార్టీ పాలన ప్రారంభమయ్యాక జరిగిన అతి పెద్ద నిరసనగా ఇది నిలిచింది. పౌర హక్కుల సంఘాలు, కార్మిక సంఘాలు, ఎల్‌జీబీటీక్యూ సంస్థలు, న్యాయవాద సంఘాలు, సీనియర్ సిటిజన్లు, ఎన్నికల సంస్కరణల సంఘాల ఆధ్వర్యంలో 50 రాష్ట్రాల్లోని 1,200 ప్రాంతాల్లో చేపట్టిన ఈ హ్యాండ్సాఫ్ ఆందోళనలకు ప్రజల నుంచి భారీగా స్పందన వచ్చింది. అయితే శాంతియుతంగానే ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తాజాగా మరోసారి ట్రంప్‌నకు వ్యతిరేకంగా ప్రజలు నిరసనలకు దిగడం గమనార్హం.

# గుజరాత్‌లో పర్యటిస్తున్న ఎపి మంత్రి నారాయణ బృందం

**విజయవాడ ఏప్రిల్ 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తున్నారు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ..అమరావతిలో భారీ భవనాల నిర్మాణాల కోసం ముంబయి,ఢిల్లీలో పర్యటించారు.. తాజాగా గుజరాత్‌లో రెండు రోజుల పర్యటనకు వెళ్లారు మంత్రి నారాయణ.. ఈ పర్యటనలో మంత్రి వెంట సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ లక్ష్మీ పార్థసారథి,గ్రీనింగ్ అండ్ బ్యుటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులు ఉన్నారు.మొదటి రోజు ఉదయం అహ్మదాబాద్ చేరుకున్న మంత్రి బృందానికి గుజరాత్ రాష్ట్ర అధికారులు ఘన స్వాగతం పలికారు...అహ్మదాబాద్ నుంచి బస్సులో ఏక్తానగర్ చేరుకున్నారు. ఏక్తానగర్‌లో ప్రపంచంలోనే అతిపెద్దదైన సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహాన్ని పరిశీలించారు...597 అడుగుల ఎత్తుతో ప్రపంచలోనే అతి భారీ విగ్రహం నిర్మాణం ఏ విధంగా జరిగింది...ఎలాంటి సాంకేతికత ఉపయోగించారు...విగ్రహం తయారీలో ఎలాంటి నిర్మాణ సామాగ్రి ఉపయోగించారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు...ఆ తర్వాత స్థానిక అధికారులతో పాటు పటేల్ విగ్రహ నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి సమాచారాన్ని మంత్రి బృందానికి వివరించారు...నర్మదా నది ఒడ్డున ఉన్న ఈ విగ్రహం నిర్మాణం అధ్యయనం ద్వారా అమరావతిలో నిర్మించదలచిన పలు విగ్రహాలపై ఒక స్పష్టత వస్తుందని భావిస్తున్నారు..అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం తో పాటు మరికొంతమంది ప్రముఖుల భారీ విగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది...దాంట్లో భాగంగానే వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించింది మంత్రి బృందం...విగ్రహం పరిశీలనతో పాటు దానికి అనుగుణంగా నిర్మించిన మరిన్ని కట్టడాలను మంత్రి బృందం పరిశీలించింది.

ఆ తర్వాత మధ్యాహ్నం ఏక్తానగర్ నుంచి అహ్మదాబాద్ శివారులోని గాంధీనగర్ జిల్లాలో ఉన్న గిఫ్ట్ సిటీని మంత్రి బృందం సందర్శించింది...దేశంలోనే మొదటి ఇంటర్నేషనల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సెంటర్ గా గిఫ్ట్ సిటీ ఉంది.మొత్తం 866 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గిఫ్ట్ సిటీలో ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)తో పాటు అనేక సంస్థలు,కంపెనీలు,బ్యాంకలు,ఫిన్ టెక్ సంస్థలు ఉన్నాయి..గిఫ్ట్ సిటీని నేషనల్ హైవేస్ తో పాటు రైల్వే,మెట్రో రైల్వే లైన్ లకు కనెక్ట్ చేసారు...గిఫ్ట్ సిటీకి సంబంధించిన పూర్తి సమాచారంతో పాటు అక్కడ కార్యకలాపాల గురించి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా గుజరాత్ అధికారులు వివరించారు.

## కార్పొరేట్‌కు దీటుగా యంగ్ ఇండియా విద్యాలయాలు

>> అన్నారు. రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు స్థిరీకరణకు సంబంధించిన ప్రాజెక్టులను నిర్మించేందుకు కృషి చేస్తున్నామని, తద్వారా భూగర్భ జలాలను అభివృద్ధి చేయడం ద్వారా పంటల సాగును పెంచివ్యవసాయ రంగాన్ని రైతున్నను రాజుగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

## ఆర్టీసీలో3,038 ఉద్యోగాలు

>> ఇప్పటికే ప్రజా పాలన ప్రభుత్వంలో నిరుద్యోగులకు పెద్దపీఠ వేస్తూ దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ఇప్పుడు మరోసారి భారీస్థాయిలో ఉద్యోగాల నోటిఫికేషన్లను క్యాలండర్ ప్రకారం విడుదల చేయనుందని.. వాటిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని బాగా ప్రిపేర్ కావాలని మంత్రి సూచించారు.
ఆర్‌టిసిలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ జరుగుతుండడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

## ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశానం

>> విలువల ప్రాముఖ్యతను చెప్పారు. 'ఈ ప్రపంచంలో శాంతి సాధించడానికంటే ముందు, భారత్ సామాజిక ఐక్యత సాధించడం అవసరం. హిందూ సమాజానికి పునాదిగా భావించే సంస్కారం (విలువలు), సాంస్కృతిక విలువలు, సంప్రదాయం, నైతిక సూత్రాల పేరుతో ఆ చీకటి లోయల లోతుల్లో పాతుకుపోయిన ఈ సమాజ ఆలోచన తీరును నిర్మూలించాలి. కుల విభేదాలకు పూర్తిగా స్వస్తి పలకాలి" అని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.
'నైతిక విలువలను పాటిస్తూ మన సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోవాలి. అన్ని వర్గాల వారిని ఇళ్లలోకి ఆహ్వానించాలి. ఈ విషయంలో ఎలాంటి భేదాలు చూపకూడదు. అట్టడుగు స్థాయి నుంచి సామరస్యాన్ని, ఐక్యతను వ్యాప్తి చేయాలి. సంస్కారం అనే పునాదిపై మన కుటుంబ వ్యవస్థ, దాని విలువలు రూపుదిద్దుకున్నాయి. ఇది సమాజంలో ప్రాథమిక యూనిట్‌గా ఉంటోంది. జాతీయవాదం, సామాజిక ఐక్యత పునాదులను మరింత బలోపేతం చేసేందుకు అన్ని పండుగలను సామూహికంగా నిర్వహించడం ఎంతో కీలకం" అని మోహన్ భగవత్ పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 21-04-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.అష్టమి సా.6.53
ఉత్తరాషాఢ మ.12.33
వర్జ్యం సా.4.34-6.10
దు.మ.12.32-మ.1.22, 2)మ.3.03-3.53
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారంతో ఊరట చెందుతారు.

**వృషభం :** మీలోని ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలలో అనూహ్య లాభాలురాగలవు.

**మిథునం:**బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కర్కాటకం:**విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తప్పవు.

**సింహం:** గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు. సోదరుల కలయిక.

**కన్య :**సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**తుల :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి.

**వృశ్చికం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం.

**ధనుస్సు:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.

**మకరం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సోదరుల నుండి ధనలాభం పొందుతారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మీనం:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.శుభకార్యాలలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హైదరాబాద్‌లో ఎకో టౌన్

>> మారిందో మేయర్ టేకుచి వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణతో పంచుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... సుస్థిరత ఇకపై ఐచ్ఛికం కాదు అవసరం అని అభిప్రాయపడ్డారు. ఉపాధి కల్పన, అభివృద్ధి, సంపద సృష్టితో పాటు పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఎకో టౌన్ అభివృద్ధి చేయటం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమై పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమనే విశ్వాసాన్ని వ్యక్తపరిచారు.
ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా వృద్ధి చెందిందని అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితో పాటు తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన జపాన్ కంపెనీల పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని అన్నారు. హైదరాబాద్- కిటాక్యూషు రెండు నగరాల మధ్య విమాన ప్రయాణ ఏర్పాటు చేయాలనే అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. హైదరాబాద్‌లో జపనీస్ భాషా పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జపాన్‌లో యువ శక్తి అవసరం ఎక్కువగా ఉందని, మన యువతకు జపనీస్ భాషపై నైపుణ్యం కలిగిస్తే, అంతర్జాతీయంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం మురాసాకి పునరుజ్జీవన ప్రాజెక్టును సందర్శించింది. గతంలో కాలుష్య కాసారంగా ఉన్న ఈ నది, పరిశుభ్రమైన నదీతీరంగా మారిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు.

# నేటి నుంచి భారత్‌లో యుఎస్ వైస్ పర్యటన

>> గుర్తించిన దేశానికి పరిచయం చేయడం కోసమే అన్నట్లుగా పర్యటన సాగుతోంది. ఈ పర్యటనలో ముఖ్యంగా ప్రధాని మోడీతో సమావేశం ఆతర్వాత సాయంత్రం ప్రధానమంత్రి అధికారిక నివాసంలో ఆతిథ్యం ఇవ్వనున్న విందు మాత్రమేనని అధికారవర్గాలు తెలిపాయి. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సహా అనేక మంది క్యాబినెట్ మంత్రులు మరియు భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకులు ఈ విందుకు హాజకానున్నారు. వాన్స్ ఇప్పుడు షెడ్యూల్ కంటే కొన్ని గంటలు ఆలస్యంగా రాజధానికి విమానంలో చేరుకుంటారని భావిస్తున్నారు దీనివల్ల కొన్ని సమావేశాలు ఇకపై ప్రణాళికలో భాగం కావని తెలుస్తోంది. 22,23 తేదీలలో సౌదీ అరేబియాకు వెళ్లనున్నందున మోడీ కూడా ఈ వారం బిజీ షెడ్యూల్‌లో ఉన్నారు. వాన్స్ రాకతో విమానాశ్రయంలో ఆయనకు గౌరవ వందనం ఏర్పాటుచేస్తారు. వాన్స్ వచ్చిన కొన్ని గంటల తర్వాత సెంట్రల్ ఢిల్లీలోని భారతీయ తయారీ హస్తకళలు మరియు వస్త్రాల కోసం ఒక అవుట్‌లెట్‌లో షాపింగ్‌కు వెళ్లాలని భావిస్తున్నారు, ఈనెల 18న ప్రారంభమైన వారం రోజుల రెండు దేశాల పర్యటనలో భారతదేశం రెండోదేశపర్యటనగా నిలుస్తోంది. ఇప్పటికే ఆయన ఇటలీకి వెళ్లారు. ఉపాధ్యక్షుడుగా వాన్స్‌కు భారత్ తొలిపర్యటన. ఫిబ్రవరిలో పారిస్‌లో జరిగిన యాక్షన్ సమ్మిట్ సందర్భంగా మోడీ మరియు వాన్స్ చివరిసారిగా కలుసుకున్నారు.జూలై వరకు ప్రస్తుతం నిలిపివేయబడిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం భారతదేశం యుఎస్ చర్చలు మరియు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యొక్క పరస్పర సుంకాలు న్యూఢిల్లీలో వాన్స్ అధికారిక సంభాషణలలో ఉంటాయని భావిస్తున్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గత వారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, భారతదేశం మరియు యుఎస్ సమగ్ర వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని మరియు వాన్స్ పర్యటన సందర్భంగా "అన్ని సంబంధిత సమస్యలు" చర్చించబడతాయని అన్నారు. ' ఫిబ్రవరి 13న మోడీ అమెరికా పర్యటన సందర్భంగా విడుదల చేసిన భారత్‌అమెరికా సంయుక్త ప్రకటన ఫలితాలను అమలు చేయడంలో పురోగతిని సమీక్షించడానికి ఈ పర్యటన ఇరుపక్షాలకు ఒక అవకాశం అని పేర్కొన్నారు. ప్రాంతీయ మరియు ప్రపంచ పరిణామాలపై కూడా ఇరుపక్షాలు అభిప్రాయాలను మార్పిడి చేసుకుంటాయని అది తెలిపింది.మోదీ ఆతిథ్యం ఇచ్చిన విందు తర్వాత, వాన్స్ సోమవారం రాత్రి న్యూఢిల్లీ నుండి జైపూర్‌కు వెళ్తారు. 22న వాన్స్‌కు రాజస్థాన్ గవర్నర్ మరియు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. రాజస్థాన్‌లో వాన్స్ కుటుంబం అమెర్ ఫోర్ట్, జంతర్ మంతర్, సిటీ ప్యాలెస్ మరియు హవా మహల్‌లను సందర్శించనున్నారు. అదేరోజు వాన్స్ రాజస్థాన్ అంతర్జాతీయ కేంద్రంలో ప్రసంగిస్తారు, తరువాత రాజకీయ మరియు వ్యాపార నాయకులతో కొన్ని సమావేశాలు సమావేశాలు నిర్వహిస్తారు. 23న వాన్స్ తాజ్ మహల్‌ను సందర్శించడానికి ఆగ్రాకు వెళతారు. రైసినా సంభాషణ కోసం న్యూఢిల్లీకి వెళ్లిన మొదటి సభ్యురాలు నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ భారతదేశానికి చేసిన పర్యటన తర్వాత వాన్స్ పర్యటన జరుగుతోంది.పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత వాన్స్ చేస్తున్న మూడవ విదేశీ పర్యటన ఇది. ఫిబ్రవరిలో వాన్స్ పారిస్ మరియు మ్యూనిచ్‌లను సందర్శించారు, వాక్ స్వాతంత్ర్యం మరియు రక్షణ ఖర్చులపై సెన్సార్‌షిప్ కోసం యూరోపియన్ మిత్రదేశాలను విమర్శిస్తూ బహిరంగ కార్యక్రమాలలో ఆయన చేసిన వ్యాఖ్యలు మితవాద శక్తులకు మద్దతుగా భావించడంతో దుమారం రేపాయి.వాన్స్ తన భార్య ఉషాచిలుకూరితోపాటు వాల్ట్‌తో మార్చిలో గ్రీన్‌ల్యాండ్‌ను సందర్శించాడు

# విద్యార్థి మొబైల్‌కి ఎప్‌సెట్ ఫలితాలు!

>> మొబైల్ నంబర్లకే వారి ఫలితాలను పంపించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎప్ సెట్ ఫలితాలను విద్యార్థుల మొబైల్ నంబర్లకు పంపించడానికి సంబంధించి ఎటువంటి టెక్నికల్ సమస్యలు రాకుండా యూనివర్సిటీ దృష్టి పెట్టినట్టు తెలిసింది. ఇప్పటి వరకు ఎంసెట్ రిజల్ట్స్ విద్యార్థులు వారి ఫలితాలను చూసుకోవాలంటే సర్వర్ సమస్యలు వస్తుండేవి.. వెబ్‌సైట్‌లో సమస్యలు ఉండేవి. దీంతో విద్యార్థులు తమ ఫలితాలను చూసుకోవడానికి కొంత టెన్షన్ పడేవారు. తమకు ఎంత ర్యాంక్ వచ్చిందో అనే టెన్షన్‌తో సర్వర్ సెట్ అయ్యే వరకు, వెబ్‌సైట్‌లో తమ నంబర్ కనిపించి ర్యాంక్ తెలిసే వరకు ఆందోళన పడేవారు. ఈ ఏడాది నుంచి విద్యార్థులకు అటువంటి టెన్షన్, ఆందోళన లేకుండా నేరుగా విద్యార్థి మొబైల్ నంబర్‌కే వారి ఫలితాలను పంపించడానికి జెఎన్‌టియూ చర్యలు తీసుకుంటోంది. ఇలా విద్యార్థుల ఫలితాలు వారి రిజిస్టర్ మొబైల్ నంబర్లకు పంపిస్తే.. రిజల్ట్స్ అనౌన్స్ చేసిన కొద్ది సెకన్లలో వారికి తమ ఫలితాలు తెలిసిపోతాయి. దీంతో విద్యార్థులు తమ ఫలితాల కోసం ఎక్కడికో నెట్ సెంటర్‌కో లేకపోతే ల్యాప్‌టాప్, కంప్యూటర్లలోనూ చూసుకోవల్సిన అవసరం లేకుండా పోతుంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అయితే వీటి కోసం ప్రత్యేకంగా మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. నేరుగా తమ ఫలితాలను వారి మొబైల్‌లోనే చూసుకునేలా జెన్‌టియూ చర్యలు తీసుకుంటోంది. యూనివర్సిటీ నుండి వచ్చే మెసేజ్‌లో అభ్యర్థులకి సంబంధించిన ర్యాంక్, సబ్జెక్టుల వారీగా మార్కులతోపాటు ఇతర పూర్తి వివరాలు ఉండనున్నాయి. ఎప్‌సెట్-2025కి సంబంధించి ఇప్పటి వరకు 3,05,790 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2.19 లక్షల మంది ఇంజనీరింగ్‌కి, 86వేలకిపైగా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నారు.
వారిలో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను ఈ నెల 29, 30తేదిల్లో నిర్వహించనున్నారు. వారి హాల్ టికెట్లను ఇప్పటికే అందుబాటులో పెట్టారు. మే 2 నుంచి 4 వరకు జరిగే ఇంజనీరింగ్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 22 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు. అయితే ఈసారి హాల్ టికెట్లపై అభ్యర్థులు తమ కేంద్రాలను నావిగేట్ చేయడానికి సహాయపడే క్విక్ రెస్పాన్స్(క్యూఆర్) కోడ్ ఉంటుంది. స్మార్ట్‌ఫోన్‌తో కోడ్‌ను స్కాన్ చేస్తే.. గూగుల్ మ్యాప్స్ అప్లికేషన్‌లో ఒక లింక్ ఓపెన్ అవుతుంది.. అది విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలకు వారి రూట్ మ్యాప్‌ను వీక్షించడానికి వీలు కల్పిస్తుంది. ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకుని వారు కేంద్రానికి ఎంత దూరం ఉంది.. పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందనేది కూడా నిర్ధారించవచ్చు. ఈ ఏడాది నుంచే హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేయగా.. అదే పద్ధతిలో ఎప్ సెట్ ఫలితాలను సైతం విద్యార్థి మొబైల్‌కే పంపించడానికి జెఎన్‌టియూ చర్యలు తీసుకుంటోంది.



పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఇటీవల జరిగిన హింసకు వ్యతిరేకంగా ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో నిరసన తెలుపుతున్న ప్రజలను చెదరగొడుతున్న పోలీసులు

# కిటాక్యూషూ నగరంలో సిఎం బృందం పర్యటన

## రైజింగ్ బృందానికి తెలుగులో ఘనస్వాగతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్20:** జపాన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. ఇప్పటికే సిఎం పర్యటనలో రూ.11వేల కోట్ల పెట్టుబడులు, ఒప్పందాలు కుదిరాయి. ఈ పర్యటనలో భాగంగా ఆదివారం సిఎం బృందం కిటాక్యూషూ నగరంలో పర్యటించారు. వీరికి అక్కడ సాంప్రదాయ నృత్యరీతిలో ఘనంగా స్వాగతం పలికారు.
నగర మేయర్ కజుహిసా టేకుచీతో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు,అధికారులను ఘనంగా సత్కరించారు. మేయర్‌తో తెలంగాణ బృందం చర్చలు జరిపింది. చర్చల్లో భాగంగా మేజర్ ప్రకటన వెలువడే అవకాశం ఉందని సిఎంవో కార్యాలయం వెల్లడించింది. నగర సందర్శనపై మంత్రి శ్రీధర్‌బాబు ట్వీట్ చేస్తూ వేల మైళ్ల దూరంలో తెలుగులో స్వాగత సందేశం నిజంగా నన్ను కదిలించింది. భాష హృదయాలను కలుపుతుందని గుర్తు చేసే అందమైన జ్ఞాపకమని ట్వీట్ చేశారు. కాగా కిటాక్యూషూ నగరానికి ఎంతో చరిత్ర ఉంది. సుస్థిరత, రీసైక్లింగ్, ఆవిష్కరణ, పర్యావరణ సంరక్షణకి కిటాక్యూషూ నగరం ప్రసిద్ధి చెందింది. ఒకప్పుడు జపాన్‌లోనే అత్యంత కాలుష్య నగరంగా ఉండే కిటాక్యూషూ.. ఇప్పుడు ప్రపంచంలోనే పర్యావరణ రక్షణలో ఈ నగరం ఉదాహరణగా నిలిచింది. ఈ నగరం నుంచి పర్యావరణాన్ని తీర్చిదిద్దిన తీరును సిఎం బృందం పరిశీలించింది. ఈ నెల 22 వరకూ సిఎం బృందం జపాన్ పర్యటన కొనసాగనుంది.

# జోరందుకున్న వరి కోతలు

>> విక్రయిస్తున్నారు. రాష్ట్రంతో పాటు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు చేల వద్దే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడమే కాకుండా, రైతులు కోసిన ధాన్యాన్ని ఆరబోసి నిల్వ ఉంచే పరిస్థితులు లేకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరలకే విక్రయించి నష్టపోతున్నారు. తరుగు మూడు కిలోలు తీస్తున్నా పచ్చి ధాన్యం కావడం, మరోపక్క చేతిలో డబ్బులు పడిపోవడంతో కోసిన వరి గింజలు కోసినట్లే అమ్మేస్తున్నారు.
కోసిన రోజునే పంట చేలు వద్ద కాంట పెట్టి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కర్నాటకలోని బళ్లారి, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, గుంటూరు, నెల్లూరు తదితర జిల్లాల నుండి వచ్చిన వ్యాపారులు ధాన్యాన్ని కోసిన వెంటనే కొనుగోలు చేస్తున్నారు. కేంద్రం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 గా ధరను నిర్ణయించింది.
ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో సన్న రకాలను కామన్ వెరైటీ కింద పరిగణలోకి తీసుకోవడంతో రైతులకు ముందుగానే చేతికి వస్తుండడంతో బయటి వ్యాపారులకే ఎక్కువ అమ్మకాలు చేస్తున్నారు. రైతులు వరి కోత యంత్రాలతో కోయగానే, అదే రోజు ధాన్యాన్ని చేను వద్దనే బస్తాల్లో నింపి తూకం వేస్తున్నారు. కొనుగోలు పూర్తి చేసి వ్యాపారులు ధాన్యాన్ని తమ ప్రాంతాలకు లారీల ద్వారా తరలిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అయితే అవి ఆలస్యంగ ప్రారంభించడం, తేమ శాతం 17 లోపు ఉంటేనే మద్దతు ధరలకు కొనుగోలు చేయడం, అంతకు మించి ఉంటే రెండు మూడు రోజులు ఆరబోసిన తర్వాత కాని తీసుకోవడం జరగదు. అదే ప్రైవేటు వ్యాపారాలు కోసిన రోజునే తేమ శాతం 30 నుండి 35 శాతం మధ్య ఉన్నా కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం 70 కిలోల బస్తా ద్వారా తూకం వేస్తూ బస్తాకు 3 కిలోలల చొప్పున తరుగు తీస్తున్నారు. పచ్చి ధాన్యాం కావడం, కొనుగోలు చేసిన వెంటనే చేతిలో డబ్బు వేయడంతో ప్రైవేటు వ్యాపారులకే రైతులు విక్రయిస్తున్నారు.

# ఈ యేడాదే 'ఉప పోరు'

>> తెలం గాణ భవన్‌లో రాజేంద్ర నగర్ ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీలో అత్తాపూర్ డివిజన్ నుండి శ్రీరామ్ రెడ్డి, పలు పార్టీల నేతలు చేరారు. వారందరికి కేటీఆర్ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తర్వాత కెటిఆర్ మాట్లాడుతూ ఉప ఎన్నికలు ఈ ఏడాదిలోనే వస్తాయని,అందరూ సిద్దంగా ఉండాలని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వడంతో తినే కంచంలో మన్ను పోసుకున్నట్లుయిందని, సిఎం రేవంత్‌రెడ్డి మాటలన్నీ బోగస్, 6 గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేయలేదన్నారు. బస్సుల్లో ఆడవాళ్లు కొట్టుకునే పరిస్థితి వచ్చిందని. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా క్షీణించిందని పేర్కొన్నారు. పదేండ్ల పాటు సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెద్దుల్లాగా కేసీఆర్ పరుగులు పెట్టించారని, మొన్నటి ఎన్నికల్లో మనం ఓడిపోవడంతో మనకు జరిగిన నష్టం తక్కువ.. కానీ మన ఓటమితో తెలంగాణ సమాజానికి ఎక్కువ నష్టం జరిగింది. ఇది అక్షర సత్యం, వాస్తమని కేటీఆర్ స్పష్టం చేశారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఆకాశ స్థాయికి తీసుకుపోయి స్వరాష్ట్రాన్ని సాధించిన గులాబీ జెండా.. మన నాయకుడు కేసీఆర్. ఈ రికార్డును ఎవరూ చెరపలేరు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని ఎవరన్న అనుకుంటే అది వారి అజ్ఞానం. రేవంత్ రెడ్డి మీద నోరుపారేసుకుని మన నోరును కరాబ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఎవరికి తెలంగాణ మీద ప్రేమ ఉంటది.. రైతులకు, పేదలకు, విద్యార్థులకు, మహిళలకు లాభమైతది అని చర్చ పెట్టాలి అని కేటీఆర్ సూచించారు. బీజేపీ దేశంలో మతం పిచ్చి లేపడం తప్ప చేసిందేమీ లేదు. ప్రపంచ ర్యాంకుల్లో వివిధ రంగాల్లో వెనక్కి పోతున్నాం. రేవంత్ నాయకత్వంలో తెలంగాణ వెనక్కి పోయినట్టే.. మోదీ నాయకత్వంలో దేశం వెనక్కి పోతుంది. నెగెటివ్ పాలిటిక్స్ తప్ప బీజేపీ చేసిందేమీ లేదు. మనం కేంద్రానికి ఇచ్చేది రూపాయి అయితే వాపస్ 45 పైసలు వస్తుంది. ఈ దేశానికి సాదుతున్న రాష్ట్రాల్లో మన తెలంగాణ కూడా ఒకటి. మత పిచ్చి అనేది మంచిది కాదు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయకూడదు. హిందువులు ప్రమాదంలో ఉన్నారట. 2014 వరకు మంచిగా ఉన్న హిందువులు ఇప్పుడు ప్రమాదంలో ఉన్నరాట. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి లేని పంచాయితీ ఇప్పుడు ఎందుకు కొత్తగా పెడుతున్నారు. రాజకీయం కోసం దేశాన్ని విడగొడుతున్నారు. మంచి పనులు చేసి ఓట్లు అడగాలి. హిందు, ముస్లిం, పాకిస్తాన్, జై శ్రీరాం, మోదీ.. ఈ ఐదు పదాలు చెప్పకుండా ఓట్లు అడిగేటోళ్లు ఎవరైనా ఉన్నారా..? అని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణకు సంబంధించినంత వరకు అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ రెండు శత్రువులే అని కేటీఆర్ పేర్కొన్నారు.

## మేధావుల కోసం ప్రపంచం చూపు భారత్ వైపు

>> దోహదపడుతుందని విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. భారత్ ఆత్మ నిర్భరత సాధించే దిశగా కంపెనీ ఐసిఎస్‌సి లాంటి సంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆశిస్తున్నాను. 2047 నాటికి భారత్ వికసిత భారత్‌గా ఎదిగేందుకు భారత్‌తో పాటు ప్రపంచ దేశాల్లో వ్యాపార రంగం అభివృద్ధి చెందేందుకు మీలాంటి ప్రొఫెషనల్స్, మీ నైపుణ్యం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

## హైడ్రా లాగా.. కోబ్రా తీసుకొస్తాం: కార్తీక్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 20:** కాంగ్రెస్ నేతలపై బిఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి విమర్శలు చేశారు. ఆదివారం తెలంగాణ భవన్ లో రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి అధ్యక్షతన అత్తాపూర్ డివిజన్ నుండి పలు పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్.. వారికి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కార్తీక్‌రెడ్డి మాట్లా డుతూ.. కాంగ్రెస్ పాలన ఎలా ఉందంటే హైవే రోడ్డు మీద పడ్డ మందు లారీ లెక్క అయిందని ఎద్దేవా చేశారు. ఎవరికి దొరికినంత వాళ్లు దోచుకొని పోదాం అనే తప్ప.. పార్టీని బతికిద్దాం అని ఎవరికి లేదన్నారు. కాంగ్రెస్ వాళ్లు హైదరాబాద్ అసెట్ ప్రొటెక్షన్ అని హైడ్రా ఎలా తీసుకొచ్చారో.. మేము కాంగ్రెస్ వాళ్ల కబ్జాచేసిన వాటిని తిరిగి తీసుకురావడానికి కోబ్రా అని తెస్తామని ఆయన అన్నారు.

## నత్తనడకన సూర్యఘర్ పథకం

### 10 లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్

### విద్యుత్, బ్యాంకు అధికారుల నిరాసక్తత

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** పునరుత్పాదక ఇంధ విధానాన్ని వస్తృతంగా అందుబాటులో తీసుకురావలనే ఉద్దేశంతో కేంద్రం అమలు చేస్తున్న సూర్య ఘర్ యోజన పథకం నత్తనడకగా సాగుతోంది. ఈ పథకం కింద ఇప్పటి వరకూ 10 లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్‌టాప్ సోలార్ చొరవగా పేరుగాంచిన ఈ పథకం అమలులో కొన్ని బ్యాంకులు, విద్యుత్ శాఖ అధికారులు మోకాలడ్డుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో శాంక్షను అయిన గృహాలకు బ్యాంకులు రుణాలు ఇవ్వకపోగా, విద్యుత్ శాఖకు చెందిన కొందరు అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. తమకు నెల నెలా వచ్చే విద్యుత్ బిల్లుల ఆదాయం పడిపోతుందనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఈస్టన్ పవర్ డిస్ట్రిబ్యూటరీ సంస్థతో సహా రెండు రాష్ట్రాల్లోని పలు విద్యుత్ పంపిణీ సంస్థలు సోలార్ విద్యుత్ విషయంలో ఆసక్తి చూపించడం లేదు. ఇందుకు ఎస్‌బిఐ తదితర బ్యాంకులకు చెందిన కొన్ని శాఖల అధికారులు కూడా రుణాలు ఇచ్చేందుకు కొర్రీలు వేస్తూ దరఖాస్తులను రిజక్ట్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోపక్క అక్టోబర్ నాటికి ఈ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. 2027 మార్చి నాటికి కోటి ఇళ్లకు సౌరశక్తిని సరఫరా చేయాలనే ఉద్దేశంతో కేంద్రం ఉంది. కాగా గృహ యజమానులకు సౌర ఫలకాలను అమర్చుకోవడానికి 40శాతం వరకు సబ్సిడీ ఇస్తారు. 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు 6.75 శాతం సబ్సిడీ వడ్డీ రేటుతో రూ. 2 లక్షల వరకు పూచీకత్తు లేకుండా రుణాలను అందిస్తున్నాయి. రూ. 78వేల వరకు సబ్సిడీ లభించనుంది. రూ.6 లక్షల వరకు రుణం తీసుకునే ఛాన్స్ ఉంటుంది. రూ.2 లక్షల వరకు రుణాలకు ఎలాంటి ఆదాయ పత్రాలు అవసరం లేదు. మొత్తం ఖర్చులో 90 శాతం వరకు బ్యాంకు ఫైనాన్స్ సదుపాయం ఉంటుంది.

## పత్తి విత్తన ధర రూ.37 పెంపు

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** పత్తి విత్తనాల ధరలను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఒక్కో ప్యాకెట్‌పై 37 రూపాయల చొప్పున పెంచింది. ప్రధానంగా బీటీ2 పత్తి విత్తన ప్యాకెట్ల ధరను పెంచింది. ప్రస్తుతం పత్తి విత్తనాలకు సంబంధించి 864 రూపాయలు ఉన్న ప్యాకెట్ ధరను 901 రూపాయలకు పెంచింది. దీంతో రైతులపై ఒక్కో ప్యాకెట్‌పై రూ. 37 చొప్పున 2 కోట్ల ప్యాకెట్లకు గానూ రూ.74 కోట్ల భారం పడనుంది. రాష్ట్రంలో ఈ వానకాలం సీజన్‌లో సుమారు 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. ఎకరానికి 2 ప్యాకెట్ల చొప్పున మొత్తం కోటి ప్యాకెట్లు అవసరం అవుతాయి. ప్రభుత్వం 2.4 కోట్ల విత్తన ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది. రైతులు 2 కోట్ల ప్యాకెట్లు కొనుగోలు చేస్తారని అంచనాలున్నాయి.

## దుబాయిలో చిక్కుకున్న లింగయ్యకు ఆపన్నహస్తం

### సిఎం రేవంత్, మంత్రి పొన్నంకు సెల్ఫీ విడియో పంపిన బాధితుడు

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** తాను దుబాయిలో చిక్కుకున్నాను.. రక్షించండి.. అంటూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన చొప్పరి లింగయ్య అనే గల్ఫ్ కార్మికుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వేడుకుంటూ ఇటీవల ఒక సెల్ఫీ వీడియో పంపించాడు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్ దృష్టికి తీసికెళ్లారు. ఆయన దుబాయిలోని సామాజిక సేకులు సుతారి సత్యం పటేల్‌ను సంప్రదించి లింగయ్యకు అవసరమైన సహాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా దౌత్య ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయి.

# ప్రతీ రైతుకు ప్రత్యేక ఐడి కార్డు

### కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి చతుర్వేది

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** దేశంలోని ప్రతి రైతుకు ఆధార్ కార్డు మాదిరిగానే తనదైన ప్రత్యేకమైన రైతు ఐడి కార్డులు ఇచ్చేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది. రాబోయే మూడు సంవత్సరాలలో ఆరు కోట్ల మంది ఈ కార్డులను పొందనున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నిర్వహించే ఈ ఐడిలు, భూమి రికార్డులు, పశువుల యాజమాన్యం, నాటిన పంటలు మరియు పొందిన ప్రయోజనాలతో సహా వివిధ రైతు సంబంధిత డేటాకు అనుసంధానించబడతాయి. రైతుల విశ్వసనీయ డిజిటల్ గుర్తింపుగా సేవలందిస్తూ, ఇది దేశంలోని అగ్రిస్టాక్‌లో కీలకమైనదిగా ఉంటుందని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి దేవేశ్ చతుర్వేది వెల్లడించారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేసే దిశగా ప్రభుత్వం త్వరలో దేశవ్యాప్తంగా రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కార్డును అందించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించనునట్లు తెలిపారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) మరియు కిసాన్ క్రెడిట్ కార్డ్ ప్రోగ్రామ్‌తో సహా వివిధ వ్యవసాయ పథకాలను రైతులకు ఎక్కువ ఇబ్బంది లేకుండా యాక్సెస్ చేయడంలో యూనిక్ ఐడి సహాయ పడుతుందని పేర్కొన్నారు. ఇది పంట రుణం మరియు పంట బీమాతో సహా రైతులకు సేవలు మరియు పథకాల డెలివరీని క్రమబద్ధీకరించడానికి రైతుకేంద్రీకృత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా రూపొందించబడుతోంది.

రైతుల ఐడీలు (రైతుల రిజిస్ట్రీ) కలిగి ఉండటంతో పాటు, అగ్రిస్టాక్‌లో జియోరిఫరెన్స్ చేయబడిన గ్రామ పటాలు మరియు పంట విత్తనాల రిజిస్ట్రీ ( డిజిటల్ పంట సర్వే ) కూడా దాని భాగాలుగా ఉంటాయని చెప్పారు. వ్యవసాయ రంగం డిజిటలీకరణ పైలట్ ప్రాజెక్టును మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్‌లో అమలు చేశామని, మరో 19 రాష్ట్రాలు ఇందులో భాగ స్వామ్యం కావడానికి సమ్మతించాయని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఆధార్ తరహా ఐడీ కార్డులను అందజేస్తామని చతుర్వేది తెలిపారు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈ ఐడీ ద్వారా రైతులు తాము పండించిన పంటలను కనీస మద్దతు ధరకు అమ్ముకోవడానికి, కిసాన్ క్రెడిట్ కార్డులను ఉపయోగించుకోవచ్చని వివరించారు.

# బిజెపితో సమరానికి మూడు పార్టీలు కుమ్మక్కు



ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

### ఇది సిద్ధాంతపరమైన యుద్ధం: ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** బిజెపితో పోరాడేందుకు మూడు పార్టీలు కుమక్కు అయ్యా యని, ఈ ఎన్నికల్లో జరిగేది సిద్దాంతపరమైన యుద్ధమని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బిజెపితో పోటీ పడేందుకు ఎంఐఎం, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు అయ్యాయని అన్నారు. అసలు ఎంఐఎం పార్టీకి సెక్యూలర్, అంబేద్కర్ అనే పదాలు వాడే హక్కుందా అని ప్రశ్నించారు. అలాగే యాంటీ సెక్యూలర్ పార్టీ అయిన ఎంఐఎంకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం కరెక్టేనా అన్నారు. ఎంఐఎంకు మద్దతు ఇస్తున్న టిఆర్ఎస్, బిఆర్ఎస్ పార్టీ వాళ్లు సెక్యూలర్ అనే పదం వాడే హక్కుందా అని నిలదీశారు. అసదుద్దీన్‌కు లొంగిపోయి, ఎంఐఎంకు మద్దతు ఇచ్చేందుకేనా బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో నిలబ డటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐ ఎం లేకుంటే బ్రతకలేదని అందుకే వారికి లొంగి పోయారని అన్నారు.

ఒక మతం కాదు దేశం గురించి ఆలోచించడమే సెక్యూలర్ భావజాలం అని అంబేద్కర్ చెప్పారని, ఎంఐఎంకు మద్దతు ఇస్తున్న బిఆర్ఎస్ కాంగ్రెస్‌లకు సెక్యూలర్ అనే పదం వాడే హక్కు లేదని అన్నారు. శనివారం జరిగిన ఓ మీటింగ్ లో ఎంఐఎం నేత అసదుద్దీన్ మోడీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, కెసిఆర్‌తో పొత్తు ఉండి ఆయన కూడా అదే భాష వాడుతున్నారని చెప్పారు. ఆయన ఏం భాష మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని, ఆయన చదువు కున్న చదువు ఇదేనా అని ఎద్దేవా చేశారు. ప్రజల కోసం బిజెపి చేస్తున్న కార్యక్రమాలు అన్నింటికీ కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకంగా ఉన్నాయని ఆరోపించారు. ఇక ఇఆర్ఎస్ వాళ్లని ఎన్నికల్లో ఓటు వేయొద్దని పార్టీ పెద్దలు చెబు తున్నారని, వాళ్లు ఇంట్లో కూర్చొని ఎంఐఎంకు మద్దతు ఇస్తున్నారని హాట్ కామెంట్స్ చేశారు. చదువుకున్న వాళ్లంతా ఓటువేసే ముందు ఆలోచిం చాలని, నిజంగా సెక్యూలర్ భావజాలం ఉంటే, దేశ భక్తి ఉంటే, భారతీయులు అందరూ ఒక్కటే అనుకుంటే ఆత్మ పరిశీలన చేసుకొని ఓటు వేయా లని సూచించారు. అలా ఓటు వేస్తే బిజెపి అభ్యర్థి గౌతమ్‌రావు కచ్చితంగా గెలుస్తారనే నమ్మకం తనకు ఉందని అన్నారు. ఈ ఎన్నికల్లో జరిగేది సిద్ధాంత యుద్ధమని, ఒక మతతత్వ పార్టీకి, సెక్యూలర్ పార్టీకి జరుగుతున్న యుద్ధమని, అం దరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

# వ్యవసాయ మార్కెట్లలో సెక్రటరీల కొరత

### అదనపు భారంతో ఇన్‌ఛార్జీలు

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పలు వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల్లో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా సెక్రటరీల కొరత మార్కెట్లకు పెద్ద సమస్యగా తయారైంది. రైతులు పండించిన ఉత్పత్తులను సేకరించే వ్యవసాయ మార్కెట్లపై పర్యవేక్షణ కొరవడింది. రాష్ట్రంలోని పలు ప్రధాన మార్కెట్లు సైతం ఇన్‌చార్జీల పాలనలో కొనసాగుతున్నాయి. ఒక్కో సెక్రెటరీకి మూడు, నాలుగు మార్కెట్ల బాధ్యతలు అప్పగించడంతో పని ఒత్తిడితో సతమతం అవుతు న్నారు. దీంతో మార్కెట్ కార్యదర్శులు అదనపు భారంతో సరియైన విధంగా బాధ్యతలను నిర్వ ర్తించలేక పోతున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేడరుకు చెందిన దాదాపు 400కు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సంబంధిత అధికారవర్గాల ద్వారా వెల్లడవుతోంది. ఈ విధంగా రాష్ట్రంలోని ఒక్క జగిత్యాల జిల్లాలో 13 వ్యవసాయ మార్కెట్లలో 48 పోస్టులు మంజూరు కాగా 12 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన 36 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మార్కెట్లలో సెక్రెటరీతో పాటు అసిస్టెంట్ సెక్రెటరీ, అటెండర్, జూనియర్ మార్కెట్ ఆఫీసర్, మార్కెట్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్, ఎల్‌డీసీ, అకౌంటెంట్, టైపిస్టు వివిధ పోస్టులు ఉండాలి. పలు పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల పనిభారం అధికమై అధికారులు, సిబ్బంది సతమతమవుతున్నారు. ఫలితంగా రాష్ట్రంలోని పలు మార్కెట్‌లో పర్యవేక్షణ కరువైంది.

రెగ్యులర్ సెక్రెటరీలు ఉన్నట్లయితే ఎప్పటిప్పుడు రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటారు. పంట కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని నియంత్రి స్తారు. కానీ ఇన్‌చార్జీల పాలన ఉండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని రైతాంగం చెబుతోంది. ఇన్‌చార్జీల పాలన కొనసాగు తుండడంతో మార్కెట్లలో వ్యాపారులు, అడ్తీదారులు, ఖరీదుదారులు, కమీషన్ ఏంజట్లదే ఇష్టారాజ్యంగా తయారైంది. వ్యవసాయ మార్కె ట్లలో నిబంధనల మేరకు కొనుగోళ్లు, చెల్లింపుల ప్రక్రియ జరగాల్సి ఉండగా అడుగడుగున రైతులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు అరోపణలు చోటు చేసుకుంటున్నాయి.

# ఉప్పల్ స్టేడియంలో నార్త్‌స్టాండ్‌కు నా పేరు తొలగించడం అన్యాయం

### మాజీ క్రికెటర్ అజారుద్దీన్

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** ఉప్పల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కు తన పేరును తొలగించడంపై ఇండియన్ క్రికెట్ మాజీ కెప్టెన్, క్రికెటర్ అజారుద్దీన్ అసహనం, అసంతృప్తి వ్యక్తం చేశారు. అజారుద్దీన్ పేరును ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్ నుంచి తొలగిం చాలంటూ అంబుడ్స్‌మెన్ జస్టిస్ ఈశ్వరయ్య ఆదేశిం చిన నేపథ్యంలో అజా రుద్దీన్ బంజారా హిల్స్ లోని తన నివాసంలో ఆది వారం విలేకరుల సమా వేశంలో మాట్లా డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పదేళ్ల పాటు ఇండియన్ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా, 19 యేళ్ల క్రికెటర్‌గా దేశ క్రికెట్ జట్టుకు సేవలందించానని అలాంటి తన పేరుపై ఉప్పల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కు అజారుద్దీన్ స్టాండ్‌గా పేరు పెట్టుకున్నారని దానిపై కొంతమంది కావాలని రాజకీయంచేసి లార్డ్స్ క్రికెట్ క్లబ్‌తో కోర్టుల్లో పిటిషన్ వేయించారని అన్నారు. తనపై వచ్చిన పలు ఆరోపణలను గతంలోనే కోర్టు కొట్టేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఒక హైదరాబాదీగా దేశం గర్వించే స్థాయిలో తాను ఎదిగానని కొంతమంది చేస్తున్న కుట్రలకు తాను న్యాయ పరంగా సమాధానం చెప్తానని అన్నారు. నా జీవితాన్ని క్రికెట్ కోసం అంకితం చేశానని ఎంతో కష్టపడ్డానని అన్నారు. అనాడు క్రికెట్ అభిమానుల కోరిక మేరకు తన పేరును స్టాండ్స్‌కు పెట్టారని అన్నారు. తనకు వేలాదిగా తన అభిమానులు, శ్రేయోభిలాషులు ఫోన్లు చేస్తున్నారని, నార్త్ స్టాండ్స్‌కు తన పేరును తొలగించడాన్ని వారు ఖండిస్తున్నారని అన్నారు.



బంజారాహిల్స్‌లో తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ క్రికెటర్ అజారుద్దీన్

## 27న మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

### నేటి నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో అడ్మిషన్ల కోసం నిర్వహించే మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్-2025ని ఈ నెల 27న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను నేటి(సోమవారం) నుంచి విద్యార్థులు మోడల్‌స్కూల్ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మోడల్ స్కూల్ అడిషనల్ డైరక్టర్ తెలిపారు. మోడల్ స్కూల్స్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో చేరే వారికి ఈ నెల 27న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. అలాగే 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం 27న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మోడల్ స్కూళ్లలోనూ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

## ప్రైవేట్ ఇంజినీరింగ్ బోధన, బోధనేతర సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి

### డిఎటిఎ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో ప్రసంగిస్తున్న డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్(డిఎటిఎ) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ మోయునుద్దీన్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్(డిఎటిఎ) ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ మోయునుద్దీన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ప్రజాకవి జయరాజు, ప్రొఫెసర్ ముత్తయ్య, ప్రొఫెసర్ విజయ్, ప్రొఫెసర్ వెంకట దాసు మారేడు, ప్రొఫెసర్ స్వామి దాసు, ప్రొఫెసర్ శ్రవణ్ కుమార్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, ప్రొఫెసర్ ఎం. నరసయ్య, ప్రొఫెసర్ శోభారాణి, ప్రొఫెసర్ శ్రీశోభ, ప్రొఫెసర్ బాగయ్య, కోల జనార్దన్, డాక్టర్ వనమాల, తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా సమా వేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల యజమాన్యాలు ఇంజి నీరింగ్ విద్యను వ్యాపారంగా మార్చి లాభాలు గడిస్తున్నా యని, అధ్యాపకులకు సరైన జీతాలు చెల్లించడం లేదని, విద్యార్థులకు నాణ్యత విద్యను అంద జేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేనే జ్‌మెంట్ బోధన, బోధ నేతర సిబ్బంది సమస్య లను పరిష్కరిం చడం లేదని, యుజీసీ, ఏఐ సీటీఈ, టిఎఎఫ్ఆర్‌సి లాంటి ప్రభు త్వరంగ సం స్థలను నిబంధ నలను పాటిం చడం లేదని, విద్యార్థులకు సరైన విద్యను గుణాత్మక విద్యను అందించడం లేదన్నారు. ఈ సమస్యలపై ప్రభు త్వ యూనివర్సిటీలు కనీసం స్పందించడం లేదని, ప్రవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యజ మాన్యంపై చర్యలు తీసుకోకుండా వారితో కుమ్మక్కై విద్యా ర్థులకు అధ్యాపకులకు నాన్ టీచింగ్ సిబ్బందికి అన్యాయం చేస్తున్నారని, ఈ అన్యా యాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉన్న ఉపా ధ్యాయులు, విద్యార్థులను మేధావులను బుద్ధి జీవులను ఏకంచేసి పోరాడుతామని తెలియజేస్తున్నాము.


## తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో బంకర్

### స్థావరాలను కూడా గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ముర్కరాజుగుట్టల అడ వుల్లో మావోయిస్టుల బంకర్‌ను సిఆర్‌పిఎఫ్‌కు చెందిన కోబ్రా బలగాలు గుర్తించాయి ఛత్తీస్ గడ్‌లోని బీజాపూర్ జిల్లా పరిధిలో ముర్క రాజుగుట్ట అటవీ ప్రాంతంలో ఈ బంకర్‌ను 160 చదరపు అడుగుల విస్తీర్ణంలో భూగర్భంలో పటి ష్టమైన కాంక్రీట్‌తో నిర్మించారు. ఇక్కడి నుంచి నక్సల్స్ ఖిల్లా అబూజ్‌మడ్ సమీంపలోనే వుండడంతో సిఆర్‌పిఎఫ్ బలగాలతో పాటు ఛత్తీస్‌గఢ్ రిజర్వ్ బలగాలు ఈ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. నక్సల్స్ ఏరివేత కోసం సాగుతున్న గాలింపులో భాగంగా కోబ్రా 208 బెటాలియన్ బలగాలకు ఈ బంకర్ కనిపించింది. జీడిపల్లి బేస్ క్యాంపు నుంచి గాలింపు చేబట్టిన బలగాలు దీనిని గుర్తించాయి. ఈ బంకర్‌లో విద్యుత్ ఉత్పత్తి కోసం ఆరు సౌర పలకాలు, ఆరు జెర్కెన్లు, రెండు సీలింగ్ ఫ్యాన్లు, నక్సల్స్ ధరించే యూనీఫాం వుండగా వాటిని భద్రతా బలగాలు జప్తు చేశాయి. మొదట ఈ బంకర్‌లో మందు పాతరలు వున్నాయేమోనని అనుమానించిన పోలీసులు బాంబు పేలుడు నిరోధక బృందంచేత తనిఖీలు చేయించాయి. అయితే అలాంటివి ఏమీ లేక పోవడంతో ఊపిరి పీల్చుకున్నాయి. కాగా ఈ బంకర్‌కు సమీపంలోనే అ త్యవ సర పరిస్థితుల్లో దాక్కునేందుకు మావోయిస్టులు 12 స్థావరాలు ఏర్పాటు చేసుకోగా వాటిని కూడా భద్రతా బలగాలు గుర్తించాయి. ఇందులో పేలుడు పదార్థాలు లేకపోవడంతో అన్నింటిని ధ్వంసం చేశారు. నక్సల్స్ అగ్రనేత హెడ్మాతో పాటు మరికొందరు ముఖ్య నేతలు ఇక్కద తలదాచుకుని వుండే వారని పోలీసులు స్థానికుల నుంచి అందిన సమాచారంతో పోలీసులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని బంకర్లు, స్థావరాలు వుంటాయనే అనుమానంతో భద్రతా బలగాలు గాలింపును కొనసాగిస్తున్నాయి.

# ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

- అంతర్జాతీయ స్థాయికి ఏపి • సుపరిపాలనతో సూపర్‌సిక్స్ అమలు చేస్తాం
- లక్ష్యాలకు ధీటుగా అమరావతి, పోలవరం నిర్మాణం • జన్మదిన వేడుకల్లో ఏపి సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఏప్రిల్20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సిఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. లక్ష్యాలకు అనుగుణంగా అంతర్జాతీయస్థాయిలో ఎపిని ప్రగతిపథంలో ముందజన నిలుపుదామన్నారు.పది నెలల మన ప్రభుత్వ పాలనలో మనం ఒక సంకల్పంతో ముందుకు వెళ్తున్నామన్నారు.రాజధాని అమరావతిని, పోలవరం ప్రాజెక్టును అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా నిర్మించుకుందామన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. తన 75వ జన్మదినం సందర్భంగా అభినందనలు తెలిపిన పార్టీ క్యాడర్‌కు, మంత్రులకు, ఎంఎల్ఏ, వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులకు ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా ధన్యవాదాలు తెలి పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రజలు అండతోను తమ ప్రభుత్వం అనుకున్న గమ్యాన్ని చేరుకుంటుందన్నారు. అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికల్లో 93 స్ట్రైక్ రేట్ తో చారిత్రాత్మక తీర్పును ఇచ్చి గెలిపించారు. వారి ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు తొలిరోజు, తొలిగంట నుంచి ప్రయత్నం చేస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు శాయశక్తులా కష్టపడుతున్నాం. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు వంటి పథకాలతో సంక్షేమం అమలు చేస్తూనే. మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సాధనతో అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నాం. ఎదురవు తున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం.

ఈ లక్ష్యాలనువేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలి. అసాధారణ, వేగ వంతమైన పనితీరు చూపితే తప్ప...విధ్వంస రాష్ట్రంలో పునర్నిర్మాణ ఫలితాలను ప్రజలకు చూపలేం. అందుకే ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరు టీం స్పిరిట్‌తో పనితీరుపై సమీక్షించుకుని పని చేయాలన్నదే మా ఆలోచన. అందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చాం. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో నేను కూడా నా స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉంది. పీపుల్ ఫస్ట్ విధానంతో నేను, నా కేబినెట్ సహచర మంత్రులంతా పనిచేస్తున్నాము. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగి నుంచి సిఎం వరకు అంతా కష్టపడి సమిష్టిగా పనిచేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి... సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలం. 2029 కల్లా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో 11 వేలకు పైగా ఈవీ బస్సులను ప్రవేశ పెట్టాలని భావిస్తున్నట్టు, అలాగే రాష్ట్రంలోని అన్ని బస్ స్టేషన్లపైనా రూఫ్ టాప్ సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పంటల సాగు విషయంలో రైతులను కొత్త సాగు పద్ధతుల వైపు తీసుకువెళ్లాలని సిఎం సూచించారు. టెక్నాలజీ ఉపయోగాలు రైతులకు వివరించి..వారిని ప్రోత్సహించాలన్నారు. ఏఏ పంటలకు ఎంత మొత్తంలో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడుతున్నారు...వాటి ప్రభావం వంటి అంశాలపై సమాచారం సేకరించాలన్నారు. మితిమీరినస్థాయిలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల కలిగే దుష్పలితాలను వివరించాలన్నారు. పురుగు మందులతో పాటు డ్రోన్ల ద్వారా లిక్విడ్ రూపంలో ఎరువులను పిచికారీ చేసే విధానాలను అమలు చేయాలన్నారు. తద్వారా తక్కువ ఎరువులు, పురుగు మందులతో సాగు సాధ్యం అవుతుందని సిఎం అన్నారు. ఈ విధానాల అమలుకు పంటలు, రైతులు, ప్రాంతాల వారీగా సమాచారం సేకరించి..వాటిని డాటా ఎనలటిక్స్ ద్వారా విశ్లేషించి రైతులకు సూచనలు చేయాలని సిఎం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విషయంలో ఎక్కడా అలసత్వం, అవినీతి, నిర్లక్ష్యం కనిపించకూడదని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల నిర్వహణపై వివిధ రూపాల్లో సేకరించిన సమాచారంపై సిఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్ష చేశారు. పింఛన్ల పంపిణీ, అన్న క్యాంటీన్, ఎరువులు పంపిణీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం వంటి అంశాలపై ప్రజల నుంచి ఐవిఆర్ఎస్, క్యూఆర్ కోడ్ స్కానింగ్ తో పాటు పలు మార్గాల్లో నిర్వహించిన సర్వే నివేదికలపై సిఎం సమీక్షించారు. ఒక వ్యక్తి పింఛను ఇంటి వద్ద అందడం లేదని ఫిర్యాదు చేసినా, దీపం పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీలో సమస్యలు వచ్చినా, అవినీతి ఉన్నా, ఆసుపత్రిలో సేవలపై అసంతృప్తి వ్యక్తం చేసినా వాటిపై చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తుల వల్ల గాని, వ్యవస్థలో లోపాల వల్లగాని సమస్య ఉన్నట్లు తేలితే....ప్రతి కాల్ పై విశ్లేషించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పీ4 పథకానికి మంచి స్పందన వస్తుందన్నారు.పేదరిక నిర్మూలనకు మనం నిర్దేశించిన ఈపథకంలో భాగస్వాములు కావడానికి ఎందరో అత్యంత ఉత్సాహంగా,స్వచ్ఛంధంగా ముందుకు వస్తున్నారన్నారు.ఇది మనం సాధించాలను లక్ష్యానికి మంచి ప్రోత్సాహకంగా ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలు,బహుజనుల ప్రయోజనాలకు ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. దళితుల హక్కులు కాపాడాలని స్థిరచిత్తంతో అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు,పేదలకు అండగా ఉంటానని అందరికీ హామీ ఇస్తున్నానని సిఎం తెలిపారు. ప్రతిష్ఠాత్మక వర్సిటీలు అమరావతికి తరలివస్తున్నాయని అలానే రెసిడెన్షియల్ స్కూళ్లలో మెరుగైన భోజనం, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వివరించారు. దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అలానే వారికి 8 లక్షల ఎకరాలను టిడిపి ప్రభుత్వం గతంలో పంపిణీ చేసిందని చంద్రబాబు తెలిపారు. ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తిని లోక్‌సభ స్పీకర్‌గా చేసిన పార్టీ టిడిపి అని చంద్రబాబు వివరించారు. ప్రతిష్ఠాత్మక వర్సిటీలు అమరావతికి తరలివస్తున్నాయని అలానే రెసిడెన్షియల్ స్కూళ్లలో మెరుగైన భోజనం, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వివరించారు. దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అలానే వారికి 8 లక్షల ఎకరాలను టిడిపి ప్రభుత్వం గతంలో పంపిణీ చేసిందని చంద్రబాబు తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమం ఇస్తున్న ప్రభుత్వం మాది. రాజ్యాంగం ఒక పుస్తకంకాదు పవిత్ర గ్రంథం. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి అంబేద్కర్ దశ దిశ చూపించారు. విజన్ 2047 ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కోసం కృషిచేస్తున్నాం. స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం 2047 విజన్ తయారు చేశామన్నారు.ప్రజలు ఇచ్చే ప్రతి సూచన ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

నేరం చేసిన వాడిని శిక్షించడమే ప్రధానం కాదు. ఆ నేరం చేయడానికి ఏ పరిస్థితులు అతడ్ని పురికొల్పాయో వాటిని తొలగించడం ప్రధానం.

-ఎమ్.ఎస్.రాయ్

# నినాదాలు కాదు నిర్ణయాలే ప్రధానం

*ప్రస్తుతం మన కళ్లకు కట్టినట్లు కనపడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలన. వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటినినాదాలతో హోరెత్తిస్తున్నారు. ఆ దిశగా మన దేశం, రాష్ట్రాలు చేరాలంటే, నినాదాలు సరిపోవు అని పాలకులు ఇకనైనా గ్రహించాలి. నిర్మాణాత్మకమైన నిర్ణయాలు తీసుకోవాలి. నాణ్యమైన విద్యఅందరికీ అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది అని గ్రహించాలి. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అందించాలి. విద్యా, వైద్యంపై దృష్టి సారించాలి. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి. పారిశ్రామిక రంగానికి ఊతం ఇవ్వాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి కృషి చేయాలి. ప్రస్తుతం 'ట్రంప్' తీసుకుంటున్న 'టారిఫ్' నిర్ణయాలు ప్రపంచ దేశాలను వణికి స్తుంటే, ఒకే ఒక 'చైనా' దేశం ఖబడ్దార్ అంటూ అమెరికాను హెచ్చరించగలుగుతుంది అంటే దీనికి ప్రధాన కారణం ఆ దేశం సాధించిన పారిశ్రామిక అభివృద్ధి అని గ్రహించాలి.*

ఐ.ప్రసాదరావు

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన అంతా మతం, మద్యంపైనే కేంద్రీకృతమై ఉంటుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మహాత్మా గాంధీజీ మద్య పాన రహిత దేశంగా భారత్ఉండాలని ఆశించగా,స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు దార్శనికులు భారత దేశం సోషలిస్టు, సెక్యులర్, ప్రజాస్వామ్యపద్ధతిలో కొనసాగాలని ఆశించారు. దీని కోసమే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా తన జీవితంలో చదువు అభ్యసించి, అమోఘమైన జ్ఞానం సంపాదించి, రాజ్యాంగం రచించడమే కాకుండా, అందరికీ సమన్యాయం చేయాలని ఆర్థిక సామాజిక రాజకీయ సమానత్వం కోసం పాటుపడ్డారు. బౌద్ధమతం స్వీకరించి తదనుగుణంగా తన జీవిత లక్ష్యాలను ప్రజలకు తేటతెల్లం చేసాడు. ఇక మొట్ట మొదటి ప్రధాన మంత్రి జవహార్‌లాల్ నెహ్రూ మతపరమైన కార్యక్రమాలకు దూరంగా, దేవాలయాలు సందర్శనాలకు దూరంగా ఉంటూ, దేశంలో లౌకిక విధానానికి అనుగుణంగా తన జీవిత ప్రయాణం కొనసాగించారు. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాలకు, పారిశ్రామిక అభివృద్ధికి పునాదులు వేశారు. తరువాత వచ్చిన ఇందిరాగాంధీ కూడా దాదాపు ఇవే ప్రమాణాలు పాటించడం జరిగింది. అయితే ప్రస్తుత పాలకులు తరచూ దేశంలో ఉన్న దాదాపు అన్ని దేవాలయాలు, గుళ్లు సందర్శించడమే పెద్దపనిగా పెట్టుకున్నారు. అదే సమయంలో అల్లర్లతో అట్టుడగుతున్న మణిపూర్ లాంటి రాష్ట్రాన్ని మాత్రం దర్శించరు. అక్కడ ప్రజలకు భరోసా ఇవ్వరు. ఇటీవల కాలంలో ముఖ్యంగా గత ఇరవై సంవత్సరాలుగా దేశంలో ఉన్న'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు నాయకులు కులం, మతం, ప్రాంతం, భాష వంటి సున్నితమైన అంశాలను వివిధ సందర్భాల్లో ప్రజలపై రుద్దుతూ, ప్రజల ఓట్లతో అధికారం చేపట్టడం జరుగుతుంది.అదే సందర్భంలో మనీ, మద్యం విపరీతంగా వినియోగిస్తూ రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తున్న సంప్రదాయం పెరిగింది. దీనికితోడు కేంద్రం, రాష్ట్రాలు అప్పులు ఊబిలో చిక్కుకున్నా, మరల విచ్చలవిడిగా ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తాం అంటూ ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం మనం అందరం చూస్తున్న ప్రత్యక్ష సాక్ష్యం.దీనికి తాజా ఉదాహరణ ఇటీవల జరిగిన ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్నికలే.గత దశాబ్ద కాలంగా దేశాన్ని పాలిస్తున్న పాలకులు



ఒకే మతానికి ప్రాధాన్యత ఇస్తూ, మతం, దేవాలయాలు, మత క్రతువులు, కుంభమేళా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను మతంవైపు మొగ్గు చూపే విధంగా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుంది. అన్ని అంశాలను 'ఒకే' అనే నినాదంతో ముడిపెట్టడం జరుగుతుంది. దేశంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి విషయాలపై ప్రజలు ఆలోచన చేయకుండా చేస్తున్న గమ్మత్తైన గేమ్ ఆడుతున్నారు. ఈ ఉచ్చులో ప్రజలు కూడా పడిపోవడం గమనార్హం. మరల అధికారం అప్పగించడం జరుగుతుంది. ఇక చాలా రాష్ట్రాలు అపరిమితమైన ఉచిత పథకాలు అమలు చేస్తూ అప్పుల్లో మునిగి తేలుతూ ఉంటూనే ఉన్నాయి. దీనికి మన తెలుగు రాష్ట్రాలే చక్కటి ఉదాహరణ. గత ప్రభుత్వాలు చేసిన అప్పులు తెలిసి కూడా, ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా ఇంకా ఉచిత పథకాలు ప్రకటించి అధికారంలోకి వచ్చాయి. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయడానికి 'టెంపుల్ టూరిజం' అని మతపరమైన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ, మరోపక్క 'మద్యం (లిక్కర్)' అమ్మకాలు పెంచడం, ప్రోత్సహించడం జరుగుతూ ఆదాయ సముపార్జన చేయడానికి సన్నాహాలు ముమ్మరం చేస్తున్నారు.ఇది ప్రస్తుతం మన కళ్లకు కట్టినట్లు కనపడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలన. వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటినినాదాలతో హోరెత్తిస్తున్నారు. ఆ దిశగా మన దేశం, రాష్ట్రాలు చేరాలంటే, నినాదాలు సరిపోవు అని పాలకులు ఇకనైనా గ్రహించాలి. నిర్మాణాత్మకమైన నిర్ణయాలు తీసుకోవాలి. నాణ్యమైన విద్యఅందరికీ అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది అని గ్రహించాలి. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అందించాలి. విద్యా, వైద్యంపై దృష్టి సారించాలి. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి. పారిశ్రామిక రంగానికి ఊతం ఇవ్వాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి కృషి చేయాలి. ప్రస్తుతం 'ట్రంప్' తీసుకుంటున్న 'టారిఫ్' నిర్ణయాలు ప్రపంచ దేశాలను వణికి స్తుంటే, ఒకే ఒక 'చైనా' దేశం ఖబడ్దార్ అంటూ అమెరికాను హెచ్చరించగలుగుతుంది అంటే దీనికి ప్రధాన కారణం ఆ దేశం సాధించిన పారిశ్రామిక అభివృద్ధి అని గ్రహించాలి. ఇక మన దేశం, రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి. ఆత్మ నిర్భర్ భారత్ సాధనలో నిమగ్నమవ్వాలి. మతం, మద్యం వైపు ప్రజలను ప్రయాణింప చేయడం గాకుండా, ప్రభుత్వం విద్య వైద్యం ప్రజలకు అందిస్తూ స్వయం ఉపాధి అవకా శాలు పొందే విధంగా ప్రయత్నాలు చేయాలి. అపరిమిత మైన ఉచిత పథకాలకు స్వస్తి పలకాలి. ప్రజల్లో సోమరిత నం పెంచరాదు. మతం, మద్యం మత్తులో ప్రజలను ముంచరాదు. •

## దివ్య నీరాజనం

ప్రపంచవ్యాప్త విస్తృతి పొందిన సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు యునెస్కో గుర్తింపు లభించింది. భారత దేశ వారసత్వ ప్రతీకగా భావించే భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్రానికి అరుదైన గౌరవం సంప్రాప్తించింది. ప్రాచీన వారసత్వ సంపదలను భద్రపరిచే ఐక్య రాజ్యసమితి విద్యాశాస్త్రీయ సాంస్కృతిక సంస్థ (యునెస్కో) మెమొరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో వీటికి తాజాగా చోటు దక్కింది. ప్రపంచ వారసత్వ దినోత్సవ సందర్భంగా ఈ విషయాలను యునెస్కోసంస్థ వెల్లడించింది. భగవద్గీత, నాట్యశాస్త్ర లిఖిత ప్రతులతోపాటు వివిధ దేశాలకు చెందిన 74వారసత్వ డాక్యుమెంటరీలను గుర్తించింది. దీంతో ఇంతవరకు మొత్తం సేకరణల సంఖ్య 570కి చేరింది. 'భారతీయ జ్ఞాన సంపద,కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలుమన దేశంపై ప్రపంచ మానవ దృక్పథానికి, జీవన విధానానికి పునాదులుగా భాసిల్లుతున్నాయి. మన దేశం నుంచి 14 గ్రంథాలు యునెస్కో రిజిస్టర్లో చోటు చేసుకోవడం విశేషం అని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఎక్స్‌లో వెల్లడించారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన గుర్తింపుగా ప్రధాని నరేంద్రమోడీ తన సందేశంలో పేర్కొన్నారు. శతాబ్దాలుగా మానవ ఔన్నత్యానికి దోహదపడిన ఈ రెండు ఉద్గ్రంధాలను నిక్షిప్తం చేయడమంటే కాలాతీత విజ్ఞానాన్ని సైతంపుణికి పుచ్చుకునే ప్రక్రియగానే స్వీకరించాలి. భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోందనడానికి నిదర్శనం నేటి గుర్తింపే.భారతీయ జీవన విధానానికి పునాదులుగా బాసిల్లుతున్న ఈ రెండు గ్రంథాల సారాంశాలు సర్వజనావళికి ఆచరణీయాలేనన్న విషయాన్ని ప్రపంచమూ గుర్తించింది. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు. యునెస్కో రిజిస్టర్లో చోటు దక్కించుకున్నాయని కేంద్రమంత్రి తన పోస్టులో వెల్లడించారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీతా సారాన్ని,నాట్యశాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్లో చేర్చడం. మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి వేలశతాబ్దాలుగా మన నాగరికత ఔన్నత్యాన్ని వివరించి, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధరంగంలో సోదరులు, గురువులు, బంధు జనులందరినీ చూసి ధనుర్బాణాలు విడిచి చతికిల పడిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ భగవద్గీత. ఇందులో 18 అధ్యాయాలు ఉన్నాయి. ప్రతి బోధ మానవ వర్తన, వికాసానికి మెచ్చు తునక. మనుషులు ప్రవర్తించవలసిన తీరు, పారలౌకికాన్ని పొందే విధానం రెండింటినీ శ్రీకృష్ణుడు బోధించాడు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన క్షణంగా అభివర్ణించారు. భారత దేశమంటేనే వివిధ భాష,సంస్కృతులసమ్మేళనం. రామాయణ, మహాభారత ఇతిహాసాలు, ఉపనిషత్తుల నుండి సముపార్జించిన విజ్ఞాన సంపదతో విలసిల్లేదేమన పుణ్యభూమి. భగవద్గీతను కేవలం ఒక మతగ్రంథంగా ఎవరూ చూడరు. అదొక కర్తవ్య బోధమాత్రమే. భరత నాట్యకళ అంటేనే ప్రపంచమంతా మెచ్చే శాస్త్రం. వీటిని ప్రపంచ వారసత్వ సంప్రదాయాలుగా యునెస్కో గుర్తించడమంటేనే భారతీయ విలువలకు, తత్వబోధకు, కళా కౌశల శాస్త్రానికి ఇచ్చిన సమున్నత గౌరవంగా భావించాలి. భగవద్గీత లాంటి నిజ జీవనసత్యాలు,తత్వాల చిత్రీకరణ, ధర్మబద్ధ జీవితం గురించి సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే ప్రవచించిన అంశాలునిజంగా నిత్య జీవన అంశాలే. వాటి విశ్లేషణ ప్రతి ఒక్కరికి అనుభవైక వేద్యాలే!ప్రపంచ దేశాలకు భారతీయతను పరిచయం చేసే ప్రక్రియఈనాడే మొదలు కాలేదు. కేవలం అర్జునుడి సందేహాలకు, సందిగ్ధానికి ఓ మేలుకొలుపుగా ఉండేవి. గీత పుట్టిన నాడే సర్వోన్నత స్థాయిలో ప్రపంచానికి తత్వశాస్త్రంగా ప్రజల్లోకి వెళ్ళిపోయింది. మానవునిలో ఉన్న భ్రమలనుతొలగించే నీతి నియమాల పాఠ్యాంశంగా ప్రాచుర్యం పొందింది. అందుకే భగవద్గీత ఎన్నో ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో అధ్యయన శాస్త్రంగా భాసిల్లుతోంది.ఈ గుర్తింపు ఏనాడో రావాల్సి ఉంది. అయినా ఇప్పటికీ ఆలస్యం కానట్లే.మన నాగరికతను, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించిందనే కాదు, ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా ఉన్నందునే ఇలాంటి గుర్తింపు సబబే! అణువణువునా ఆత్మస్థైర్యం సన్నగిల్లి నరనరానా నిరాశానిస్పృహలు ఆవహించిన వారికి గీతా పఠనం చైతన్యం నింపుతుంది. అంతరాంతరాల్లో ఉన్న ఆసక్తులు అనురక్తులు పొంగి పొర్లినప్పుడు నృత్యం జీవననాదమవుతుంది. గీతాసారం నిత్య జీవన సారమైతే భరత నాట్యం భారతీయ కళల్లో ఉత్కృష్టమైంది. అంగికం, అభినయం నుంచి కళాసమ్మిళిత నాట్యంగా ఎన్నో దేశాల భామలు నాట్యాభినయంలో మునిగితేలుతున్నారు. వీటి గురించి దేశ విదేశాల్లో తెలియని దేశమంటూలేదు. సర్వకళాసారం వీటిలోనే ఉంటుందని దేశం ఏనాడో గుర్తించింది. విభిన్న సంస్కృతుల మేళవింపు కలిగిన సందర్భంలో పరిస్థితుల్లో నాట్యకళకాని, గీతాపఠనం కాని చెక్కుచెదరకుండా ఆదరిస్తుండడం వాటిఖ్యాతిని గురించి చెప్పుకోవడం విశేషమే. అందుకే అవి ఈనాటి విశ్వకళా రాజసాలుగా వినుతికెక్కాయి. దైనందిన జీవితానికి మార్గదర్శకంగా ధర్మాచరణ ప్రాశస్త్యమున్న అంశాలను భగవద్గీత మాత్రమే చూపుతుంది. భగవద్గీత, భరత నాట్య విశేషాలను మరింత విస్తృతస్థాయిలో భవిష్యత్‌రాలకు తెలియచేసేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలి. వాటి వైశిష్టతలను భరతజాతికి పునరంకితం చేసే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవడం అవసరం.

దూరదృష్టి లేని వ్యక్తి ఉన్నతాశయాలు సాధించలేడు. గొప్పపనులు చేపట్టలేడు.



ఉడ్రోవిల్సన్

దేశానికి గాని, సమాజానికి గాని సంఖ్యాబలం ఒక్కటే చాలదు. వారు ఎప్పుడూ అప్రమత్తులై ఆత్మవిశ్వాసంతో ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుంది.



అంబేద్కర్

## ప్రజావాక్కు



### వనాలను కాపాడాలి

మనిషి మనుగడ కోసం అడవులను నరుకుతూపోతున్నారు. మరి అడవిలో జంతువులు పక్షులు ఎలా బతకాలి. ఎక్కడ బతకాలి? మనం వాటి ఆవాసాన్ని తొలగిస్తే అవి మన ఆవాసాలకు వస్తాయి. సరిగ్గా అదే విధంగా జరుగుతున్నాయి.నేడు కొన్నిప్రాంతాల్లో పులులుచిరుత పులులు పాములు ఎలుగుబంట్లు కోతులు ఇళ్లలోకి జొరబడం చూస్తున్నాం.ఇటీవలకాలంలో ఆసిఫాబాద్‌లో వరసగా ఇద్దరు రైతులపై పులులదాడుల సంఘటనలూ చూశాం. అలాగే తిరుపతిలో కూడాఅప్పుడప్పుడూఇటువంటి సంఘటనలు జరుగుతాయి. వాటి దాడుల్లో కొందరు తీవ్ర గాయలకు గురవుతున్నారు. కొందరు మరణిస్తున్నారు. ప్రభుత్వం వనాలను కాపాడితే అందులో జంతువులు సురక్షితంగా ఉంటాయి. యురేనియం తవ్వకాలనీ, కెమికల్ ఫ్యాక్టరీలని అడవులను నరుకుతూపోతే జంతువుల మనుగడ ఎలా?

- ఎస్. శేషగిరి, హైదరాబాద్

### పేదలకు భూమిని పంపిణీ చేయాలి

తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా గాంధీ ప్రతిపాదించిన సర్వోదయా ప్రణాళికలో భాగంగా వచ్చిన భూదానోద్యమ స్ఫూర్తి నేడు కొరవడింది. పోచంపల్లి సాక్షిగా పురుడు పోసుకున్న ఈ మహత్తర ఉద్యమ స్ఫూర్తి భూదాన్ బోర్డులను వాటి స్వతంత్రతను మలీనం చేయడం పేదలకు దక్కాల్సిన భూమిపైన ప్రభుత్వం వివిధ రూపాలలో తూట్లు పొడవడం ద్వారా నాటి ఉద్యమ స్ఫూర్తి నిరుగారిపోయింది. తెలంగాణలో మళ్ళీభూదాన్ ఉద్యమ బోర్డులను మళ్లీ నెలకొల్పి భూమి లేని నిరుపేదలకు భూమిని పంచే ఏర్పాటు చేయాలి.

-భారత అవినాష్, జనగామ

### మొక్కుబడిగా ప్రజావాణి

ప్రతి సోమవారం రోజున ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి దరఖాస్తుల కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహించడం తప్పపరిష్కారం ప్రజలకు దొరుకడం లేదు.సమస్యలపై అధికారులు చోరువ తీసుకొనే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని పరిష్కారం చూపించాలి. ప్రభుత్వ అధికారులు పౌరసేవలను సరియైన సమయం అమలు చేసేవిధంగా సూచనలు చెయ్యాలి. సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం ఇవ్వాలి.

- ఎస్. లక్ష్మీనారాయణ,చింతకుంట, కరీంనగర్

### పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

ఏడాదికి లక్షా 50 వేల రోడ్డు ప్రమాదాలు, 2లక్షల 50 వేల మరణాలు, గంటకు సగటున 17మంది మృత్యువు ఒడిలోకి జారుతున్న ఘోర పరిస్థితులు. ఇండియాలో ఏ నిమిషం ఎటు వైపు నుంచి మరణం సంభవిస్తుందో తెలియదు. రోడ్డుపై వెళ్లాలంటే భయం పుట్టక మానదు. బస్సు ఎక్కినా, సైకిల్‌పై వెళ్లినాబతుకుకు గ్యారెంటీ లేనిరోజులివి.దాదాపు 84శాతం మంది 1860 సంవత్సరాల మధ్య పని చేసే వారున్నారు. నిరక్ష్యపు డ్రైవింగ్, మొబైల్ ఫోన్ చూస్తూ డ్రైవ్ చేయడం, మద్యం తాగి బండి నడపడం లాంటి వాటి వల్ల ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నాయి. దేశంలో నగర రవాణా వ్యవస్థపై ఎప్పటికప్పుడు సమగ్ర పర్యవేక్షణ అవసరమని ఇటీవల ముంబై లోని కుర్లా యాక్సిడెంట్ ఘటన రుజువు చేసింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తక్షణం నివారణా చర్యలు తీసుకోవాలి.ప్రతీనగరంలో హాకర్లకు ప్రత్యేక విధులు కేటాయించాలని, వాటిని స్ట్రీట్ బజార్ల కింద తీర్చి దిద్దాలని నిపుణులు ఏనాడో సూచించినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### భారీ జరిమానాలు విధించాలి

రాష్ట్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడుతున్న వార్తలు నిత్యం పత్రికల్లో వస్తున్నాయి. కేసులు నమోదు చేస్తున్నారు.అయితే అందువలన అక్రమతరలింపు ఆగే పరిస్థితి లేదు. అలాగే పట్టుబడిన బియ్యం కాలం గడిచే కొద్దీ పురుగు పట్టి ఎందుకూ పనికి రాని ప్రమాదం ఉంది. పేదలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి. అధికారులు చట్టపరమైన చర్యలు వేగవంతం చేసి,పట్టుబడిన బియ్యాన్ని వేలం వేయాలి. అక్రమాలకు పాల్పడిన వారికి భారీ జరిమానాలు విధించాలి.

- జి. రామకృష్ణ, కృష్ణాజిల్లా

### తల్లిదండ్రులదే బాధ్యత

పాఠశాలల్లో చదివే విద్యార్థులు పట్టుమని పదినిమిషాలు కూడా క్లాస్‌లు వినలేకపోతున్నారు. విపరీతమైన మొబైల్ ఫోన్ల వాడకంవల్ల పిల్లల్లో చదువుపై ఆసక్తితగ్గుతుంది.తల్లి తండ్రులు డబ్బు సంపాదనలో పడి పిల్లలు ఏం చేస్తున్నారు అనేది గమనించట్లేదు. తల్లి తండ్రులు మొబైల్ వాడకం తగ్గిస్తే పిల్లలు కూడా తగ్గిస్తారు.పిల్లల్ని బయట ఆడుకొనేలా ప్రోత్సహించాలి. ఆటల వలన ఆరోగ్యం, క్రమశిక్షణ కూడా అలవడుతుంది. రేపటి తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రుల పైనే ఉంది.

- ప్రశాంత్ గూరుడు, గోదూర్, జగిత్యాల

మన వి | ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పిల్లల భవిత బాధ్యత తల్లిదండ్రులదే!

మామిండ్ల శ్రీనివాస్

పుట్టుకతోనే పిల్లల జీవితాలు ప్రారంభమవుతాయి. అప్పటినుంచే వారి భవిష్యత్తుకు పునాది పడుతుంది. ఈ పునాదిని బలంగా వేయడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు పోషించే వివిధ పాత్రలు ప్రారంభ దశలో పిల్లలు పుట్టినప్పటి నుండి వారి ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకం. శారీరక ఎదుగుదలతో పాటు మానసిక, భావోద్వేగాల అభివృద్ధిలోనూ తల్లిదండ్రులు తోడ్పాటు నందించాలి. పిల్లలకు పౌష్టికాహారం అందించడం, ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పడం ద్వారా వారి శారీరక ఎదుగుదలకు సహాయపడాలి. పిల్లలతో మాట్లాడటం, వారికి కథలు చెప్పడం, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా వారి మానసిక ఎదుగుదలను ప్రోత్సహించాలి. పిల్లలను ప్రేమగా చూసుకోవడం, వారి భావాలను అర్థం చేసుకోవడం,వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా వారి భావోద్వేగాల అభివృద్ధికి తోడ్పడాలి. విద్యలో తల్లిదండ్రుల పాత్రపిల్లల విద్యలో తల్లిదండ్రులు క్రియాశీలకంగా పాల్గొనాలి. వారి అభ్యాసానికి తగిన ప్రోత్సాహం అందించాలి. పిల్లలను చదువుపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలి. వారి ప్రయత్నాలను మెచ్చుకోవాలి. పిల్లలకు హోంవర్క్, ప్రాజెక్టులలో సహాయం చేయాలి. వారి సందేహాలను నివృత్తి చేయాలి. ఉపాధ్యాయులతో మాట్లాడి పిల్లల ప్రగతిని తెలుసుకోవాలి. పాఠశాల కార్యక్రమాల్లో పాల్గొనాలి. పిల్లలకు అవసరమైన పుస్తకాలు, ఇతర అధ్యయన సామాగ్రిని అందుబాటులో ఉంచాలి. పిల్లలు మంచి పౌరులుగా ఎదగడానికి నైతిక విలువలు చాలా ముఖ్యం. వీటిని నేర్పడంలో తల్లిదండ్రుల పాత్ర ప్రధానమైనది. తల్లిదండ్రులు నిజాయితీగా, బాధ్యతగా ప్రవర్తించాలి. పిల్లలకు మంచి ఉదాహరణగా ఉండాలి. పిల్లలకు నిజం చెప్పడం, దయతో ఉండటం, ఇతరులను గౌరవించడం వంటి విలువలను నేర్పాలి. పిల్లలకు సరైన క్రమశిక్షణ నేర్పాలి. తప్పు చేసినప్పుడు మందలించాలి, సరైన మార్గంలో నడిపించాలి. పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల గురించి చెప్పాలి. వాటిని గౌరవించేలా ప్రోత్సహించాలి. పిల్లలు సమాజంలో ఎలా మెలగాలనేది నేర్పడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో అవసరం. పిల్లలు ఇతరులతో ఎలా మాట్లాడాలో నేర్పాలి. తమ అభిప్రాయాలను ఎలా వ్యక్తపరచాలో తెలియజేయాలి. స్నేహితులతో ఎలా ఉండాలో, కలిసి ఎలా ఆడుకోవాలో నేర్పాలి. ఇతరులతో ఎలా మర్యాదగా మెలగాలో నేర్పాలి. ఇతరులకు సహాయం చేయడం, పంచుకోవడం వంటిమంచి



అలవాట్లను నేర్పాలి. పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలి. బాధ్యత తీసుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం వంటివి నేర్పాలి. వృత్తి జీవితంలో తల్లిదండ్రుల పాత్ర పిల్లల భవిష్యత్తులో వారి వృత్తి జీవితం చాలా ముఖ్యం. సరైన వృత్తిని ఎంచుకోవడానికి తల్లిదండ్రులు సహాయపడాలి. పిల్లల ఆసక్తులను, నైపుణ్యాలను గుర్తించాలి. వారికి తగినవృత్తిని ఎంచుకోవడానికి సహాయపడాలి. వివిధ వృత్తుల గురించి పిల్లలకు సమాచారం అందించాలి. వాటిలోఉన్న అవకాశాలను వివరించాలి. పిల్లలు ఎంచుకున్న వృత్తిలో రాణించడానికి ప్రోత్సహించాలి. వారి లక్ష్యాలను సాధించడానికి సహాయపడాలి. మారుతున్న కాలానుగుణంగా తల్లిదండ్రుల పాత్రనేటి ఆధునిక యుగంలో తల్లిదండ్రుల పాత్ర మరింత సంక్లిష్టంగా మారింది. సాంకేతికత, మారుతున్న సామాజిక పరిస్థితులు పిల్లల పెంపకంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ బాధ్యతలను మరింత జాగ్రత్తగా నిర్వర్తించాల్సి ఉంటుంది. పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి. దానిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలి. అదే సమయంలో, సాంకేతికతను అతిగా వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించికూడా తెలియజేయాలి. పిల్లలుసామాజిక మాధ్యమాలను సురక్షితంగా, బాధ్యతగా ఉపయోగించేలా మార్గనిర్దేశం చేయాలి. సైబర్ నేరాలు, ఆన్లైన్ వేధింపుల పట్ల అవగాహన కల్పించాలి.పిల్లలకు కష్టపడే తత్వం, ఓటమిని తట్టుకునే మనస్తత్వం, సమస్యలను పరిష్కరించుకునే నైపుణ్యాలు వంటి జీవన నైపుణ్యాలను నేర్పాలి. పిల్లల మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలను ఎదుర్కోవడానికి వారికి సహాయపడాలి.అవసరమైతే మానసిక నిపుణుల సహాయం తీసుకోవాలి.వివిధ వయసుల పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్రపిల్లల వయసును బట్టి వారి పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర మారుతూ ఉంటుంది. ప్రతిదశలోనూ వారి అవసరాలకు అనుగుణంగా తల్లిదండ్రులు వ్యవహరించాల్సి ఉంటుంది.కౌమార దశ (13-19 సంవత్సరాలు) ఈ దశలో పిల్లలు శారీరకంగా, మానసికంగా అనేక మార్పులు చెందుతారు. వారికి స్వేచ్ఛ, వ్యక్తిత్వం, గుర్తింపు అవసరం. తల్లిదండ్రులు వారికి మద్దతుగా ఉంటూనే, సరైన మార్గనిర్దేశం చేయాలి. వారి నిర్ణయాలను గౌరవించాలి. కానీ ప్రమాదకరపరిస్థితుల నుండి రక్షించాలి. యుక్త వయస్సు (20+ సంవత్సరాలు) ఈ దశలో పిల్లలు తమ జీవితాన్ని తామే నిర్మించుకునే ప్రయత్నంలో ఉంటారు. తల్లిదండ్రులు వారికి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు, కానీ వారి నిర్ణయాలనుగౌరవించాలి. వారికి భావోద్వేగపరమైన మద్దతు అందిస్తూ, వారి విజయాలను ప్రోత్సహించాలి. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమైనది. పుట్టుక నుండి వారి జీవితాంతం వరకు తల్లిదండ్రులుపిల్లలకు మార్గనిర్దేశంచేస్తూ ఉండాలి. తల్లిదండ్రులు అందించే సహకారం వారి భవిష్యత్తుకు బలమైన పునాదినిస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా తల్లిదండ్రులు తమ పెంపక శైలిలో మార్పులు చేసుకుంటూ, పిల్లలను సన్మార్గంలో నడిపించాలి. •

# పెట్రో ధరలు పెరిగినా, తరిగినా లాభమే!



అన్నవరపు బ్రహ్మయ్య,

తెలుగునాట 'మా ఇంటికి వస్తే ఏమి తెస్తావు మీ ఇంటికి వస్తే ఏం పెడతావ్' అనే నానుడి కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం మంత్రిత్వశాఖకు సరిపోతుంది. ఎందుకంటే అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పతుల ధరల తగ్గినా, పెరిగినా కేంద్ర ప్రభుత్వం మాత్రం లాభాల పంట పండించుకొంటోంది. ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పడిపోతుంటే కేంద్రప్రభుత్వం గ్యాస్ ధరలు, పెట్రోలియం ధరలను పెంచడం చూస్తుంటే కేంద్రప్రభుత్వ ఆశకు అంతుపంతూ లేకుండా వుందనిపిస్తోంది. అంతర్జాతీయంగా పెట్రోల్ ధరలు పెరిగినప్పుడు, ధరలతో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సన్నాయి నొక్కులు నొక్కే కేంద్రప్రభుత్వం ధరలు తగ్గినప్పుడు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా ధర తగ్గిన ఫలితం ప్రజలకు దక్కకుండా సెస్ల రూపంలో పెట్రోల్, డీజిలు పెంచి, స్వాహాచేసుకోవడం అలవాటుగా చేసుకుంది. 2014 నవంబరు నుంచి 2016 జనవరి వరకు పెట్రోల్, డీజిల్‌పై తొమ్మిదిసార్లు ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం పెంచింది. ఇక్కడ మరో విషయం గమనించాలి. కేంద్రప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తులపై పన్నును ఎక్సైజ్ పన్ను రూపంలో కాకుండా సెస్‌రూపంలో పెంచుతోంది. సహజంగా కేంద్రప్రభుత్వానికి లభించే ఎక్సైజ్ సుంకంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా లభిస్తుంది, కానీ సెస్ రూపంలో లభించే ఆదాయంలో రాష్ట్రాలకు ఎటువంటి వాటా లభించదు. అందువల్ల సెస్‌రూపంలో లభించే ఆదాయం మొత్తం కేంద్రప్రభుత్వానికే చెందుతుంది. ప్రజల సంక్షేమం సంగతి ఎలా వున్నప్పటికీ ధనార్జనే ప్రధానంగా వ్యవహరిస్తోంది. కేంద్రప్రభుత్వానికి పెట్రోలియం ఉత్పత్తులద్వారా 2022-23వ సంవత్సరంలో 7,48,718,3 కోట్ల రూపాయల ఆదాయం లభించగా, 2023-24 సంవత్సరంలో 7,51,155.9 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. 2025-26వ సంవత్సరంలో ఈ ఆదాయాన్ని మరో 20 శాతం పెంచాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. తాజాగ పెట్రోలియం ఉత్పత్తులపై రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం వల్ల కేంద్ర ఖజానాకు రూ.32,000 కోట్ల వరకు సమకూరనుంది. దీనిని బట్టి భవిష్యత్తు రోజులలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలపరిస్థితి ఎలా వుంటోందో అంచనా వేసుకోవచ్చు. ఇది చాలదన్నట్టుగా భారతదేశంలో దాదాపు దశాబ్దకాలంగా పెట్రోల్లో ఇథనాల్ కలిపి అమ్ముతున్నారు. ఇథనాల్ పెట్రోలియం కంటే చాలా చౌకగా లభిస్తుంది. ప్రస్తుతం ప్రతి లీటర్ పెట్రోల్లో 18.2 శాతం ఇథనాల్‌ను కలుపుతున్నారు. పెట్రోల్తో పోల్చుకుంటే ఇథనాల్ ధర చాలా తక్కువగా వుంటుంది. చౌకగా లభించే ఇథనాల్ పెట్రోల్లో కలపడం వల్ల ప్రజలు ఇథనాలకు కూడా అధిక పన్నులు, అధిక ధర చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా తన ఖాతాలో వేసుకొంటోంది. ఇక పెట్రోలియంను శుద్ధిచేసి పెట్రోల్,




డీజిల్ తదితర ఉత్పత్తులను అమ్ముకొనే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియర్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత పెట్రోలియం, కంపెనీ కూడా వందల కోట్ల రూపాయల లాభాలను ఆర్జిస్తున్నాయి. ఉదాహరణకి పైన తెలిపిన కంపెనీలు 2024వ సంవత్సరంలో వరుసగా రూ.779129.41 కోట్లు, రూ.19153.13కోట్లు, రూ. 26673.40 కోట్ల వంతున లాభాలు ఆర్జించాయి. కేంద్ర ప్రభుత్వ రంగసంస్థలైన వీటిని నుంచి కూడా కేంద్రప్రభుత్వం వందల కోట్లను రాయల్టీ ఆదాయం పొందుతోంది. పెట్రోలియం ఉత్పత్తులు ధనవంతులు మాత్రమే వినియోగిస్తారు. పేద ప్రజలకు ఇబ్బంది వుండదని అధికార బిజెపికి చెందిన నాయకుడొకరు వ్యాఖ్యానించారు. ఈ నాయకుని సామాజిక అవగాహన ఏపాటిదో అర్థం కావడం లేదు. ఎందుకంటే పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడు రవాణా ఛార్జీలు పెరిగి, నిత్యవసర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. డీజీల్ ఆధారంగా పనిచేసే పరిశ్రమల్లో తయారయ్యే వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. అంతేకాకుండా లక్షల మంది చిరువ్యాపారులు ద్విచక్ర వాహనాలపై కురగాయలు, వస్త్రాలు వంటి సరుకులు అమ్ముతూ జీవిస్తున్నారు. వీరందరిపై కూడా పెట్రోల్/డిసెల్ ధరల పెరుగుదల ప్రభావం వుంటుంది. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం వుండాలంటూ జి.ఎస్.టి. (గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్) అమల్లో తీసుకువచ్చిన కొత్తలో పెట్రోలియం ఉత్పత్తులను త్వరలో జిఎస్టి పరిధిలోకి తెస్తామని, అప్పుడు పెట్రోల్ ధరలు కూడా తగ్గుతాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆచరణలో జిఎస్టి పరిధిలోకి తీసుకు రాకపోగా సెస్‌ల రూపంలో పన్నులపై పన్నులను విధిస్తోంది. వంట గ్యాస్ ధరల విషయానికివస్తే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి సిలెండరుకు 50రూపాయలు పెంచారు. పెంచిన ధరలప్రకారం ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధరను రూ.1,028.50గా నిర్ణయించారు. హైదరాబాద్లో సిలెండరు ధర రూ. 855 నుంచి 905 రూపాయలకు, విజయవాడలో రూ.783నుంచి రూ.833,81లు చెల్లించాల్సి వస్తుంది. ఈ ధరలకు స్థానిక పన్నులు ఒక సిలెండరు అదనంగా రూ.40లు చెల్లించాల్సివస్తోంది. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరల నిర్ణయానికి వినియోగించే అంతర్జాతీయ బెంచ్ మార్క్ అయిన సౌదీ సీపీ సగటు 2023 జూలైలో టన్నుకు 385 డాలర్లు ఉండగా, 2025 ఫిబ్రవరిలో 629 డాలర్లకు పెరిగిందని, ఆ కారణంగానే ధరపెంచిన్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎల్పీజీని తక్కువ ధరకు విక్రయించడం వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ చమురు కంపెనీలు రూ.41,338 కోట్ల నష్టాన్ని చవిచూశాయని చెప్పారు. నష్టాలు కొండలా పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలను పెంచినట్టు ప్రభుత్వంతెలిపింది. నిజానికివంట గ్యాస్ పెట్రోలియంను శుద్ధిచేసే ప్రక్రియలోభాగంగానామినల్ వ్యయంతో ఉత్పత్తిఅవుతుంది. దీనిద్వారా కూడా ప్రభుత్వం వేలకోట్లను ఆర్జిస్తోంది.గడచిన దశాబ్దకాలంలో అంతర్జాతీయ మార్కెట్లో 11 పర్యాయాలు ముడిచమురు ధరలు తగ్గాయి. కానీ కేంద్రం ధరలుతగ్గిన ప్రతిసారి ఎక్సైజ్ సుంకాన్ని పెంచిన సందర్భాలున్నాయి. పెట్రోల్, డీజీల్ పరంగా చూస్తే అందుబాటులో వున్న రికార్డుల ప్రకారం 2014 నవంబరు నుంచి 2016 జనవరి వరకుపెట్రోల్, డీజీల్‌పై తొమ్మిది సార్లు ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం సవరించి అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినప్పుడు కలిగే ప్రయోజనాన్ని ప్రభుత్వమే పొందింది.అంతర్జాతీయ ధరలు తగ్గినప్పుడు ధరలు తగ్గించకుండా,అంతర్జాతీయంగా గ్యాస్‌ధరలు పెరిగాయి కాబట్టి, గ్యాస్ ధర 50 రూపాయలు పెంచిన కేంద్రప్రభుత్వ ద్వంద్వ నీతిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. •

# 51వేలు దాటిన గాజా యుద్ధ మరణాలు

## లక్షా 16 వేలకు పైగా ప్రజలకు గాయాలు





**గాజాసిటీ, ఏప్రిల్ 20:** గాజాలో ఏడాదిన్నరగా కొనసాగుతున్న యుద్ధం వల్ల మరణాల సంఖ్య 51 వేలు దాటింది. లక్షా 16 వేలకు పైగా ప్రజలు గాయపడినట్లు గాజా ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. గత 48 గంటల వ్యవధి లోనే ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 92 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది రెండు నెలల కాల్పుల విరమణ తర్వాత ఇజ్రాయెల్ తీవ్రమైన దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కాల్పుల విరమణ ఒప్పందం కోసం సగం మంది బందీలను విడుదల చేయాలని తాజాగా ఇజ్రాయెల్ హమాస్‌ను కోరితే అందుకు హమాస్ నిరాకరించడంతో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మండిపడ్డారు. గాజాలో యుద్ధం కొనసాగించడం తప్ప వేరే మార్గం లేదని, హమాస్‌ను అంతం చేసే వరకు తమ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. హమాస్ కోరికలను ఇప్పుడు తాము అంగీకరిస్తే సైనికుల పోరాటాలకు ఫలితం ఉండదని తెలిపారు. ప్రాణాలకు తెగించి పోరాడిన సైనికులకు విలువ ఉండదని చెప్పారు. బందీల విడుదలకు ప్లాన్ ఉంది కానీ, ప్రధానమంత్రి నెతాన్యాహూపై బందీల కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారిని విడిపించేందుకు ఆయన వద్ద ఎలాంటి ప్రణాళిక లేదని ఆరోపించారు. 59 మంది బందీలను విడిపించేందుకు ఆయన ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని కోరారు. నినాదాలు, ప్రసంగాలతో నిజాన్ని దాచలేరని విమర్శించారు. మరోవైపు తమ అధీనంలో బందీగా ఉన్న అమెరికా ఇజ్రాయెల్ పౌరుడు ఎడాన్ అలెగ్జాండర్‌కు సంబంధించి హమాస్ స్పష్టత ఇచ్చింది. అలెగ్జాండర్ ఎక్కడున్నాడో, ఎలా ఉన్నాడో తమకు తెలియదని చెప్పింది. అతడికి కాపలాగా నియమించిన గార్డు చనిపోయి కనిపించాడని వివరించింది.

2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడి చేసి 250 మందిని బందీలుగా తీసుకెళ్లింది. కాల్పుల విరమణ ఒప్పందాల్లో భాగంగా బందీలలో కొందరిని ఇజ్రాయెల్‌కు హమాస్ ఇంతకుముందు అప్పగించింది. పలువురు వివిధ దాడుల్లో మరణించారు. హమాస్ వద్ద ఇంకా 59 మంది బందీలు ఉన్నట్టు తెలుస్తోంది.



# భారత్‌లో ట్రంప్ రైతుగామారితే..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** కృత్రిమమేథ(ఎఐ)తో ప్రస్తుతం సాధ్యం కానిదంటూ ఏదీలేదని ఇప్పటికే రుజువయింది. ఇప్పుడు ఇది సర్వాంతర్యామి అయిపోయింది. ఏఐ ద్వారా వింతలు వినోదాలు సృష్టిస్తున్నారు. 20 ఏళ్ల వయసు వారిని 80 ఏళ్ల వృద్ధులుగా, క్రికెటర్లను పండ్లు అమ్ముకునే వాళ్లుగా, బిలియనీర్లను మురికివాడల్లో నివసించేవాళ్లుగా ఇలా ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టుగా సృష్టించిన సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఎప్పుడూ సీరియస్ లుక్స్, సంచలన నిర్ణయాలతో ప్రపంచ దేశాలకు వణుకుపుట్టించే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో రైతుగా మారితే ఎలా ఉంటారోనన్నది ఊహించుకోండి. ఆ ఊహకు రూపమిచ్చాడు ఓ నెటిజన్. ట్రంప్ పొలం గట్ల వెంబడి సైకిల్‌పై గడ్డిని మోస్తూ, ఆవులను తీసుకెళ్తున్నట్లు ఏఐ సాంకేతికతతో వీడియోని రూపొందించారు. అంతేకాదు గ్రామంలోని చెట్టుకింద స్నేహితులతో ముచ్చటిస్తున్నట్లు, దుకాణంలో చిన్నారులకు దీపావళి టపాసులు కొనిచ్చి సంప్రదాయ దుస్తుల్లో దీవాళి వేడుకల్లో పాల్గొన్నట్లు ఈ వీడియో రూపొందించారు. ఈ వీడియోకి నేపథ్య సంగీతంగా 'బలగం' చిత్రంలోని ఫేమస్ 'తెల్లాతెల్లాని పాలదారలల్లే..' అని సాగే పాటను జత చేశారు. అంతేకాదు ట్రంప్ చెరకు రసం అమ్ముతున్నట్లు కూడా వీడియోని సృష్టించారు. ప్రస్తుతం ఈ వీడియోలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# భారతీయ పౌరుడి సూట్‌కేస్‌లో బంగారు ఇటుకలు





**లుసాకా, ఏప్రిల్ 20:** ఓ భారతీయ వ్యక్తి (27) నుంచి కోట్ల కొలదీ డాలర్ల డబ్బు కట్టలు, చిన్నసైజు బంగారు ఇటుకలు బయల్పడ్డాయి. జాంబియి దేశ రాజధాని అయిన లుసాకి ఎయిర్‌పోర్టులో ఈ కళ్లు చెదిరే సంపద బయట పడింది. స్థానిక కెన్నెత్ కౌండా అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహిస్తోన్న తనిఖీల్లో సదరు భారతీయ యువకుడి దగ్గర్నుంచి పెద్ద మొత్తంలో నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. జాంబియా దేశంలోని ప్రధాన విమానాశ్రయం అయిన లుసాకా ఎయిర్‌పోర్టు ద్వారా రెండు మిలియన్ డాలర్లకు పైగా (రూ. 17,07,74,505) నగదు, 500,000 డాలర్ల విలువైన బంగారాన్ని అక్రమంగా రవాణా చేయడానికి ప్రయత్నించిన భారతీయుడిని అరెస్టు జాంబియన్ కస్టమ్స్ అధికారులు శనివారం తెలిపారు. 27 యేళ్ల వ్యక్తి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్‌కు వెళుతుండగా, స్థానిక కెన్నెత్ కౌండా అంతర్జాతీయ విమానాశ్రయంలో మల్టీ ఏజెన్సీ టీం అతని ప్రయత్నాన్ని అడ్డుకున్నట్లు డ్రగ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషన్ (డిఇసి)తెలిపింది. అతనివద్ద ఉన్న 2,320,000 డాలర్ల నగదు, 500,000 డాలర్ల విలువైన ఏడు బంగారు దిమ్మలను అడ్డుకున్నట్లు ఏజెన్సీ ఆ ప్రకటనలో వెల్లడించింది. జాంబియా మీడియా షేర్ చేసిన సదరు చిత్రాల్లో రబ్బరు బ్యాండ్‌లతో వంద డాలర్ల (డాలర్లు 100) నోట్లు.. కట్టకు వంద చొప్పున కట్టకు వంద చొప్పున కట్టలుగా ఉన్నాయి. డబ్బును ఒక నల్ల సంచిలో ప్యాక్ చేసి, ఆపై పెద్ద పాలీప్రొపైలిన్ సూట్‌కేసులో ఉంచారు. 'ఈ విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది' అని డిఇసి పేర్కొంది. 'చట్టం ఈ వ్యవహారాన్ని త్వరలోనే నిగ్గుతేల్చుతుంది' అని డిఇసి చెప్పింది. సదరన్ ఆఫ్రికా దేశం అయిన జాంబియా ఎయిర్‌పోర్టులలో ఇంతకుముందు కూడా ఇలాంటి ఘటనలు జరిగాయి. ఇలా ఉంటే.. రాగి, బంగారు ఖనిజాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ జాంబియా దేశ ఆర్థిక వ్యవస్థ పేదరికంలోనే ఉంది. అక్కడి జనాభా 60 శాతం కంటే ఎక్కువ మంది పేదరికంలో జీవిస్తున్నారని ప్రపంచబ్యాంకు నివేదికలు చెబుతున్నాయి. ఇలాగే, 2023లో జాంబియాలో ఆయుధాలు 127 కిలోగ్రాములు (280 పౌండ్లు), బంగారం, 5.7 మిలియన్ డాలర్ల నగదులో వెళ్తు నలుగురిని అరెస్టు చేశారు. ప్రాసిక్యూటర్లు వారిపై గూఢచర్యం ఆరోపణలను ఉపసంహించుకున్న తర్వాత వారిని విడుదల చేశారు.



# అంతరిక్షంలో రోదసీ యాత్రికుడి జన్మదినవేడుక

**వాషింగ్టన్, ఏప్రిల్ 20:** సాధారణంగా ప్రపంచంలో చాలా మంది వృద్ధులు కూడా వారి 70వ పుట్టినరోజును జరుపుకుంటారు. కుటుంబసభ్యులతో కలిసి కేక్ కట్ చేసి నిర్వహించుకుంటారు. కానీ, నాసా అత్యంత వయోవృద్ధ రోదసీ యాత్రికుడు డాన్ పెటిట్ మాత్రం తన 70వ పుట్టినరోజును వినూత్నంగా ప్లాన్ చేశాడు. ఎలాగంటే ఏకంగా భూమికి దూరంగా, అంతరిక్షంలో సోయుజ్ నౌకలో బర్త్‌డే జరుపుకున్నాడు. ఇది నిజంగా ఒక అరుదైన సందర్భమని చెప్పవచ్చు. డాన్ పెటిట్ అంతరిక్షంలో 70వ పుట్టినరోజును తన సహచరులతో కలిసి నిర్వహించుకున్నాడు.

**అంతరిక్ష మిషన్ ముగింపు:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 7 నెలలపాటు కొనసాగిన ఆయన మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత, డాన్ పెటిట్, రష్యన్ కాస్మోనాట్‌లు అలెక్సీ ఓవ్‌చినిన్, ఇవాన్ వాగ్నర్‌తో కలిసి, ఆదివారం కజకిస్తాన్‌లోని జెజ్కజ్గన్ పట్టణం సమీపంలో సోయుజ్ ఎంఎస్-26 రోదసీ నౌకలోన భూమికి తిరిగి వచ్చారు. నాసా ప్రకారం, ఈ మిషన్ 220 రోజులకు పైగా గడిచింది. ఈ సమయంలో డాన్, అతని సహచరులు భూమిని 3,520 పరిభ్రమించి, 9.33 కోట్ల మైళ్ల దూరాన్ని ప్రయాణించారు.

**అంతరిక్ష ప్రయాణంలో 70వ పుట్టినరోజు**

పెటిట్‌కు ఇది నాల్గవ అంతరిక్ష యాత్ర. తన 29 యేళ్ల కెరీర్‌లో, అతను మొత్తం 18 నెలలకు పైగా అంతరిక్షంలో గడిపాడు. ఈమధ్య కాలంలో, ఆయన సాహసపూరిత ప్రయాణం మరింత ప్రత్యేకంగా మారింది. 70వ పుట్టినరోజు వేడుక కూడా స్పెషల్ అని చెప్పవచ్చు. అంతరిక్ష నౌక నుంచి భూమి వైపు దూసుకుంటూ, కజకిస్తాన్‌లోని సుదూర ప్రాంతంలో సోయుజ్ ఎంఎస్-26 క్యాప్సూల్ ల్యాండ్ అయింది. ల్యాండింగ్ సమయంలో రోదసీ యాత్రికులు కాసేపు అలసినట్లు కనిపించారు. కానీ, వారి ఆరోగ్యం సర్వసాధారణంగా ఉన్నట్లు నాసా వెల్లడించింది.

**అనేక అంశాల్లో పరిశోధనలు**


ఐఎస్ఎస్‌లో గడిపిన 220 రోజుల సమయానికి డాన్, అలెక్సీ, ఇవాన్ ఇలా ముగ్గురు కాస్మోనాట్‌లు, వివిధ అన్వేషణల్లో పాల్గొని, కొత్త సాంకేతికతలను పరిచయం చేశారు. నీటి శుద్ధీకరణ సాంకేతికత, వివిధ పరిస్థితుల్లో మొక్కల పెరుగుదల, గురుత్వాకర్షణలో ప్రవర్తన వంటి అంశాల్లో కాకుండా, మనుషుల జీవితాలకు సంబంధించి అనేక కీలకమైన అంశాలపై కూడా రీసెర్చ్ చేశారు.

భూమికి తిరిగి వచ్చేటప్పుడు ల్యాండింగ్ తర్వాత, రోస్కాస్మోస్ స్పేస్ ఏజెన్సీ ప్రకారం. క్యాప్సూల్ నుంచి బయటకు తీసుకున్నప్పుడు కాస్మోనాట్‌ల ఆరోగ్యం సర్వసాధారణంగా ఉంది. రెస్క్యూ బృందం వారిని ఒక టెంట్‌కు తీసుకెళ్లింది. అక్కడ చికిత్స చేసిన తర్వాత, డాన్ పెటిట్ కజకిస్తాన్‌లోని కరగండా నగరానికి విమానంలో ప్రయాణించారు. ఆ తర్వాత నాసా జాన్సన్ స్పేస్ సెంటర్‌కు టెక్సాస్‌లో తిరిగి వెళ్లారు.

# కుల్‌భూషణ్‌కు అప్పీలు హక్కులేదు

## పాక్ కోర్టుల్లో షెహబాజ్ సర్కారు వాదనలు

**పాకిస్థాన్, ఏప్రిల్ 20:** గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటూ పాక్ జైల్లో మగ్గుతున్న భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌కు అప్పీల్ చేసుకునే హక్కు లేదని పాకిస్థాన్ ప్రభుత్వం చెపుతోంది. 2019లో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) ఇచ్చిన తీర్పులోని ఓ లొసుగును పాకిస్థాన్ ఇందుకోసం వాడుకుంటున్నది. 2019 జూన్‌లో అంతర్జాతీయ న్యాయస్థానం భారత్‌కు అనుకూ లంగా తీర్పు ఇస్తూ, కులభూషణ్ జాదవ్‌కు కాన్సులర్ యాక్సెస్ హక్కును కల్పించాలని చెప్పింది. ఈ కేసులో జాదవ్‌కు విధించిన మరణశిక్షను పునఃసమీక్షించాలని పాక్‌ను కోరింది. అప్పటి వరకు అతనికి ఉరిశిక్ష అమలు చేయవద్దని ఆదేశించింది. లొసుగులు వాడుకుంటున్న పాక్ అయితే 2023 మే నెలలో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టుకు నిరసనగా ఆందోళనలు జరిగాయి. ఈ అందోళనల్లో పాల్గొన్నారని ఆరోపిస్తూ సైనిక కోర్టులు కొందరిని దోషులుగా నిర్ధారించాయి. దీనిని సవాలు చేస్తూ ఆ దేశ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై ఇటీవల విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో పాక్ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు జాదవ్ కేసు గురించి ప్రస్తావన వచ్చింది. గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత పౌరుడు జాదవ్‌కు ఉన్న అప్పీలు హక్కు, అల్లర్ల కేసుల్లో దోషులుగా తేలిన పాక్ పౌరులకు ఇవ్వలేదని వారి తరఫు న్యాయవాది ఆరోపించారు. దీనిపై పాక్ రక్షణ మంత్రిత్వ శాఖ న్యాయవాది స్పందిస్తూ, అప్పట్లో దేశ న్యాయవ్యవస్థలో ఉన్న లోపాన్ని గుర్తించి ఐసీజే జాదవ్‌కు కాన్సులర్‌తో మాట్లాడేందుకు అనుమతిస్తూ తీర్పును ఇచ్చిందని అన్నారు. కానీ ఈ తీర్పు తర్వాత వియన్నా ఒప్పందానికి అనుకూలంగా చట్టాల్లో పలు మార్పులు చేసినట్లు వెల్లడించారు. ఇది కేవలం పునఃసమీక్షకు మాత్రమే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇక 2023అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్న పౌరులకు, ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేసుకునే హక్కును కల్పించే అంశంపై అటార్నీ జనరల్ మన్సూర్ ఉస్మాన్ అవాన్ అధికారులతో చర్చలు జరుపుతున్నారని అన్నారు. కనుక దీనికి రెండు రోజుల సమయం ఇవ్వాలని కోరినట్లు కోర్టు పేర్కొంది. భారత నావికాదళంలో పనిచేసి, పదవీ విరమణ పొందిన కుల్‌భూషణ్ జాదవ్ ఇరాన్‌లోని చాబహార్‌లో వ్యాపారం చేసేవారు. 2016లో పాక్ ఏజెంట్లు ఇరాన్‌లో ఉన్న ఆయనను అపహరించారు. ఆ తర్వాత బలోచిస్థాన్‌లోకి తీసుకొచ్చి జాదవ్‌ను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. 2017ఏప్రిల్‌లో గూఢచర్యం ఆరోపణలపై పాకిస్థాన్ మిలిటరీ కోర్టు కులభూషణ్ జాదవ్‌కు మరణశిక్ష విధించింది. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్‌లో ఉంటున్న జాదవ్‌ను పాకిస్థాన్‌అపహరించిందని ఆరోపించింది. ఆ మరణశిక్షను సవాల్ చేస్తూ భారత్ అంతర్జాతీయ న్యాయస్థానంలో అప్పీలు చేసింది. 2019లో దీనిపై దర్యాప్తు చేసిన ఐసీజే జాదవ్‌కు భారత అధికారులతో మాట్లాడే అవకాశం కల్పించింది.





## ఢిల్లీఎయిర్‌పోర్టుపై సిఎం ఓమర్ అబ్దుల్లా అసహనం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** ఢిల్లీ విమానాశ్రయంపై జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనగర్ నుంచి ఢిల్లీకి ఆయన ప్రయాణిస్తోన్న విమానాన్ని జైపూర్‌కు దారి మళ్లించడంపై మండిపడ్డారు. విమానం బయలుదేరిన మూడు గంటల అనంతరం దారి మళ్లించారని, ఢిల్లీ విమానాశ్రయం తీరు దారుణంగా ఉందని ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. జైపూర్ నుంచి తిరిగి ఎప్పుడు బయల్దేరుతామో కూడా తెలియదని, దీని గురించి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని దుయ్యబట్టారు. ప్రయాణికుల విషయంలో వారి బాధ్యతారాహిత్యం చూస్తుంటే సహనం నశించిపోతోందని, తాను మర్యాదగా మాట్లాడే పరిస్థితుల్లో కూడా లేనని విరుచుకుపడ్డారు. ప్రతికూల వాతావరణం కారణంగా విమానాలు ఆలస్యం అవుతున్నాయని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. జమ్మూ విమానాశ్రయంలో కూడా వాతావరణం సరిగా లేకపోవడంతో చాలా విమానాలు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సోషల్‌మీడియాలో తన అసహనాన్ని వ్యక్తం చేసిన సీఎం ఒమర్ అబ్దుల్లా 'జమ్మూ నుంచి బయలుదేరిన విమానం మూడు గంటల పాటు గాల్లోనే ఉంది. ఢిల్లీ విమానాశ్రయంలో రద్దీగా ఉండటం లేదా అంతరాయం వల్లనో జైపూర్‌కి దారి మళ్లించారు. రాత్రి 1 గంటకు విమానం మెట్లపై నిలబడి గాలి పీల్చుకుంటున్నాను. ఇక్కడి నుంచి ఎప్పుడు బయలుదేరుతామో నాకు తెలియదు అని ఆయన అన్నారు. తర్వాత మరో పోస్ట్ పెట్టిన ఆయన తాను ఆదివారం ఉదయం 3:00 గంటల తర్వాత ఢిల్లీకి చేరుకున్నానని తెలిపారు. దీనిపై విమానాశ్రయ అధికారులు ఆదివారం ఉదయం గాలి దిశమారడం వల్ల విమానాలు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం. విమాన సర్వీసుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడానికి మీవిమానయాన సంస్థతో టచ్‌లో ఉండండి. మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం.

# నిర్బంధ హిందీపై ఏకమవుతున్న థాకరేలు



**ముంబయి, ఏప్రిల్ 19:** ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ హిందీ, మరాఠీ మీడియం పిల్లలందరికీ హిందీ భాషను తప్పనిసరిగా బోధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే ఇప్పటికే ఖండించగా, తాజాగా ఉద్ధవ్ ఠాక్రే కూడా దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. అందుకే హిందీ తప్పనిసరి చేసిన వేళ సమైక్యంగా పోరాడేందుకు ఠాక్రేలు ఏకం అవుతున్నారన్న చర్చ మొదలైంది. హిందీ నటుడు, దర్శక, నిరాత మహేశ్ మంజ్రేకర్ పాడ్‌కాస్ట్‌లో ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్ధవ్‌తో ఉన్న విభేదాలపై స్పందిస్తూ, మహారాష్ట్ర ప్రయోజనాలు, మరాఠీ భాషను రక్షించుకునేందుకు తమ మధ్య నెలకొన్న చిన్నచిన్న వివాదాలను పక్కన పెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సిద్ధంగా ఉంటే, ఆయనతో పనిచేసేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఆయన చెప్పారు. పెద్ద సమస్యలు ఎదురైనప్పుడు, మన మధ్యఉన్న విభేధాలు చిన్నవిగా కనిపిస్తాయి. మా మధ్య ఉన్న విభేదాలను మరాఠీలు అంతగా పట్టించుకోరు. మేము ఇద్దరం కలిసి పనిచేయడం పెద్ద కష్టమేం కాదు. కానీ ఆ సంకల్పం ఉందా లేదా అన్నదే ముఖ్యం అని రాజ్‌థాక్రే పేరొన్నారు. ఇందులో వ్యక్తిగత ఇష్టాఇష్టాలు ఏమీలేవని, విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవడం ముఖ్యమని అన్నారు. ఇదే అంశంపై ఉద్ధవ్ ఠాక్రే స్పందిస్తూ, మహారాష్ట్ర ప్రయోజనాల కోసం తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శివసేనలో ఒకప్పుడు బాల్ ఠాక్రేకు వారసుడి పేరొందిన రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రేతీరుతో ఆ పార్టీ నుంచి 2005లో బయటకు వచ్చేశారు. అంతేకాదు మరుసటి ఏడాదే ఎంఎన్ఎస్ పేరుతో సొంతంగా పార్టీ స్థాపించారు. మహారాష్ట్రలో విద్యార్థులకు బలవంతంగా హిందీ బోధించడాన్ని తాము అనుమతించమని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. మహారాష్ట్రలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు హిందీని తప్ప నిసరి మూడో భాషగా బోధించాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించడంపై ఉద్ధవ్ ఠాక్రే మండిప డ్డారు. శివసేన(యూబీటీ) కార్మికుల విభాగం భారతీయ కామ్‌గర్ సేనకార్యక్రమంలో ప్రసంగించిన ఉద్ధవ్ ఠాక్రే, తమ పార్టీకి హిందీ భాష పట్ల విముఖత లేదని, కానీ దానిని ఎందుకు బలవంతంగా అమలు చేస్తున్నారని ఫడణవీస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. మహారాష్ట్రలోని మరాఠీ, ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు హిందీని తప్పనిసరిగా మూడో భాషగా బోధించాలని సర్కార్ నిర్ణయించింది. పైగా దీనిని ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సంకల్పించింది. దీనితో మహారాష్ట్ర ప్రభు త్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇదే అంశంపై థాకరేలు ఏకమవుతారనే ప్రచారం ఊపందుకుంది.



# బిజెపి నేతల వ్యాఖ్యలపై హైకమాండ్ వార్నింగ్

## నిషికాంత్‌దూబే, దినేశ్‌శర్మల వ్యాఖ్యలు వారి వ్యక్తి గతం: జెపి నడ్డా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** వక్ఫ్ సవరణ చట్టం, బిల్లులపై రాష్ట్రపతికి గడువు విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై బీజేపీ నేతల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలపై వివాదం ఇంకా సద్దుమణగకముందే బీజేపీ నేత, లోక్‌సభ సభ్యుడు నిశికాంత్ దుబె సర్వోన్నత న్యాయస్థానంపై చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. ఈ పరిమాణలపై బీజేపీ స్పందించింది. అలాంటి వ్యాఖ్యలు చేయవద్దని పార్టీ నాయకులను, ఇతరు సభ్యులను ఆదేశించినట్లు పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. న్యాయవ్యవస్థ, ప్రధాన న్యాయమూర్తిపై ఎంపీలు నిశికాంత్ దుబే, దినేశ్ శర్మ చేసిన వ్యాఖ్యలతో బీజేపీకి ఎటువంటి సంబధంలేదని అవి వారి వ్యక్తిగత వ్యాఖ్యలని అన్నారు. కానీ జేపీపీ వాటితో ఏకీభవించదు. అలాంటి వ్యాఖ్యలకు ఎప్పుడూ మద్దతు ఇవ్వదు. బీజేపీ వాటిని పూర్తి తిరిస్కరిస్తుంది. ప్రజాస్వామ్యంలో విడదీయరాని భాగమైన న్యాయవ్యవస్థ పట్ల అధికార పార్టీకి గౌరవం ఉంది. మా పార్టీ రాజ్యాంగ రక్షణకు బలమైన స్తంభం అని జేపీ నడ్డా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సుప్రీంకోర్టే చట్టాలు చేస్తే ఇక పార్లమెంటు భవనాన్ని మూసుకోవాల్సిందేనంటూ నిశికాంత్ దుబె ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ, పార్లమెంటు శాసనాధికారాల్లోకి న్యాయస్థానాలు చొరబడుతున్నాయని, చట్టసభ్యులు చేసిన చట్టాలను కొట్టివేస్తున్నాయని విమర్శించారు. జడ్జీలను నియమించే అధికారం ఉన్న రాష్ట్రపతికే సుప్రీంకోర్టు ఆదేశాలిస్తోందంటూ అగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో అధికరణం 368 ప్రకారం చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని అన్నారు.

ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వగలదని, పార్లమెంటుకు మాత్రం కాదని తెలిపారు. పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ (సవరణ) బిల్లు రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన అనేక పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తున్న నేపథ్యంలో నిశికాంత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. గవర్నర్ పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతికి గడువు విధిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అభ్యంతరం వ్యక్తం చేయడం వల్ల ఆ తీర్పు కూడా చర్చనీయాంశమైంది. అయితే ఈ రెండు అంశాల్లో కోర్టు తీసుకున్న నిర్ణయాలను విపక్షాలు అభినందించాయి.

# జైనదేవాలయం కూల్చివేతపై నిరసన



**ముంబై, ఏప్రిల్ 20:** జైన దేవాలయం కూల్చివేతపై జైనులు భారీ ఎత్తున నిరసనకు దిగారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినప్పటికీ తమ ఆలయాన్ని కూల్చివేశారని మండిపడ్డారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. విలే పార్లే ఈస్ట్‌లోని నేమినాథ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఉన్న అక్రమ జైన దేవాలయాన్ని ఏప్రిల్ 15న బీఎంసీ అధికారులు బుల్డోజర్లతో కూల్చివేశారు. దీనిపై జైన సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై జైనులు ఎత్తున నిరసన తెలిపారు. బీఎంసీ చర్యను వ్యతిరేకించారు. కాగా, వ్యాపారాన్ని విస్తరించుకు నేందుకు రామకృష్ణ హోటల్ యజమానుల సూచన మేరకు జైన ఆలయాన్ని కూల్చివేశారని జైనులు ఆరోపించారు. కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిన ప్పటికీ బీఎంసీ అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. దీనిపై కోర్టులో పోరాడుతామని అన్నారు. ఆలయాన్ని కూల్చివేసిన చోట టెంట్లు వేసి విగ్రహాలను అక్కడ ఉంచారు. ప్రార్థనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. శ్రీ 1008 దిగంబర్ జైన్ మందిర్ ట్రస్ట్ నిర్వహణలో ఉన్న ఈ ఆలయాన్ని 1962లో అభివృద్ధి చేశారు. మరోవైపు జైన మందిరం కూల్చివేత నేపథ్యంలో మహారాష్ట్రతో పాటు బీఎంసీలో అధికారంలో ఉన్న బీజేపీపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కూల్చివేతనను పర్యవేక్షించిన వార్డ్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ నవనాథ్ ఘుగ్గే పాటిల్‌ను బదిలీ చేశారు. అయితే కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తాను పని చేసినట్లు ఆయన తెలిపారు. చట్టపరమైన అన్ని విధానాలను అనుసరించినట్లు వెల్లడించారు.

## పెళ్లి పీటలపై వధువు తల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్. ఏప్రిల్20:**ఉత్తరప్రదేశ్, మీరట్‌లోని బ్రహ్మపురికి చెందిన 22 ఏళ్ల మహ్మద్ అజీమ్ అనే వ్యక్తికి కొన్ని నెలల క్రితం శామిలీ జిల్లాకు చెందిన మంతశా(21) అనే యువతితో పెళ్లి నిశ్చయం అయింది. మంతశా అన్న నదీమ్, వదిన షాయెదా ఆ పెళ్లి కుదిర్చారు. మార్చి 31వ తేదీన పెళ్లి వేడుక ఘనంగా జరిగింది. పెళ్లి తంతు అయిపోయిన తర్వాత అజీమ్ పరదా తెరిచి భార్యను చూశాడు. అక్కడున్న వ్యక్తిని చూసి షాక్ అయ్యాడు. మంతశా ఉండాల్సిన స్థానంలో 45 ఏళ్ల ఆమె తల్లి ఉంది. అక్కడ పిల్ల బదులు పిల్ల తల్లిని చూసి అతడి కళ్లు బైర్లు కమ్మాయి. ఇదేంటని ప్రశ్నించాడు. దీంతో అసలు కథ మొదలైంది. ఆ మహిళతో కాపురం చేయకపోతే రేప్‌కేసు పెడతామంటూ నదీమ్, షాయోదా బెదిరింపులకు దిగారు. కొన్ని రోజుల పాటు మోనంగా భరించిన అజీమ్ గురువారం పోలీస్ స్టేషన్‌కువెళ్లాడు. నదీమ్, మంతాషాలపై ఫిర్యాదుచేశాడు. పెళ్లి సందర్భంగా 5లక్షల రూపాయలు చేతులు మారాయి. ఆ మోసాన్ని నేను ప్రశ్నించాను. వాళ్లు నాపై బెదిరింపులకు దిగారు అన్నాడు. పోలీస్ కేసు నేపథ్యంలో రెండు వర్గాల మధ్య సెటిల్‌మెంట్ జరిగింది.

# జనం ప్రాణాలతో చెలగాడటం కాంగ్రెస్‌కు బాగా తెలుసు

### వక్ఫ్ చట్టసవరణకు వ్యతిరేకంగా జరిగిన బహిరంగ సభ ఆ పార్టీ ప్రాయోజిత కార్యక్రమమే

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దారుస్సలాంలో జరిగిన బహిరంగసభ ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రాయోజిత కార్యక్రమమేనని అన్నారు. వక్ఫ్ ఆస్తులను దోచుకున్న బడా చోర్లంతా కలిసి మీటింగ్‌లో పాల్గొని బిజెపిపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మజ్లిస్ నేతలు విషసర్పాల కంటే భయంకరమని వ్యాఖ్యానించారు. ముస్లిం ఓట్లను దండుకుని ముస్లింలను ఆదుకోకుండా వక్ఫ్ ఆస్తులను దోచుకు తింటున్నారని ఆరోపించారు. మజ్లిస్ సభకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కర్త, కర్మ, క్రియగా మారి ఆర్థిక సాయం చేశాడని పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులను కాజేసి ముస్లింల పొట్టకొట్టిన బడాచోర్లంతా ఏకమై ముస్లిం సమాజాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని స్పష్టం చేశారు. తాము మీటింగ్ పెడితే పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ (సీడబ్ల్యూసీ) నివేదిక ప్రకారం దేశంలో 8లక్షల ఎకరాలకుపైగా వక్ఫ్ ఆస్తులున్నాయని, రూ.10లక్షల కోట్లకు పైగా ఆస్తులు ఉన్నా ఒక్క రూపాయి కూడా పేదలకు పంచలేదని తెలిపారు. వక్ఫ్ ఆస్తులపై ఏటా రూ.12వేల కోట్లకు పైగా ఆదాయం వస్తున్నా ఆ సొమ్మునంతా దిగమింగుతోంది మీరు కాదా అని నిలదీశారు. ఒక్క తమిళనాడులోనే 22వేల కోట్ల విలువైన వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకున్నారని ధ్వజమెత్తారు. రాముడి అస్తిత్వం ఆధారాలడిగిన మీరు, వక్ఫ్ ఆక్రమించుకున్న ఆస్తుల ఆధారాలిచ్చేందుకు చూపెట్టడం లేదని నిలదీశారు. అకాల వర్షాలు, వడగండ్ల వానతో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిని రైతులంతా అల్లాడుతుంటే రైతులను ఆదుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన పేరుతో విదేశాలకు వెళ్లడమేంటని ప్రశ్నించారు. రైతులను ఆదుకునేలా కనీసం తమ మంత్రులకైనా ఆదేశాలివ్వాలని కోరారు. అంబేద్కర్ పెట్టిన భిక్షవల్లే ప్రధాని కాగలిగానని నిండు పార్లమెంటులో ప్రకటించిన మహానేత నరేంద్రమోదీ పేర్కొనడం గర్వంగా ఉందన్నారు. అంబేద్కర్ ఆలోచనలను, ఆశయాలను సాధించేందుకు నిరంతరం క్రుషి చేస్తున్న నాయకుడిగా, అణగారినవర్గాల జీవితాల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నడని గుర్తు చేశారు. అంబేద్కర్ గొప్పతనాన్ని భావితరాలకు తెలియ జేసేందుకు పంచ్ తీర్థాలను ఏర్పాటు చేసిన ప్రధానిగా మోదీ నిలిచారన్నారు. అంబేద్కరుకు అసలుసిస్కలైన వారసుడు మోదీయేనని ప్రకటించారు. ఏటా లక్షా 25వేల మంది దళితులను పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్న మహానేత మోదీయని పేర్కొన్నారు. అంబేద్కర్ పేరును ఉచ్చరించే అర్హత కూడా ఒవైసీకి లేదని అన్నారు. ఈ సమావేశంలో పెద్ద పల్లి మాజీ ఎంపి వెంకటేష్ నేత, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే రామచంద్రా రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రామగుండం ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి, ఠాకూర్ రాంసింఫ్, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, బెజ్జంకి దిలీప్ కుమార్, శివంగారి సతీష్, మోతం నర్సింగం, జంగా చక్రధర్ రెడ్డి, పెండ్యాల కరుణాకర్, ఠాకూర్ కిశోర్ సింగ్, ఠాకూర్ క్రాంతి సింగ్, ఎండి ఫహీం, కొమిరిశెట్టి రమేష్, మేరుగు రవీందర్, పిట్ట వినయ్, పిట్ట భాస్కర్, మొలుగూరి రాజవీరు, కాసనగొట్టు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లిలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

## బెంగళూరులో కర్ణాటక మాజీ డిజిపి ఓంప్రకాష్ హత్య

### కుటుంబసభ్యులపై సందేహాలు.. అదుపులో అనుమానితులు

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** కర్ణాటక మాజీ డిజిపి ఓం ప్రకాష్ (68) ఆదివారం నాడు బెంగళూరులోని తన ఇంట్లో హత్యకు గురయ్యారు. నగరంలోని హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో వుంటున్న ఓం ప్రకాష్ ఆదివారం ఉదయం తన ఇంట్లో రక్తపు గాయాలతో పడి వుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేబట్టారు. ఆయన వున్న గది అంతా రక్తంతో నిండి పోవడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. మొదట అనుమానాస్పద మృతిగా భావించిన పోలీసులు ఆ తరువాత ఆయన ఒంటిపై వున్న తీవ్రమైన గాయాలను పరిశీలించాక హత్యగా నిర్ధారించారు. కుటుంబ సభ్యులే ఓం ప్రకాష్‌ను హత్య చేసి వుంటారని భావి స్తున్న పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. 1981 బ్యాచ్‌కు చెందిన కర్నాటక కేడర్ అధికారి ఓం ప్రకాష్ 2015 నుంచి 2017 వరకు ఆ రా ష్ట్ర డిజిపిగా పనిచేశారు. అంతకు ముందు ఆయన ఫైర్ సర్వీస్, హోంగార్డుల విభాగం బాస్‌గానూ పనిచేశారు. బిహార్ రాష్ట్రంలోని చంపరాన్ ప్రాంతానికి చెందిన ఆ యన ఎంఎస్‌సి (జియోలాజి) చదివారు. కాగా ఓం ప్రకాష్ హత్యోదంతం కర్నాటకలో కలకలం రేపింది. వివిఐపిలు వుండే హెచ్‌ఆర్ఎస్ లే అవుట్ ప్రాంతంలో నివసి ంచే ఓం ప్రకాష్‌ను బయటివారు హత్యచేసి వుండరని, కుటుంబ కలాహాలు, ఆస్తి గొడవల కారణంగా కుటుంబ సభ్యులే అంతమొందించి వుంటారని పోలీసులు అను మానిస్తున్నారు. ఓం ప్రకాష్ భార్య పల్లవిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆయన మృతదేహంపై బలమైన గాయాలు వుండడంతో పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. ఘటనా స్థలిని బెంగళూరు పోలీసు కమిషనర్ సహా ఇతర పోలీసు ఉన్నతాధికారులు సందర్శించారు.



కర్ణాటక మాజీ డిజిపి ఓంప్రకాష్

## ఇంద్రవెల్లి అమరవీరులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 20:** ఇంద్రవెల్లి అమరవీరులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. అడవి బిడ్డల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల నిర్బంధం బద్ధలైన రోజు ఇదని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఇంద్రవెల్లి స్వేచ్ఛగా రెక్కలు విచ్చుకుందని పేర్కొన్నారు. నాకు అండగా నిలిచి, నాతో దండుగా కదిలి, ఇంద్రవెల్లి కొండల్లో దండోరా మోగించిన ఆదివాసీలకు అన్నగా, ఆత్మీయులకు దన్నుగా ఉండాలని తాను నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు. జల్ జంగల్ జమీన్ అంటూ హక్కుల కోసం అసువులు బాసిన అడవిబిడ్డల పోరాటం సదా స్ఫూర్తిదాయకం అని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## క్రికెట్ ఆడుతూ యువకుడు గుండెపోటుతో మృతి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** కీసర మండలంలోని రాంపల్లిదాయరలో మూలే ప్రణీత్ (32) అనే యువకుడు క్రికెట్ ఆడుతూ గ్రౌండ్‌లో గుండెపోటుకుగురై అపస్మారక స్థితికి చేరి మృతి చెందాడు. ఆదివారం ఉదయం మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని రాంపల్లిదాయర గ్రామంలోని త్యాగి స్పోర్ట్స్ వెన్యూ గ్రౌండ్‌లో మూలే ప్రణీత్ క్రికెట్ ఆడుతుండగా గుండెపోటు రావటంతో మృతి చెందినట్లు తెలిపారు. నగరంలోని బోయిన్ పల్లికి చెందిన మూలే ప్రణీత్ స్నేహితులతో కలిసి రాంపల్లిదాయరకు వచ్చి త్యాగి క్రికెట్ గ్రౌండ్‌లో ఉదయం 7.30 గంటల సమయంలో క్రికెట్ ఆడుతున్నాడు. ఆ సమయంలో ప్రణీత్‌కు శ్వాస ఆడకపోవటంతో అపస్మారకస్థితిలోకి వెళ్లగా పక్కనే ఉన్న స్నేహితులు వెంటనే అంబులెన్స్‌లో సమీపంలోని విజయ ట్రామా హాస్పిటల్‌కు తరలించగా అక్కడ డాక్టర్ పరిశీలించి ప్రణీత్ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించినట్లు స్నేహితులు తెలిపారు. ఈ సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంసభ్యులు సమాచారం అందుకుని ఆస్పత్రికి వచ్చి కన్నీటిపర్యంతమయ్యారు. తోటి స్నేహితులు సైతం కలత చెందారు.



ప్రణీత్ (ఫైల్)

## సోషల్ మీడియా పోస్టులపై పోలీసు సీరియస్

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** తెలంగాణలో సోషల్ మీడియాలో అడ్డగోలుగా వస్తున్న పోస్టులపై పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వంతో పాటు పోలీసు శాఖను కించపరిచే విధంగా వస్తున్న పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ తరహా పోస్టులను పంపడం సెంట్రల్ వర్సి టీలో గొడవలు మొదలైన తరువాత ఎక్కువయ్యాయి.

కొన్ని రోజులుగా ఆర్టిఫిషియల్ ఫోటోలను, వీడియోలను కొందరు ఇష్టానుసారం పోస్టు చేస్తుండడంతో వీటిని ప ంపుతున్న వారిపై చర్యలకు పోలీసు శాఖ రెడీ అవుతోంది. గచ్చిబౌలిలో సెంట్రల్ వర్సిటీ ఉదంతం తరువాత వందల సంఖ్యలో ఈ తరహా ఫోటోలు, వీడియోలు రా వడంతో దీనికి బాధ్యులైన వారిలో ఇప్పటికే కొందరిని గుర్తించిన పోలీసులు వారికి నోటీసులు ఇచ్చారు. ఇలా తప్పుడు ఫోటోలు పంపినందుకు నోటీసు అందుకున్న వా రిలో సీనియర్ ఐఎఎస్ అధికారిని స్మితా సబర్వాల్ కూడా వున్నారు. దీనిపై ఆమె పోలీసులకు వివరణ కూడా ఇచ్చారు. స్మితా సబర్వాల్‌తో పాటు నోటీసులు అందు కున్న ఇతరులను ఒకటి రెండు రోజుల్లో విచారించి వారిపై చర్యలు తీసుకో వాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ తరహా పోస్టులు ఎవరు చేసినా కఠిన చర్యలు తప్పవని టి. పోలీసు శాఖ హెచ్చరించింది.

# అదుపుతప్పి బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

### ప్రమాదంలో 10 మందికి తీవ్రగాయాలు

### ఒకరి పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు



ఆదివారం చింతలపాలెం శివారులో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

**చింతలపాలెం (ప్రభాత వార్త) ఏప్రిల్ 20 :** ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడిన విషాద ఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల శివారులోని జెలోడు కుంట, సమీపంలో చోటు చేసుకుంది. ప్రయా ణికులు, స్థానికులు, పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ మధ్యా హ్నం 3 గంటల సమ యంలో బస్సు నక్క గూడెం వెళ్తుంది. ఈ క్రమంలో చింతలపాలెం శివారులోని జెలోడు కుంట సమీపానికి రాగానే బస్సు స్టీరింగ్ రాడ్డు విరిగిందని, దీంతో బస్సు అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 65 మంది ప్రయాణికులు ఉన్నారని, వీరిలో సుమారు 10 మందికి తీవ్ర గాయాలు కాగా, సుమారు 25 నుండి 30 మందికి స్వల్ప గాయాలయ్యాయి అని తెలిపారు.

సమాచారం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, గాయపడిన ప్రయాణీకులను 108 వాహనాలు, ప్రయివేట్ వాహనాలు ద్వారా మెల్లచెరువు, హుజూర్‌నగర్, కోదాడ, ఖమ్మం ఆసుపత్రులకు తరలించారు. సహాయ చర్యలు చేపట్టడంలో స్థానికులు, పోలీసులు కీలక పాత్ర పోషించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనమును బస్సు ఢీ కొట్టడంతో బైక్ పై ఉన్నవారికి కూడా గాయాలయ్యాయి. మెల్లచెరువు మండలం శివ బాలాజీ తండాకు చెందిన బానోతు వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రి నుండి హైదరాబాద్ కు తరలించినట్లు సమాచారం.కోదాడ రూరల్ ఎస్సై అనిల్ కుమార్ రెడ్డి , పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## బోయిన్‌పల్లి ఠాణా పరిధిలో కొత్తతరహా మోసం!

**హైదరాబాద్ (కంటోన్మెంట్) ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** బ్యాంకు ఎటిఎంలలో జమ చేయాల్సిన 7 కోట్ల రూపాయలను తమ ఏజెన్సీల వద్ద ఉంచుకొని తాళాలు వేసి వెళ్లిపోయిన ఏజెన్సీ సంస్థలు బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ జి ఎస్ ట్రాన్సాక్ట్ టెక్నాలజీస్, సెక్యూర్ వాల్యూ వాల్ట్ ఏజెన్సీ పై కేసు నమోదు ప్రముఖ బ్యాంకులకు నగదు నిర్వహణ సేవలను అకస్మాత్తుగా నిలిపివేసిన ఏజెన్సీలుఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదంటూ గత కొన్నాళ్లుగా విధులను బహిష్కరించిన ఉద్యోగులు ఏ జి ఎస్ ట్రాన్సాక్ట్ టెక్నాలజీస్, సెక్యూర్ వాల్యూ వాల్ట్ ఏజెన్సీ ల వద్ద ఉన్న నగదును ఏ టి ఎం లకు పంపకపోవడంతో తలెత్తిన ఇబ్బందులుఓ బ్యాంకుకు సంబంధించిన 5 కోట్ల తో పాటు, మరొక బ్యాంకుకు సంబంధించి కోటి 80 లక్షల రూపాయలు ఏజెన్సీ గోదాములలో ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్న బ్యాంకు ఉద్యోగి బిమల్ పాత్ర్యాంకులకు సంబంధించిన నగదును ఏటీఎంలలో జమ చేసేందుకు పలుమార్లు ఏజెన్సీ లతో మాట్లాడినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో బోయిన్పల్లి పోలీసులను ఆశ్రయించిన ఫిర్యాదు చేసిన బ్యాంకు అధికారిఈ విషయంపై బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బిసి రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం తక్షణమే స్పందించాలి

### 20 రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న బత్తుల సిద్ధేశ్వర్

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం తక్షణమే స్పందించాలని బిసి సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. గత 20 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర్ దీక్షపై కేంద్రం స్పందించాలని.. సిద్దేశ్వర్‌కు ఎలాంటి ప్రాణ హాని జరిగిన కేంద్రం బాధ్యత వహించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో చేర్చి బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో బిసి హిందూ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ గత 20 రోజులుగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని గుర్తు చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం వారితో చర్చించి దీక్షను విరమింప చేయాల ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును, రాష్ట్ర గవర్నర్ కూడా ఆమోదించి రాష్ట్రపతికి పంపించి వారం రోజులు గడుస్తోందని.. ఈ బిల్లుపై ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బిల్లుకు రాష్ట్ర బిజెపి మద్దతు తెలిపిందని, కానీ కేంద్ర బిజెపి మాత్రం రాష్ట్ర బిజెపి నిర్ణయానికి విరుద్ధంగా బిసి బిల్లును ఆమోదించకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రెండు రోజుల్లోనే సిద్దేశ్వరకు మద్దతుగా హైదరా బాదులో అ ఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాలు, కుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి దేశవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

## ముగిసిన బిసి గురుకుల బ్యాక్‌లాగ్ సీట్ల ప్రవేశపరీక్ష

### 109 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 88 శాతం హాజరు

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు అధికారులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష కోసం 109 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 87.81 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు అధికారులు ప్రకటించారు. బిసి గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన 6832 బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కొరకు దరఖాస్తులను స్వీకరించగా.. 26,884 దరఖాస్తులు వచ్చాయి. అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహించారు.

పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపును చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6, 7, 8, 9వ తరగతుల సీట్లను భర్తీ చేయడానికి ప్రవేశ పరీక్షను నిర్వహించారు. 6వ తరగతిలో 9963 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 8498 మంది(87.94శాతం) హాజరయ్యారు. 7వ తరగతిలోని సీట్ల కోసం 6838 దరఖాస్తు చేసుకోగా వారిలో 6023 మంది(88.08శాతం) పరీక్షకు హాజరయ్యారు. 8వ తరగతిలోని సీట్లకు 6224 మంది దరఖాస్తు చేసుకుంటే.. అందులో 5421 మంది(87.05శాతం) పరీక్షలకు హాజయ్యారు. 9వ తరగతిలోని సీట్ల కోసం 4161 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 3669 మంది(88.17 శాతం) పరీక్షలకు హాజరయ్యారు.

# విహార యాత్రలో సిఎం రేవంత్‌రెడ్డి

### సోనియా, రాహుల్‌పై ఇడి కేసుల నమోదు

### రేవంత్ మౌనవ్రతంలో అంతర్యమేమిటి?: ఎమ్మెల్సీ కవిత

**ఖమ్మం, ప్రభాతవార్త బ్యూరో:** కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై ఈడీ కేసులు నమోదు చేస్తే...దేశ వ్యాప్తంగా ఆందోళనలకు ఆపార్టీ హైకామాండ్ పిలుపునివ్వగా సీఎం రేవంత్ రెడ్డి నోరు మెదప కుండా విదేశీ విహార యాత్రలో తిరుగుతున్నారని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఓ ప్రైవేట్ కార్యక్రమం లో పాల్గొనేందుకు ఆదివారం సాయంత్రం ఖమ్మం వచ్చిన ఆమె, ఎంపీవద్దిరాజు రవిచంద్ర తో కలిసి ఆయన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధి నాయకత్వం ఈడీ దాడులపై తీవ్రంగా పరిగణించగా సీఎం రేవంత్ రెడ్డి మాత్రం మోనం వహించడం వెనకాల ఉన్న ఆంతర్యం ఏమిటని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో ఏఒక్కటి అమలు చేయలేదని,కేవలం మాటల గారడీతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు.ఖమ్మం జిల్లాలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తో పాటు ముగ్గురు మంత్రులు ఉండికూడా ,వడగండ్ల వాన ఈదురు గాలుల వల్ల పంటలు దెబ్బతిన్నా రైతాంగాన్ని ఆదుకోలేక పోయారన్నారు. కనీసం పంటలు దెబ్బతిన్నా ప్రాంతాల్లో పరిశీలించి అన్నదాతలకు ఓదార్పు ను ఇవ్వలేక పోయారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి ధాన్యం తడిసి ముద్దయ్యి పోగా,మామిడి తోటల రైతులు తీవ్రంగా నష్ట పోయారని ముఖ్య మంత్రికి రైతుల గోసా పట్టడం లేదన్నారు. జపాన్ పర్యటన లో ఉన్న ముఖ్యమంత్రి అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఏమాత్రం పట్టించుకోకుండావిదేశి యాత్రలు సాగిస్తున్నారని దుయ్యబట్టారు.వర్షాల వల్ల పంటలు దెబ్బ తిన్నా ప్రతి ఎకరానికి రూ.20 వేలు నష్ట పరిహారం చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కమ్యూనిస్టు లు రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడం, ప్రజా ఉద్యమాలు చేపట్టడంలో ...ప్రభుత్వాన్ని నిలదీయకపోవడం లో దారుణమని విమర్శించారు.వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలోపార్లమెంటరీ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్,మాజీ ఎమ్మెల్యే లు మదన్ లాల్,మాలోతు కవిత తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న ఎంపి వద్దిరాజు రవిచంద్ర తదితరులు

**పువ్వాడ, ఆర్జేసిల పరామర్శ**

ఇటీవల కాలు ఫ్యాక్చర్‌తో అనారోగ్యం పాలైన పువ్వాడ విజయ లక్ష్మి ,పువ్వాడ నాగేశ్వరరావు దంపతుల స్వగృహానికి వెళ్ళి కవితతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పరామర్శించారు.అలాగే బిఆర్ఎస్ జిల్లా నాయకులు, ఎస్ బిఐటి విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ(ఆర్జేసి) ఇంటికి వెళ్లి ఆమె పరామర్శించారు.

**ఘన స్వాగతం..**

ఖమ్మంలో వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం పలికారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ,బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు.


## 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి అమలు చేయాలి

### పెండింగ్ బిల్లులు, డిఎలు మంజూరు చేయాలి

### టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ తీర్మానం

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకి 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సిని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసింది. దాంతోపాటు పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను, డిఏలను వెంటనే మంజూరు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ హాలులో రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టగా దానిపై చర్చ జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ లందరికీ తెలంగాణ రెండవ వేతన సవరణ కమిషన్ రిపోర్టును త్వరితగతిన తెప్పించుకొని 51 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు పరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసినట్టు నాయకులు తెలిపారు. 2023 జూలై మాసం నుండి అమలు కావలసిన వేతన సవరణ .. 2025 సంవత్సరం నాటికి కూడా అమలుకు నోచుకోలేకపోవడం శోచనీయమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన సవరణను వెంటనే చేపట్టాలని కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరింది. దేశంలోనే 5 డిఏలు పెండింగ్ ఉన్న రాష్ట్రం మరొకటి లేదని.. న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన డిఏలు వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల అనేక బిల్లులు మంజూరు కాబడి కూడా నగదు పొందలేని స్థితిలో ఈ-కుబేర్ లో పెండింగ్‌లో ఉన్నదని వాటన్నింటి వెంటనే విడుదల చేయాలని కోరారు. రిటైర్మెంట్ తర్వాతనైనా అప్పుల చెల్లింపు, పిల్లల పెళ్లిళ్లకు లేక స్వగృహ కాంక్ష నెరవేర్చుకుందాం అనుకున్న పెన్షనర్ల కలను ఈ-కుబేర్ కొల్లగొట్టిందన్నారు. ఈ-కుబేర్‌ను రద్దుచేసి గతంలో వలె నేరుగా బ్యాంకుల ద్వారా చెల్లింపు విధానాన్ని పునరుద్ధరించాలని కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరింది. పాఠశాల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేస్తున్న కృషి పట్ల సంఘం.. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ వేసవి సెలవుల్లోనే బదిలీలు పదోన్నతులు చేపట్టాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రభుత్వం పేర్కొన్నందున ప్రతి సంవత్సరం వేసవిలో నియామకాలు, బదిలీలు, పదోన్నతులు ఉండేలా క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర కార్యవర్గం కోరింది.

## అంతర్జాతీయ అథ్లెటిక్ కోచ్‌పై నాడా సస్పెన్షన్ వేటు



రమేష్ నాగపురి

**హైదరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** తెలంగాణకు చెందిన ప్రముఖ అంతర్జాతీ అథ్లెటిక్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్ నాగపురిపై నేషనల్ యాంటీ డోపి ంగ్ ఏజెన్సీ (నాడా) సస్పెన్షన్ వేటు వేసింది. రమేష్ వద్ద కోచింగ్ తీసుకున్న ఇద్దరు అంతర్జాతీయ అథ్లెట్లు డోప్ టెస్ట్‌కు నిరాకరించడంతో పాటు డోప్ టెస్ట్ శ్యాంపిల్స్ ఇ వ్వకుండా దాటవేశారు. దీంతో వీరికి కోచ్‌గా వున్న రమేష్‌తో పాటు ఆయన వద్ద కోచింగ్ తీసుకున్న ఇద్దరు క్రీడాకారులపై నాడా ఆదివారం నాడు సస్పెన్షన్ వేటు వేసిం ది. రమేష్ అథ్లెటిక్ విభాగంలో కోచింగ్ నిపుణుడుగా పేరొందారు. అంతర్జాతీయ స్ప్రింటర్ ద్యుతి చంద్, పారా ఒలింపియన్ జీవంజి దీప్తి, నందిని వంటి దిగ్గజ క్రీడా కారులకు రమేష్ కోచ్‌గా వున్నారు. నగరంలోని గచ్చిబౌలి స్టేడియం కేంద్రంగా రమేష్ అథ్లెటిక్ క్రీడాకారులకు కోచింగ్ ఇస్తుంటారు. కాగా డోపింగ్ వ్యవహారంలో రమేష్ తో పాటు మరో ఇద్దరు సహాయ కోచ్‌లపైనా నాడా వేటు వేసింది.

మరోవైపు జాతీయ స్థాయి అథ్లెట్లు పరాస్ సింఘాల్, పూజా రాణి, షణ్ముగ శ్రీనివాసులు, ప్రత్యూ ష, శుభం మహారా, కిరణ్, జ్యోతి సహా ఏడుగురు కూడా డోపింగ్ టెస్టుకు హాజరు కాక పోవడంతో వారిపైనా సస్పెన్షన్ వేటు వేయాలని నాడా నిర్ణయించింది. వీరికి రమేష్ సహాయం చేసినట్లు నాడా భావిస్తోంది. రమేష్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి)లో పనిచేస్తున్నారు. 2023లో ఆయనకు ద్రోణాచార్య అవార్డు లభించగా వెను వెంటనే జాతీయ అథ్లెటిక్ సమాఖ్య జూనియర్ విభాగంలో చీఫ్ కోచ్‌గా నియమించింది. నాడా యాంటీ డోపింగ్ రూల్స్ 2021 లోని ఆర్టికల్ 2.9 ప్రకారం రమేష్‌పై వేటు వేశారు. ఈ విషయమై తెలంగాణ క్రీడల శాఖ ఇంతవరకు ఎలాంటి స్పందన తెలియచేయలేదు. గతంలో ద్యుతి చంద్ డో పింగ్ కేసులో విఫలమై సస్పెన్షన్‌కు గురవడం తెలిసిందే.

**నేను ఏ తప్పు చేయలేదు..**

**ఏ విచారణకైనా సిద్ధం: రమేష్**

ఇదిలావుండగా తనను నాడా సస్పెండ్ చేయడంపై రమేష్ నాగపురి స్పందించారు. ఆదివారం నాడు హైదరాబాద్‌లో తనతో మాట్లాడిన మీడియాకు ఆయన పలు అంశాల గురించి వివరించారు. తాను ఏనాడు డోపింగ్‌కు పాల్పడలేదని, దీనిని ప్రోత్సహించలేదని, పేదరికంలో వున్న వారిని జాతీయ, అంతర్జాతీయ అథ్లెట్లుగా తీర్చి దిద్దిన ఘనత తన సొంతమని ఆయన తెలిపారు.

నాడా అన్యాయంగా తనను సస్పెండ్ చేసిందని, తన వద్ద కోచింగ్ తీసుకున్న ఇద్దరు క్రీడాకారులు శ్యాంపిల్స్ ఇవ్వలే దని కారణం చూపుతోందని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన వెల్లడించారు. నాడా నిర్ణయంపై న్యాయ పోరాటం చేస్తానని ఆయన తెలిపారు.

## నేడు ఎపిలో అంగన్‌వాడీల ధర్నా

### సమస్యలు పరిష్కరించాలంటూ సిఎంకు బహిరంగ లేఖ రాసిన అంగన్‌వాడీల సంఘం

**విజయవాడ,ఏప్రిల్20,ప్రభాతవార్తప్రతినిధి:** అంగన్ వాడీల సమస్యల సత్వర పరిష్కారం కోరుతూ ఈనెల 21న విజయవాడ ధర్నా చౌక్‌లో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ వెల్లడించింది.సీఎం చంద్రబాబు తమ సమస్యలపై వెంటనే కీలక నిర్ణయంతీసుకోవాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కారుసాల సుబ్బారావమ్మలు కోరారు.ఆ మేరకు సిఎం చంద్రబాబునాయుడుకు బహిరంగ లేఖ రాశారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలని, అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ఎపి అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. మినీ వర్కర్లకు ఖాళీ పోస్టుల్లో ప్రమోషన్లు ఇవ్వాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్స్‌తో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, అదనపు హెల్పర్‌ను కేటాయించాలని గ్రేడ్ సూపర్ వైజర్ పోస్టుల్లో మినీ వర్కర్లకి అవకాశం కల్పించాలని సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారుగా 6830 మినీ అంగన్‌వాడీ సెంటర్లుగా నడుస్తున్నాయని, మినీ వర్కర్లు ఏజెన్సీ ప్రాంతాల్లో ,మారుమూల గ్రామాల్లోని పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారాన్ని వండి పెట్టడం, ఆరోగ్యం, ప్రీస్కూల్ విద్య అందిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు.

# నిరంతర విద్యార్థి చంద్రబాబు

### చంద్రబాబు అసెంబ్లీ ప్రసంగాల సంపుటాల ఆవిష్కరణ సభలో కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి అచ్చెన్నాయుడు, డిప్యూటీ స్పీకరు రఘురామ



సిఎం నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ ప్రసంగాల సంపుటాలను ఆవిష్కరిస్తున్న నేతలు

**విజయవాడ,ఏప్రిల్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** మంచి అభిమానులు ఉన్న ఏకైక రాజకీయ నాయకుడు చంద్రబాబు అని పలువురు టీడీపీ నేతలు ప్రశంసించారు.ఆయనను రాజకీయంగా వ్యతిరేకించే వారుసైతం అభిమానిస్తారన్నారు. శ్రీకృష్ణుడికి గోపికల మీద ఎంత ప్రేమ ఉంటుందో అలాగే తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకులందరూ చంద్రబాబును ప్రేమిస్తారని అభిప్రాయపడ్డారు. 1995-2003, 2004 -2014 సంవత్సరాల మధ్య చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, విపక్షనేతగా ప్రసంగాలను రెండు సంపుటాలను శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘు రామకృష్ణంరాజు(రఘురామ), మంత్రి అచ్చెన్నాయుడు, తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లాశ్రీనివాసరావు, తెనాలి శ్రావణ్ కుమార్, సీనియర్ పాత్రికేయుడు వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చేసిన ప్రసంగాలకు సంబంధించి ఈ రెండు పుస్తకాలు జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీ జనార్దన్ ప్రచురించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ అమరావతి లాంటి మహానగర నిర్మాణ ప్రదాత చంద్రబాబు అని స్పష్టం చేశారు. చంద్రబాబు శ్రమదానం, జన్మభూమి లాంటి కార్యక్రమాలు చేపట్టి తనలో ఎంతో మార్పు తెచ్చారని గుర్తు చేశారు. ఆయన వద్ద వ్యక్తిగతంగా నేర్చుకున్న అంశాలు తనకు అమెరికాలో ఎంతో ఉపయోగపడిందని వివరించారు.

పుస్తకాలను తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, సీనియర్ పాత్రికేయులు, రచయిత విక్రమ్ పూల సంకలన పరిచారు. "స్వర్ణాంధ్ర ప్రదేశ్ సారథి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ ప్రసంగాలు "పేరుతో రెండు పుస్తకాలను ప్రచురించారు.చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ప్రతి సభలో తాను ఉండడం గౌరవంగా భావిస్తున్నానని మంత్రి అచ్చెనాయుడు స్పష్టం చేశారు. అసెంబ్లీలో చంద్రబాబు చేసిన ప్రసంగాలు ప్రజలకు తెలియడం లేదని తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు వ్యాఖ్యానించారు. ఇలాంటి ప్రయత్నం జనార్దన్, విక్రమ్ పులాలు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. సీఎం చంద్రబాబుకు ఏదైనా కొత్త విషయం చిన్న కుర్రాడు చెప్పినా శ్రద్ధగా వింటూ టైం మర్చిపోయి నిత్య విద్యార్థిగా నేర్చుకుంటారని డిప్యూటీ స్పీకర్ రఘురామ వ్యాఖానించారు. టైం మేనేజ్‌మెంట్ విషయంలో ఒకరిద్దరికీ ఇబ్బంది కలిగినా రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందని తేల్చి చెప్పారు. నిజంగా టైం ట్రావెల్ చేయగల నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు మాత్రమేనని రఘురామ కొనియడారు. ప్రస్తుతం టీ 20 మ్యాచెస్ ఎంత ఇంట్రెస్ట్‌గా చూస్తున్నారో అప్పట్లో ప్రెస్‌గ్యాలరీ నుంచి ఉమ్మడి ఏపీ అసెం బ్లీ సమావేశాలు కూడా అలాగే చూసే వాడినని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ ప్రసంగాల పుస్త కాల సంకలనకర్త విక్రమ్ పూల వెల్లడించారు.

# ఎపి సిఎం చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**విజయవాడ,ఏప్రిల్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదినం సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు పలువురు ప్రముఖులు,అభిమానుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైకాంగ్రెస్ పార్టీనేత,మాజీ సీఎం వైఎస్ జగన్ పలువురు మంత్రులు, కూటమి పార్టీ ఎంపీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం నాయకులు వేడుకలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల అన్నదానాలు,రక్తదాన శిబిరాలు,మజ్జిగ పంపిణీలు చేస్తున్నారు.ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు.పాలు,రొట్టెలు పంపిణీ చేస్తున్నారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు చంద్రబాబు బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏకంగా 75 కిలోల కేక్ కట్ చేయడం విశేషం. ఈ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు, వర్ల రామయ్య, అశోక్ బాబు, టీడీ జనార్ధన్, ఏవీ రమణ, నన్నపనేని రాజకుమారి, వీవీవీ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజనరీ లీడర్ చంద్రన్న పేరిట ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను నేతలు వీక్షించారు. హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ ట్రస్టు భవన్‌లో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ముఖ్యమంత్రి చంద్రబాబుకు





పుట్టిన రోజు శుభాకాంక్షలు రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) కార్యాలయం లో ఘనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగాయి. ఏపీ మంత్రులు పి,నారాయణ,రాంప్రసాద్‌రెడ్డి.బీసీ జనార్దన్‌రెడ్డి,వంగలపూడి అనిత.సవిత. నిమ్మల రామానాయుడు.నాదెండ్ల మనోహర్.కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి.కొలసు పార్థసారధి, సత్యకుమార్ యాదవ్, కేంద్రమంత్రులు కె.రామ్మోహ ననాయుడు,పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ,స్పీకరు అయ్యన్నపాత్రుడు,డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణంరాజులు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.జదేశంలో ఆర్థిక పరిస్థితి ఐటీ మీద ఆధారపడడానికి ఐటి విప్లవం తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని తమ,తమ ప్రకటనల్లో వ్యాఖ్యానించారు.

**నా మిత్రుడుకి పుట్టినరోజు శుభాకాంక్షలు ప్రధాని నరేంద్రమోడీ:** సీఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. నా స్నేహితుడు చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ పేర్కొన్నారు. భవిష్యత్ రంగాలపై దృష్టి సారించి చంద్రబాబు పనిచేస్తున్నారని, ఏపీ అభివృద్ధికి అవిశ్రాంతంగా పనిచేస్తున్న ఆయన పనితీరు ప్రశంసనీయమని ప్రధాని కొనియాడారు. చంద్రబాబుకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యకరమైన జీవితం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానన్నారు.

**రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు కృషి కొనసాగాలి : గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చంద్రబాబు కృషి కొనసాగాలని ఆకాంక్షించారు.

**అనితర సాధ్యుడు చంద్రబాబు : డీ సీఎం పవన్ కల్యాణ్:** సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆర్థికంగా కుంగిపోయి, అభివృద్ధి అగమ్య గోచరంగా తయారై శాంతిభద్రతలు క్షీణించి పోయిన రాష్ట్ర ప్రగతిని పునరుజ్జీవింపచేయడం చంద్రబాబు లాంటి దార్శనికునికి మాత్రమే సాధ్యమని కొనియాడారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చంద్రబాబు విజన్ నిరంతరం పనిలో చూపే ఉత్సాహం అద్భుతమన్నారు. భవిష్యత్తును ముందుగానే అంచనా వేసి అందుకు అనుగుణంగా వ్యవస్థలను నడిపించే విధానం స్ఫూర్తిదాయకమన్నారు. వజ్రోత్సవ జన్మదిన శుభ సమయాన చంద్రబాబుకి సంపూర్ణ ఆయుష్షు, ఆనందం ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు.

**మాజీ ముఖ్యమంత్రి జగన్ శుభాకాంక్షలు**

సీఎం చంద్రబాబుకు వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ " ఎక్స్ " వేదిక శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు మంచి ఆరోగ్యంతో చంద్రబాబు దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షిస్తున్నానని జగన్ ఆకాంక్షించారు.

**నాన్నకు జన్మదిన శుభాకాంక్షలు - మంత్రి నారా లోకేష్:** చంద్రబాబునాయుడికి ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేశ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవి:** మాజీ కేంద్రమంత్రి ,మెగాస్టార్ చిరంజీవి"ఎక్స్" వేదికగా చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దార్శనికత,కృషి, పట్టుదల, అంకితభావం ఉన్న అరుదైన నాయకుడు మీరు అంటూ చంద్రబాబును మెగాస్టార్ చిరంజీవి కొనియాడారు.

**మీతోనే ఉంటాను : నారా భువనేశ్వరి**

చంద్రబాబునాయుడికి ఆయన సతీమణి నారా భువనేశ్వరి జన్మదినశుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు శుభాకాంక్షలండీ అంటూ ఎక్స్ వేదికగా ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోను పోస్ట్ చేశారు. కాగా, చంద్రబాబు 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు రంగాలకు చెందిన ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి

**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం గౌరవరం సమీపంలో రోడ్డుప్రమాదంలో పెయింటర్ చేజర్ల మల్లికార్జున (32), ఆదివారం మృతిచెందారు. బోగోలు మండలం ముంగమూరు గ్రామానికి చెందిన మల్లికార్జున కావలిలో పెయింట్ పనులు చేసుకుని మేస్త్రి దగ్గర డబ్బులు తీసుకుని తన నివాసానికి వెళ్లేందుకు గౌరవరం సర్వీసురోడ్డులో నుంచి మెయిన్‌రోడ్డుకు వెళుతుండగా వెనుకనుంచి బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్‌బోల్తా: ఇద్దరు దుర్మరణం

**మర్రిపాడు (నెల్లూరు), ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** ఇద్దరు యువతీ , యువకులు దైవదర్శనానికి వెళ్ళి తిరుగుప్రయాణంలో రోడ్డు ప్రమాద రూపంలో అనంతలోకాలకు వెళ్ళారు. తమ సమస్యలు, ఈతిబాధలు తీరాలని, కోరినకోర్కెలు నెరవేర్చుకోవాలని పెంచలకోనలోని నర్సింహస్వామిని ప్రార్థించి ఇంటికి వెళ్ళే లోపే వారి ప్రాణాలు అనంతలోకంలో కలిసిపోయాయి.ఈ విషాద సంఘటన జిల్లా సరిహద్దు ప్రాంతమైన మర్రిపాడు అటవీ ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి సమీపంలో నెల్లూరు - ముంబాయి జాతీయరహదారిపై ఈరోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై వేగంగా ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. బద్వేల్ ప్రాంతానికి చెందిన మల్లు నర్సింహులు (26), ఝాన్సీ (26) మోటర్‌బైక్‌లో పెంచలకోనకు వెళ్ళి తిరిగి బద్వేల్ వైపు వెళుతుండగా జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఝాన్సీ అక్కడికక్కడే మృతిచెందగా మల్లు నర్సింహులు గాయాలతో ఉండగా చికిత్సకై బద్వేల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మర్రిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దుర్గమ్మ ఆలయంలో నేడు హుండీల లెక్కింపు





**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** దుర్గమ్మ వారి ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదినం సందర్భంగా ప్రత్యేక హోమాలు, పూజాదికాలను ఇఒ కె రామ చంద్రమోహన్ నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. గణపతిహోమం, ఆయుష్‌హోమం, మృత్యుంజయహోమం, నవగ్రహ హోమాలు పండితులు నిర్వహించారు.

**ఆదిత్యునికి పూజాదికాలు:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం సందర్భంగా సూర్యోపాసన సేవను పండితులు జరిపారు. ఆదిత్యహృదయం, సూర్యనమస్కారాలు, అరుణ పారాయణ, సూర్య అష్టకం, స్తుతి పఠిస్తూ పూజాదికాలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

**మహామండపం నుండి తారురోడ్డు:** మహామండపం నుండి కనకదుర్గానగర్ వరకు తారురోడ్డు వేసే పనులను ఆదివారం ఇఒ కె రామ చంద్రమోహన్ పూజాదికాలు జరిపిన అనంతరం ప్రారంభించారు.

**సిసి కెమేరాలు ఏర్పాటు:** దుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తుల చెప్పులు భద్రపరిచే స్టాండ్, సెల్‌ఫోన్ కౌంటర్ల వద్ద నూతనంగా సిసి టివిలను ఏర్పాటు చేశారు.

**నేడు హుండీల లెక్కింపు:**

దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 21 సోమవారం లెక్కిస్తామని ఇఒ కె రామచంద్రమోహన్ తెలిపారు.

**దుర్గమ్మకు నృత్యనీరాజనం :** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం కళావేదికపై విజయవాడకు చెందిన శ్రీ నటరాజ నృత్యకళా నిలయ విద్యార్థులకు 15 మంది నాట్యాచార్యులు కెఎస్ వాహిని నేతృత్వంలో అద్భుతంగా చేశారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి ప్రసాదం, మెమొంటోలను అందించారు.

# హృదయాన్ని,మేధస్సును కదిలించేది 'శ్రమ కావ్యం'


### సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్ తేజ



**అనంతపురం, ఏప్రిల్ 20 ప్రభాతవార్త బ్యూరో:** హృదయాన్ని,మేధస్సును కదిలించేది శ్రమ కావ్యం గానం అని ప్రముఖ సినీ గేయా రచయిత సుద్దాల అశోక్ తేజ పేర్కొన్నారు. శ్రమ ద్వారానే సామాజిక గమనం ఉంటుందని ఆయన కవిత గానం ద్వారా నొక్కి చెప్పారు. శ్రామికుల కృషిని అజరామం అను రీతిలో శ్రామికుల గురించి వివరిస్తూ సుద్దాల అశోక్ తేజ చేసిన కవిత గానం చప్పట్లతో మారుమ్రోగింది. విద్యార్థినుల నుంచి అనుహ్య స్పందన లభించింది. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో సిఐటియు ,ఐద్వా, యూటీఎఫ్ ,ఎస్ఎఫ్ఐ, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రమ కావ్యం గానం పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత ఆచార్య రాజపాలెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది .ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ జీవితం గురించి సాహితీ స్రవంతి నాయకురాలు డాక్టర్ ప్రగతి తెలియజేశారు .అనంతరం శ్రమ కావ్యం ఉద్దేశించి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన, సిఐటియు నాయకులు ఆర్వి నాయుడు యుటిఎఫ్ జిల్లా నాయకులు లింగన్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఒ.నల్లప్ప ,సిఐటియు రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ ,మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం భాష, సామాజిక వేత్త బోస్ మానవతా రక్తదాతల తరిమెల అమర్నాథ్ రెడ్డి, కవి ఏలూరు వెంకన్న, అనంతపురం జిల్లా కోర్టు పబ్లిక్ ప్లీడరు రాచమల్లు హరినాథ్ రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, సిఐటియు జిల్లా నాయకులు రామిరెడ్డి, సినీ రచయిత , కవి సుద్దాల అశోక్ తేజ్ సతీమణి నిర్మల కూడా ఈ కార్యక్రమానికి హాజరై అశోక్ తేజ కవిత గానాన్ని ఆలకించింది.

# తిరుమల సమాచారం







### వెంగమాంబ భవనంలో అన్నప్రసాదం వితరణ

## భాష్యం విద్యాసంస్థల అధినేత విరాళం రూ.44లక్షలు

**తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులకు చేస్తున్న అన్నదానంలో స్వయంగా పాల్గొని వడ్డిస్తే కలిగే తృప్తి వెలకట్టలేనిదని సిఎం చంద్రబాబునాయుడు ఇప్పటికే విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదే నానుడిని చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ 44లక్షలు రూపాయలు విరాళం అన్నప్రసాదానికి అందించారు. ఈ విరాళాలతో ఒకరోజంతా భక్తులకు ఉదయం నుండి రాత్రివరకు నిరంతరాయంగా చంద్రబాబుపేరున అన్నప్రసాదం వడ్డించారు. ఇక్కడ టిటిడి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దాత రామకృష్ణతో కలసి అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాదాలను స్వయంగా వడ్డించారు. ఇక్కడ అన్నప్రసాదాల రుచిపై వాళ్ళు నెల్లూరు, గుంటూరు, హైదరాబాద్, కర్నూలు భక్తుల నుండి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులందరూ రుచి, నాణ్యత అద్భుతంగా ఉందని, అన్నం మరింత బావుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ రాజేంద్ర, వివిఎస్ఒ అల్లంసురేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి పాల్గొన్నారు.

ఇలాంటి కార్యక్రమాల ద్వారా భావితరాలకు సంస్కారం నేర్పి నట్లు అవుతుందని, సమాజ హితం కోసం పనిచేసినట్లవుతుందని తెలిపారు. అనంతరం భక్తులతో కలసి స్వయంగా ఆ ముగ్గురు అన్నప్రసాదాలు స్వీకరించడం సంతోషం వ్యక్తం చేశారు.



## వెంకన్న దర్శనానికి 22గంటలు

### వేసవి సెలవులతో భారీగా పెరిగిన భక్తులు

**తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవులు పూర్తిస్థాయిలో ఆరంభానికి ముందే కలియుగవైకుంఠం తిరుమల భక్తజనసంద్రంగా మారింది. వారాంతపుకావడం,శని ఆదివారాలు సెలవు రావడంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా చేరారు. ఆదివారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల రెండు కిలోమీటర్లు క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 22గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరేడుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు.గదులు దొరకని భక్తులు ఆరుబయట, పార్కుల్లో, షెడ్లలో తలదాచుకుని విశ్రాంతి పొందుతున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 47 వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 30వేలమంది భక్తులు అర్థరాత్రి వరకు దర్శనంచేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. సాధారణంగా శని,ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. తిరు మలేశునికి ఎంతో ముఖ్యమైన శనివారంరోజు స్వామి వారిని దర్శించుకుంటే రెట్టింపు ఆశీస్సులు లభిస్తాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తులు భారీగా తిరుమలకు చేరుకోవడంతో గదుల కోసం సామాన్యభక్తులు నిరీక్షిస్తున్నారు. అదనపు ఇఒ వెంకయ్య చౌదరి ఏర్పాట్లను తనిఖీ చేశారు.

## శ్రీవారి సేవలో జడ్జి అరుణసారిక



**తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని కుటుంబంతో కలసి న్యాయ మూర్తి అరుణసారిక దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ఆమె ఆలయంలోనికి చేరుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు దర్శనానంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెంకన్న ఆశీస్సులకు విశ్రాంత సిజెఐ ఎన్‌వి రమణ




**తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ ఆదివారం రాత్రి తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిథి గృహం వద్ద ఆయనకు రిసెప్షన్ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్ సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ బహుకరించారు. రాత్రికి తిరుమలలో బసచేయనున్న జస్టిస్ రమణ సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

## ఎపి సిఎం చంద్రబాబుకు మరింత శక్తి ప్రసాదించాలి

### 750 కొబ్బరికాయల మొక్కులు చెల్లించిన అభిమాని

**తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి, అన్నిరంగాల్లో ప్రగతి దిశగా పాలనసాగిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడుకు ఆయురారోగ్యాలు, శక్తిని ప్రసాదించాలని పార్టీ నాయకులు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని వేడుకున్నారు. చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజు సందర్భంగా టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, తిరుమల టిడిపి నాయకులు రాజుయాదవ్, వెంకీరాయల్, మధు,కుమార్ తదితరులతో కలసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయం ముందు ప్రత్యేక పూజలు చేశారు. అఖిలాండం వద్ద 7.5కిలోల కర్పూరం వెలిగించి, 750 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందనామస్మరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌వర్మ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాల ముందుకు నడిపించే శక్తిని చంద్రబాబునాయుడుకు కలగజేయాలని శ్రీవారిని



ప్రార్థించామన్నారు. అభివృద్ధి దార్శనికుడు చంద్రబాబు అన్నారు. ఆయనకు సంపూర్ణ ఆయుష్షును, శక్తిని ప్రసాదించాలని వేంకటేశ్వర స్వామిని ప్రార్థించామన్నారు.

## తిరుమల ఘాట్‌లో కారు దగ్ధం: భక్తులు సురక్షితం

**తిరుమల,ఏప్రిల్ 20ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వస్తూ ప్రయాణిస్తున్న కారులో ఉన్నఫళంగా మంటలు వ్యాపించడంతో భక్తులు ఆందోళనతో దిగి బయటకు పరుగులు తీశారు. ఆదివారం ఉదయం ఈ సంఘటన తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో చివరమలుపు భాష్యకార్లసన్నిధి ప్రాంతంలో జరిగింది. తూర్పుగోదావరిజిల్లా రావులపాళెంకు చెందిన భక్తులు నలుగురు కారులో తిరుమలకు వస్తున్నారు. కారు ఘాట్‌లో భాష్యకార్లసన్నిధి మలుపువద్దకు రాగానే పొగలు వ్యాపించాయి. ఇంజిన్‌లో పొగలు రావడంతో డ్రైవర్ రోడ్డుపక్కన కారును ఆపివేశాడు. ఆయనతో సహా భక్తులు ప్రాణాలు కాపాడుకునేందుకు క్రిందకు దిగారు. దూరంగా పరుగులు తీశారు. కారులో మంటలు వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది, విజిలెన్స్,అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పి వేశారు. అప్పటికే కారులో ఉన్న భక్తుల లగేజీలు బూడిదయ్యాయి. రెండురోజుల వ్యవధిలో తిరుమలలో రెండోసంఘటన జరగడం, అగ్నికి కార్లు ఆహుతవడం భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. కాగా సుదూరం నుండి ఏకధాటిగా రావడంతోనే ఘాట్‌లో కారు ఇంజిన్‌లో మంటలు వ్యాపించాయనేది సమాచారం.





# 25న రానున్న 'సూర్యాపేట్ జంక్షన్'



**ఈశ్వర్, నైనా సర్వర్** జంటగా అభిమన్యు సింగ్ కీలక పాత్రలో నటించిన మూవీ 'సూర్యాపేట్ జంక్షన్'. యోగాలక్ష్మి ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై అనీల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్ శ్రీనివాసరావు నిర్మాణంలో, రాజేష్ నాదెండ్ల దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ ఈ నెల 25న థియేటర్‌లలో విడుదల కాబోతుంది. ప్రముఖ నటుడు అభిమన్యు సింగ్ కీలక పాత్రలో నటించారు. గ్లోబల్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా తెలుగు రాష్ట్రాలలో గ్రాండ్‌గా విడుదల కానుంది.
ఈ సందర్భంగా హీరో ఈశ్వర్ మాట్లాడుతూ... ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌కు డిజిటల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్‌గా రిలీజైన "మ్యాచింగ్.. మ్యాచింగ్ణ సాంగ్‌తో పాటు టీజర్ ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. మంచి కథ ఉంటే తెలుగు ప్రేక్షకులు అదరిస్తారు, హిట్టు చేస్తారని ఎన్నో సార్లు రుజువైంది. అందుకే ఈ సినిమా చేశాం. సినిమాలో యాక్షన్ సీన్స్ కూడా చాలా సహజంగానే ఉంటాయి. ఈ నెల 25న రిలీజ్ అయ్యే ఈ సినిమాను థియేటర్ లలో చూసి మీరందరూ మమ్మల్ని అదరిస్తా రని ఆశిస్తు న్నాను అన్నారు. ప్రొడ్యూసర్ అనిల్ కుమార్ కాట్రగడ్డ మాట్లాడుతూ... "మా సూర్యాపేట్ జంక్షన్ మూవీ ఈనెల 25న ఆంధ్రా, తెలంగాణలలో గ్లోబల్ సినిమా డిస్ట్రిబ్యూషన్‌లో విడు దల కావడం ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా సునీల్‌కి, రాంమోహన్‌కి ధన్య వాదాలు తెలుపు తున్నాం. మా సినిమాని థియేటర్‌లలో చూడాలని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు.

# అర్జున్ S/o. వైజయంతి బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్



**నందమూరి కళ్యాణ్ రామ్** ఎమోషనల్ బ్లాక్ బస్టర్ అర్జున్ S/o. వైజయంతి. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో నటించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ విడుదలైన ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ నిర్వహించారు. బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి మాట్లాడుతూ, ఈరోజు సినిమా హిట్ అయిందంటే ఆ క్రెడిట్ మొత్తం ప్రేక్షకులదే. డైరెక్టర్ ప్రదీప్ ప్రతి క్యారెక్టర్ని చాలా బ్యాలెన్స్‌గా డీల్ చేశారు. ఈ సినిమా క్లైమాక్స్‌లో ఒక సీన్ ఉంది. ఆ సీన్‌ని వేరే హీరో అయితే ఒప్పుకోరు. ఈ సినిమాలో కళ్యాణ్ బాబు అంతా రిస్క్ తీసుకుని లాస్ట్ 20 నిమిషాల్ని అద్భుతంగా మలచడంలో ప్రధాన పాత్ర పోషించారు. ఈ సినిమాలో ఫస్ట్ ఫైట్ చూసి అభిమానులు చాలా కొత్తగా ఉంది చాలా అద్భుతంగా చేశారు అక్క అని చెబుతుంటే ఆనందం అనిపించింది. ఈ సినిమాతో నాకు కళ్యాణ్ బాబుకి ఒక మంచి బాండింగ్ ఏర్పడింది. ఈ సినిమాలో బాబు అద్భుతంగా చేశాడు. ఈసందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ కి థాంక్స్ చెప్తున్నాను. ఈ సినిమాని ఇంకా పెద్ద హిట్ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.
హీరో నందమూరి కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు, నందమూరి అభిమానులకు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మంచి సినిమాని అందిస్తే మమ్మల్ని ఆదరించడానికి తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారు. ఈ కథ ఫస్ట్ డే చెప్పినప్పుడే ఇది ప్యూర్ అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ ఫిల్మ్ అని చెప్పాడు ప్రదీప్. తనకి కమర్షియల్ సినిమా మేకింగ్‌లో మంచి టేస్ట్ ఉంది. ఈ సినిమాలో చివరి 20 నిమిషాలు ఆడియన్స్ అంతలా కనెక్ట్ అవుతున్నారంటే అది డైరెక్టర్ ఈ కథని అంత ఎమోషనల్‌గా నడిపిన విధానం. ఇంత మంచి కథని అందించిన ప్రదీప్‌కి థాంక్యూ. సినిమా చాలా అద్భుతంగా రావాలి మంచి విజయం సాధించాలని నిరంతరం తపనతో పనిచేసిన మా ప్రొడ్యూసర్స్ అశోక్ సునీల్ కి థాంక్యూ అన్నారు.
యాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, ఈ సినిమాని విజయవంతం చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. ఈ సినిమాలో నేనుకీ రోల్ ప్లే చేశాను. డైరెక్టర్ చాలా ఎక్స్పీరియన్స్ డైరెక్టర్ లాగా సినిమాని ట్రీట్ చేశారు. ప్రదీప్ చాలా అద్భుతంగా డీల్ చేశాడు. చాలా సంవత్సరాల తర్వాత విజయశాంతితో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. కళ్యాణ్ వర్క్ చేయడం ఫస్ట్ టైం. చాలా డౌన్ టు ఎర్త్ పర్సన్. సీనియర్స్ అంటే చాలా రెస్పెక్ట్. చాలా డెడికేషన్ తో ఈ సినిమా చేశారు. ఇంత మంచి కమర్షియల్ సినిమాతో రావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన మరిన్ని మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను అన్నారు. నిర్మాత అశోక్ వర్ధన్ ముప్పా మాట్లాడుతూ, ఆడియన్స్ ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది మదర్ అండ్ సన్ ఎమోషనల్ కథ. ఈ విజయానికి కారణం ఆ పాత్రలు చేసిన కళ్యాణ్ రామ్ విజయశాంతి. వారికి చాలా థాంక్స్. వారిద్దరి పెర్ఫార్మెన్స్ వలనే ఈ సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. డైరెక్టర్ ప్రదీప్ ఈ సినిమాని అద్భుతంగా రూపొందించారు. ఎడిటర్ తమ్మి రాజుకి మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్‌కి, ఫైట్ మాస్టర్స్, డిఓపి రాంప్రసాద్‌కి ఈ సినిమాల్లో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు. డైరెక్టర్ ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ...మేము ఏం ఎచీవ్ చేస్తామని అనుకున్నామో, అది ఈ సినిమాతో సాధించాం. ఆడియన్స్ ప్రతి సీక్వెన్స్ బాగుందని చెప్తుంటే చాలా హ్యాపీగా అనిపించింది. క్లైమాక్స్ గూస్ బంప్స్ అంటున్నారు. అలాంటి క్లైమాక్స్‌ని ఒప్పుకున్న కళ్యాణ్ రామ్‌కి థాంక్యూ. మాఎడిటర్ తమ్మి రాజుగారు మొదట్నుంచి సపోర్ట్‌చేశారు. సినిమాకి ఆడియన్స్ రివ్యూస్ అద్భుతంగా ఉన్నాయి. ఆడియన్స్‌కి సినిమా చాలాబాగా నచ్చింది. ఈ సిని మాలో పనిచేసిన అందరికీ పేరు పేరునా థాంక్యూ అన్నారు.



రుహాని శర్మ

# 'సోదరా సినిమా అందరిని నవ్విస్తుంది..ఏడిపిస్తుంది'

## - హీరోలు సంపూర్ణేష్ బాబు, సంజోష్



**వైవిధ్యమైన సినిమాలు,** ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే సినిమాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ప్రేక్షకుల్లో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కథానాయకుడు సంపూర్ణేష్ బాబు.. ఈ సారి అన్న దమ్ముల అనుబంధం నేపథ్యంలో, అన్నదమ్ముల అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న సోదరా సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రంలో సంపూర్ణేష్ బాబుతో పాటు సంజోష్ కూడా మరో హీరోగా నటిస్తున్నాడు. మన్ మోహన్ మేనం పల్లి దర్శకత్వంలో క్యాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై చంద్ర చగంలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంపూర్ణేష్ బాబు, సంజోష్‌లు హీరోలుగా నటిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయకులు సంపూర్ణేష్ బాబు, సంజోష్‌లు మీడియాతో ముచ్చటించారు.
సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ అన్నదమ్ముల బంధం ఎంత గొప్పదో మనందరికీ తెలుసు అలాంటి అన్నదమ్ముల బంధాన్ని వెండితెరపై మనకు ఆవిష్కరించబోతున్న చిత్రమే సోదరా. ఇది నా గత చిత్రాల తరహాలో ఉండదు. ఇది కుటుంబ కథ ఇద్దరూ అన్నదమ్ముల కథ. అన్నగా బరువు బాధ్యతలు ఉన్న పాత్రను ఈ చిత్రంలో పోషించాను. ఈ సినిమా చూస్తున్నంత సేపు అందరికి తమ రియల్‌లైఫ్ సంఘటనలు గుర్తుకు వస్తాయి. ఈ చిత్రంలో జనరల్‌గా నా సినిమాలో ఉండే వినోదంతో పాటు కుటుంబ భావోద్వేగాలు కూడా ఉంటాయి. సినిమా చూసిన తరువాత ప్రతి ఒక్కరూ తమ అన్నాదమ్ములకు ఫోన్ చేస్తారు. హృదయకాలేయంలో ఉన్న కామెడీ మాత్రం ఉండదు. ఇందులో ఉండే వినోదం కూడా ఎంతో ఆహ్లాదంగా ఫ్యామిలీ మొత్తం నవ్వుకునేలా ఉంటుంది. అందరూ హృదయ కాలేయం లాంటి సినిమాలు మళ్లీ మీ నుంచి ఎందుకు రావడం లేదు? అంటున్నారు. అయితే ఆ స్థాయికు తగ్గ కథలు దొరకడం లేదు. ఈ మధ్య కథలు విన్నాను. కానీ పెద్దగా నాకు ఎక్కలేదు. హృదయాకాలేయం మించిన కామెడీ కథ దొరికితే చేస్తాను. నటుడిగా చాలా తరహా పాత్రలు చేయాలని ఉంది. ఏ అనే సినిమాలో ఉపేంద్ర లాంటి పాత్ర చేయాలని ఉంది. అన్నారు.
మరో కథానాయకుడు సంజోష్ మాట్లాడుతూ,నేను ఇంతకు ముందు బేవరస్ అనే సినిమాలో హీరోగా నటించాను. సంపూతో కలిసి ఓ బ్రదర్‌గా ఈ సినిమా చేయడం ఎంతో ఆనందంగా ఉంది. అన్నదమ్ముల అనుబంధాన్ని తెలిపే కథ ఇది. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఉన్న ప్రేమను వ్యక్తపరచడానికి దర్శకుడు ఈ సినిమాకు బ్రోమాంటిక్ అని ట్యాగ్ పెట్టాడు. ఇది అమాయకుడైన అన్న, అప్‌డేట్ అయినా తమ్ముడి కథ. ఇలాంటి అన్నదమ్ముల కథతో ఇప్పటి వరకు తెలుగులో ఏ సినిమా రాలేదు. ఈ సినిమా చూసిన తరువాత అందరూ కనెక్ట్ అవుతారు. సినిమా పూర్తవగానే అన్నకు తమ్ముడు, తమ్ముడు అన్నకు తప్పనిసరిగా ఫోన్ చేసి మాట్లాడుతాడు. అంతలా అందరి హృదయాలకు హత్తుకునే సినిమా ఇది. ఎమోషనల్ అన్నదమ్ములు కలిసి ఉండాలి అనికోరుకునే కథ ఇది. అందరికి తమ రియల్‌లైఫ్ గుర్తుకు వస్తుంది. ఈ చిత్రంలో బాబుమోహన్ పాత్ర చాలా బాధ్యత గల రోల్. మాకు ఫాదర్‌గా నటించాడు, నాకు ఇంతకుముందే సంపూతో పరిచయం ఉన్నది. ఈ పాత్రకు సంపూకు సరిపోతుందని, ఆయన చేస్తే సర్‌ప్రైజ్‌గా ఉంటుందని అనుకున్నాం. సంపూ కూడా కథ వినగానే ఓకే అన్నాను. రేపు ప్రేక్షకులు కూడా అదే ఫీలవుతారు. స్వచ్ఛతకు మారుపేరుగా అన్నదమ్ముల అనుబంధంగా ఉండాలి. ఈ రోజుల్లో మాత్రం అలాంటి అనుబంధం కరువైపోయింది. ఎక్కడో కానీ అలాంటి అనుబంధాలు చూడటం లేదు. ఈ సినిమా చూసిన తరువాత ఒకరిద్దరూ మారిన మాకు సంతోషమే. ఈ సినిమాలో అన్నదమ్ముల అనుబంధం అందరిని నవ్విస్తుంది. ఏడిపిస్తుంది. సంపూ ,నేను మంచి వ్యక్తిత్వాలు ఉన్న మనుషులం. మా ప్రయాణ బాగుంది. ఇక త్వరలోనే నేను సోలో హీరోగా రియల్ ఇన్‌సిడెంట్ కథతో సినిమా చేస్తాను. ఒక ఇగోయిస్ట్ పోలీస్‌ఆఫీసర్‌కు కామన్ మ్యాన్‌కు జరిగే కథతో సినిమా ఉంటుంది అన్నారు.

# 'బ్లైండ్ స్పాట్ణ ట్రైలర్ లాంచ్




**వరుస ప్రాజెక్ట్స్‌తో** బిజీగా వున్న వెరీ ట్యాలెంటెడ్ నవీన్ చంద్ర 'బ్లైండ్ స్పాట్' అనే మరో ఎక్సయిటింగ్ మూవీతో వస్తున్నారు. రాకేష్ వర్మ దర్శకత్వంలో మ్యాంగో మాస్ మీడియా బ్యానర్‌పై రామకృష్ణ వీరపనేని నిర్మించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ అంచనాలను క్రమంగా పెంచుతోంది. నిర్మాతలు ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను ఈరోజు లాంచ్ చేశారు. ట్రైలర్ ఒక థ్రిల్లింగ్ సన్నివేశంతో ప్రారంభమవుతుంది. పనిమనిషి తన భుజాలపై ఒక బిడ్డతో బెడ్‌రూమ్‌లోకి వెళుతుంది. ఓమహిళ నిర్జీవంగా ఉరి వేసుకున్న దృశ్యం చూసి భయపడుతుంది. పవర్‌ఫుల్ పోలీసు ఆఫీసర్ వచ్చి కేసుని పరిశీలిస్తాడు. ఇది ఆత్మహత్య కాదు హత్యని చెబుతాడు. తరువాత ప్రతిపాత్ర సిక్రెట్ కలిగి వుంటుంది. నిజమైన హంతకుడు ఎవరు? అనే క్యురియాసిటీని క్రియేట్ చేస్తూ చాలా ఎక్సయిటింగ్ ప్రజెంట్ చేశారు.
దర్శకుడు రాకేష్ వర్మ ట్రైలర్‌ను తొలి ఫ్రేమ్ నుంచే ఉత్కంఠను పెంచుతూ, ప్రేక్షకులను ఆద్యంతం థ్రిల్ లో ఉంచారు. నవీన్ చంద్ర తన పాత్రకు ఇంటెన్స్ అండ్ డెప్త్ యాడ్ చేసి సూపర్బ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ చిత్రంలో రాశిసింగ్, అలీ రెజా, రవివర్మ, గాయత్రి భార్గవి కీలక పాత్రలో కనిపిస్తున్నారు.
ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ... రాకేష్ లాంటి డైరెక్టర్స్ ఇంకా ముందుకు రావాలి. తను చెప్పిన కథ చాలా గమ్మత్తుగా ఉంది. తను కథ చెప్పినప్పుడే సీట్ ఎడ్జ్ కూర్చున్న ఫీలింగ్ కలిగింది. ఈ స్క్రీన్ ప్లే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. రాశి చాలా ఇంటెన్స్ క్యారెక్టర్ చేసింది. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఇంత బాగా రావడానికి కారణం సినిమాలో యాక్టర్స్. వీళ్లంతా అద్భుతంగా పెర్ఫామ్ చేయడంతో నా క్యారెక్టర్ కూడా అద్భుతంగా ఎలివేట్ అయింది. కథను నమ్మి ఒక్కొక్క సినిమా చేసుకుంటూ ముందుకు వస్తున్నాను. ఎప్పటిలాగే మీ సపోర్టు ఉండాలని కోరుకుంటున్నాను. ఇది చాలా మంచి థ్రిల్లర్. త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం. ఈ సినిమా పోస్టర్లో ఒక క్లూ ఉంది. అది కనిపెట్టి నాకు మెసేజ్ చేస్తే వాళ్లతో కలిసి నేను సినిమా చూస్తాను. రాకేష్ ఆలోచన నన్ను కట్టిపడేసింది. రాకేష్ ఒక ఛాలెంజ్ గా తీసుకుని ఈ సినిమా చేశాడు. ఈ సినిమా మిస్ అవ్వకండి. చాలా మంచి థ్రిల్లర్ ఇది అన్నారు.
హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ, ఈ సినిమా నాకు చాలా డిఫరెంట్ ఎక్స్పీరియన్స్. ఫస్ట్ డేనుంచే చాలా డిఫికల్ట్ సీన్స్ పెట్టారు. రాకేష్ పర్ఫార్మెన్స్ విషయంలో చాలా పర్టికులర్. ఈ సినిమా అంతా నా క్యారెక్టర్ క్రై చేస్తూనే ఉంటుంది. నవీన్ చంద్రతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. ఈ సినిమా రిలీజ్ కోసం చాలా ఎక్సైటింగ్‌గా ఎదురు చూస్తున్నాను అన్నారు. డైరెక్టర్ రాకేష్ మాట్లాడుతూ.. నవీన్ చంద్ర వన్ ఆఫ్ ది ఫైనెస్ట్ యాక్టర్. ఆయన ఎప్పుడూ క్యారెక్టర్ లోనే ఉంటారు మా సినిమా అంతా ఒక సింగల్ నైట్‌లో జరుగుతుంది ఆ కంటిన్యూటిని అర్థం చేసుకోవడం చాలా యాజ్‌తో పెర్ఫార్మ్ చేశారు. ఆయన ప్రతి ఆర్టిస్టుతో చాలా సపోర్టివ్‌గా ఉంటారు. చాలా ఇన్వాల్వ్మెంట్ తో వర్క్ చేస్తారు. రాశి సింగ్ గ్లిజరిన్ లేకుండా కన్నీళ్లు తెచ్చుకునే నటి. ఈ సినిమాల్లో తన క్యారెక్టర్ కి రెండు వేరియేషన్స్ ఉన్నాయి. ఈ రెండు వేరియేషన్స్‌ని అద్భుతంగా పెర్ఫామ్ చేసింది. గాయత్రి ఇందులో చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు.

# 'జింఖానాణ ట్రైలర్ విడుదల



**మలయాళ బ్లాక్‌బస్టర్** ప్రేమలుతో అలరించిన నస్లెన్ 'జింఖానాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇది ఇప్పటికే మలయాళంలో బాక్సాఫీస్ వద్ద బిగ్ హిట్ అయ్యింది. ఇప్పుడు ఈ స్పోర్ట్స్ ప్యాక్డ్, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఏప్రిల్ 25న తెలుగు థియేటర్లలోకి రానుంది. స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ మొత్తం వైబ్ ఫన్ , ఫైట్‌లతో అదిరిపోయింది. కొంతమంది యువకులు బాక్సింగ్ క్లాస్ కోసం సైన్ అప్ చేస్తారు, ఇదంతా సరదా, ఆటలు అని భావిస్తారు. వారు తమ నో నాన్సెన్స్ కోచ్‌ను కలిసినప్పుడు సీరియస్ బిజినెస్‌గా మారుతుంది. శిక్షణ ప్రారంభమైన కొద్దీ జీవిత పాఠాలు తెరపైకి వస్తాయి. బాక్సింగ్ అంటే పంచ్‌లు విసరడం మాత్రమే కాదని ఇది క్రమశిక్షణ, విల్ పవర్ అని తెలుసుకుంటారు. వారిలో నిజంగా ఫైర్ పడుతుంది? తర్వాత ఏం జరిగిందనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. దర్శకుడు ఖలీద్ రెహమాన్ హ్యూమర్, సోల్, ఎక్సయిట్మెంట్, హై ఎనర్జీతో కూడిన పోరాట సన్నివేశాలను బ్లెండ్ చేసి, దీనిని అన్‌లిమిటెడ్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా రూపొందించారు. నస్లెన్ తన చార్మ్‌తో గ్యాంగ్‌ని నడిపిస్తాడు మొత్తం తారాగణం అమాయకత్వం, రియలిజంని తెరపైకి తెస్తుంది. ఖలీద్ రెహమాన్, జోబిన్ జార్జ్, సమీర్ కారత్, సుబీష్ కన్నంచెరి ఈ చిత్రాన్ని నిర్మించారు. జిమ్షి ఖలీద్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ, నిషాద్ యూసుఫ్ ఎడిటింగ్‌తో ఈ చిత్రం ఒక విజువల్ ట్రీట్ అందిస్తుంది. విష్ణు విజయ్ నేపథ్య సంగీతం బిగ్ ఎసెట్. ఏప్రిల్ 25న తెలుగులో విడుదల కానున్న ఈ సినిమాపై ట్రైలర్ అంచనాలని పెంచింది.

# నాలుగైదు రోజులపాటు మాట్లాడుకునేలా చేసిన సినిమా 'సారంగపాణి జాతకమ్ణ : దర్శకుడు ఇంద్రగంటి మోహన్ కృష్ణ



**వెర్సటైల్ స్టార్** ప్రియదర్శి టైటిల్ రోల్ ప్లే చేసిన చిత్రం 'సారంగపాణి జాతకమ్ణ. 'జెంటిల్ మ్యాన్ణ, 'సమ్మోహనమ్ణ చిత్రాల అనంతరం ఇంద్రగంటి మోహనకృష్ణ, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీదేవీ మూవీస్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రంలో హీరోయిన్‌గా రూపా కొడవాయూర్, కీలక పాత్రల్లో వెన్నెల కిషోర్, వైవా హర్ష, అవసరాల శ్రీనివాస్, సాయి శ్రీనివాస్ వడ్లమాని తదితరులు నటించారు. సినిమాటోగ్రాఫర్‌గా పీజీ విందా, మ్యూజిక్ డైరెక్టర్‌గా వివేక్ సాగర్, ఎడిటర్‌గా వెంకటేశ్‌కే మార్తాండ్ బాధ్యతలను నిర్వర్తించారు. ఇటీవల ఆవిష్కరించిన మూవీ ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వస్తున్నది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ మీడియాతో మాట్లాడారు.

**చాలా రోజుల తర్వాత జంధ్యాల, ఈవీవీ గార్ల మాదిరిగా ఒక పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రాన్ని తీసుకొస్తున్నారు..**

ఒకప్పుడు తెలుగులో సంవత్సరానికి కనీసం ఐదారు పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రాలు వచ్చేవి. ఇప్పుడు వాటి సంఖ్య తగ్గింది. ఎక్కువ యాక్షన్ వైపే వెళ్తున్నాము. ఒకటి రెండు కామెడీ చిత్రాలు వస్తున్నప్పటికీ.. కథ, క్యారెక్టర్ డిపెండెడ్ హ్యూమర్ కాకుండా కేవలం రెండు మూడు సీన్లకు కామెడీని పరిమితం చేస్తున్నారు. అలా కాకుండా ఒక కథ ఆధారంగా చేయాలనే కోరిక గత ఐదారు ఏళ్లుగా ఉంది. యశోద సినిమా తర్వాత ఒక రోజు నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ సమ్మోహనం చేసి ఐదేళ్లు అయిపోయాయి. మళ్ళీ మనం ఒక సినిమా చేద్దామని నాతో అన్నారు. అప్పుడే నా దగ్గర ఉన్న ఐడియా గురించి చెప్పాను. ఆయనకు కూడా బాగా నచ్చింది. సినిమా చేద్దామన్నారు. కరెక్ట్‌గా అదే సమయంలో నేను ప్రియదర్శి నటించిన బలగం అనే సినిమా చూశాను. ఆ తర్వాత సేవ్ ద టైగర్స్ అనే వెబ్ సిరీస్, ఆహా కోసం అతను చేసిన మెయిల్ అనే సినిమా చేశాను. అవన్నీ చూసాక దర్శితో ఒక హ్యూమరస్ సినిమా చేయొచ్చని నాకు అనిపించింది. దర్శికి కాల్ చేసి విషయం చెప్పగా.. తప్పకుండా చేస్తా సార్ అని చెప్పడం జరిగింది. 2023 నవంబర్‌లో సినిమా చేద్దామని నిర్ణయించుకున్న తర్వాత పనులన్నీ టకటక జరిగిపోయాయి.

**'సారంగపాణి జాతకమ్ణ ఎలా ఉండబోతుంది?**

సాధారణంగా కామెడీ అనగానే ఒక స్టాండర్డ్ బంచ్ ఆఫ్ కమెడియన్స్ ఉంటారు. అలా కాకుండా ఈ సినిమాలో అందరూ అంతకు ముందు వేయనటువంటి కొత్త పాత్రలను చేశారు. ఇదొక ఫుల్ ఫ్లెడ్జ్ లైట్ హార్టెడ్ ఫన్ ఫిల్మ్. సమ్మర్‌లో సరదాగా సినిమాకు వెళ్లి చూసి నవ్వుకుంటూ అక్కడికక్కడే దులుపుకుని వచ్చేసేలాగా కాకుండా.. ఇంటికి వెళ్లాక కూడా నాలుగైదు రోజుల పాటు పాత్రలు, డైలాగ్స్ గురించి మాట్లాడుకునేలా ఉండాలి అనుకుని తీసిన సినిమా ఇది. అలాగే నాకు చాలా తృప్తిని ఇచ్చిన సినిమా ఇది. మ్యాగ్జిమం అనుకున్నట్లుగా సినిమాను తీయగలిగాను. మంచి నటులు దొరికారు.. వ్యక్తిగతంగా 'సారంగపాణి జాతకమ్ణ సినిమాతో చాలా సంతోషంగా ఉన్నాను.

**మీరు జాతకాలను ఎంతవరకు నమ్ముతారు..? ఈ సబ్జెక్ట్ కోసం మీరు చేసిన హోమ్ వర్క్ ఏంటి..?**

సబ్జెక్ట్ ఏదైనా హోమ్ వర్క్ అయితే కచ్చితంగా చేయాలి. అయితే జాతకాల విషయంలో నేను మధ్యంగా ఉన్నాను. ఎందుకంటే నాకు చెప్పినవి కొన్ని జరిగాయి.. కొన్ని జరగలేదు. అయితే ఈ సినిమాలో నేను నమ్మకాన్ని ప్రశ్నించడం లేదు. ఏ నమ్మకాన్ని అయినా మీరు నమ్ముకోవచ్చు. అది దేవుడు అవొచ్చు .. వాస్తు అవొచ్చు.. జాతకం అవొచ్చు. కానీ నమ్మకం మూఢ నమ్మకం అయినప్పుడు మనిషిని బలహీనగా మార్చేస్తుంది. మామూలు నమ్మకం మనిషిని బలవంతుడిని చేస్తే.. మూఢనమ్మకం బలహీనుడిని చేస్తుంది. అప్పుడు ఆ మనిషి పిచ్చిపిచ్చి గా ప్రవర్తిం చడం స్టార్ట్ చేస్తాడు. తన జీవితంతో పాటు తన చుట్టూ ఉన్నవారి జీవితాలను సైతం అస్తవ్యస్తం చేస్తాడు. అలా జరిగినప్పుడు ఎంత గందరగోళం ఏర్పడుతుంది అనేదాన్ని కామికల్ వేలో ప్రెసెంట్ చేశాము. ఈ సినిమాలో సూక్తులు, ఉపన్యాసాలు ఉండవు. దేనికైనా లిమిట్ ఉండాలి.. అది నమ్మకానికి కూడా వర్తిస్తుంది. నమ్మకం మనకు బలాన్ని ఇచ్చే విధంగా ఉండాలి.. కానీ పిచ్చోడ్ని చేయకూడదు. అదే నేను ఈ కథ ద్వారా చెప్పాలి అనుకున్నాను. ఈ చిత్రంలో ప్రతి పాత్ర కొత్తగా ఉంటుంది. ఆటోమొబైల్స్ లో హీరో దర్శి, హీరో ఫ్రెండ్ వెన్నెల కిషోర్ పని చేస్తారు. ఒకరు సేల్స్ మెన్.. మరొకరు సేల్స్ సర్వీసింగ్ కన్సల్టెంట్. కిషోర్ మాట్లాడే అన్ని మాటలు ఆటోమొబైల్స్ రిఫరెన్స్ లోనే ఉంటాయి. అలా ప్రతి పాత్రకు ఒక క్యారెక్టరైజేషన్ ఉంటుంది. ప్రతి పాత్ర గుర్తుండాలని వీలైనంత వరకు ఇంట్రెస్టింగ్‌గానే క్రియేట్ చేయడం జరిగింది. అలాగే ఎవరి నమ్మకాలను వ్యక్తిగతంగా హేళన చేయకుండా చూపించాము.

**ఈ విషయంలో ఒకప్పటితో పోలిస్తే ఇప్పటి క్రియేటివ్ ఫ్రీడమ్ కి ఎక్స్ట్రా కేర్ యాడ్ అయినట్లుందా సార్..?**

అంత ప్రమాదకర కంటెంట్ ఈ సినిమాలో లేదు. అయినా కూడా చాలా కేర్ తీసుకున్నాను. నా ఉద్దేశం అనవరమైన కంట్రవర్సీ రేకెత్తించడం కాదు. నమ్మకం అనేది వ్యక్తిగతం.. మీకున్న నమ్మకాన్ని పదిమంది జీవితాలను చిన్నాభిన్నం చేసేలా నమ్మొద్దు అన్నదే నా ఐడియా. ఆ పాయింట్‌నే కామెడీగా చూపించాము. జాతకాలన్నీ మూఢనమ్మకాలు.. నమ్మేవాళ్లందరూ దద్దమ్మలు అని నేను అనడం లేదు. ఎందుకంటే నాకే కొన్ని జరిగాయి.. కొన్ని జరగలేదు. అందుకే నేను జ్యోతిష్యులను కామెడియన్స్‌గా కాకుండా సీరియస్‌గానే చూపించాను.

**ఈ సినిమాలో హీరో జాతకాలు చెబుతారా? లేక జాతకాలను నమ్ముతాడా?**

ఈ చిత్రంలో హీరో జాతకాలను నమ్ముతాడు. జ్యోతిష్యం అంటేనే ఒక విచిత్రమైన కల్ట్ సైన్స్. పంచాంగం ఓపెన్ చేస్తే ఎన్ని డీటైల్స్ ఉంటాయో. అటువంటి దాన్ని బోగస్ అని అనలేము. నా ఐడియా అనేది ప్రశ్నించడం కాదు.. దుమ్మెత్తిపోయడం కాదు. నమ్మడం, నమ్మకపోవడం మీఇష్టం.. కానీ ఇలా చేస్తే కష్టాలు వస్తాయని ఆడియెన్స్‌కు చెప్పడమే ముఖ్య ఉద్దేశం.

**శ్రీదేవీ మూవీస్‌లోను, నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్‌తో ఇది మూడో సినిమా. మీకు ఎలాంటి సహకారం లభించింది?**

గతంలో రెండు విజయవంతమైన సినిమాలు మా కాంబినేషన్‌లో వచ్చాయి. మా ఇద్దరి మధ్య దర్శకుడు, నిర్మాతకు ఉండాల్సిన అవగాహన చక్కగా కుదిరింది. ఈ సినిమా విషయంలో ఆయన పూర్తిగా సహకారం అందించారు. ఈ సినిమా తీసిన తర్వాత నాకు ఎలాంటి అసంతృప్తి కలుగలేదు. నేను అనుకొన్నట్టుగా, నాకు నచ్చినట్టు సినిమా తీశాను. అందుకు శివలెంక కృష్ణప్రసాద్ గారికి సినిమా పట్ల ఉన్న అభిరుచికారణం. 'సారంగపాణి జాతకమ్ణ సినిమా ఎందుకు చూడాలంటే? ఇటీవల కాలంలో యాక్షన్, మితిమీరిన హింసతో సినిమాలు వస్తున్నాయి. ఈ మధ్య పూర్తి వినోదభరిత చిత్రం రాలేదు. అన్ని వయసుల వారు, అన్ని వర్గాలు వారి హ్యాపీగా, ఆహ్లాదకంగా ఫ్యామిలీ మెంబర్స్ అందరూ కలిసి చూసే సినిమా.

# మనకూ ఉన్నారు 'ఏఐ చెఫ్'లు

ఉదయం లేచింది మొదలు వంట వద్దకు వెళ్లడం ప్రతి ఇల్లాలికి సాధారణ విషయమే. ఏమేం ఉన్నాయి. ఏం చేయాలి అని ఆలోచిస్తుంటాం. వేపుడుతోపాటు పప్పు లేదా చారు చేయాలా అని ఆలోచిస్తాం. అయినా కూడా ఎప్పుడైనా ఈ రెండేనా అనేస్తారు. ఇంట్లో వాళ్లు. పోనీ కొత్తగా ఏమైనా చేయొచ్చా అని యూట్యూబ్ చేస్తే కొన్ని పదార్థాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఓ వైపు పిల్లల అవసరాలు చూస్తూ, మరోవైపు ఆఫీసుకు తయారవుతూ హడావుడి పడే బిజీ మహిళలకేమే అంత సమయం ఉండదు. దాంతో ఏదో ఒకటి చేసి వెళ్లిపోతుంటారు. ఇక కొందమందికి వంటకాల్లో ప్రయోగాలు చేయడం ఇష్టం. వంట్లో కొత్త కొత్తరుచుల్ని కోరుకునే వారూ ఉంటారు. ఇలాంటి వారందరి జిహ్వాచాప్యాన్ని తీర్చేందుకే ఏఐ అనుక్షణం మన వెంట ఉండే పర్సనల్ షెఫ్‌గా మారిపోయింది. కోరుకున్న రుచుల్ని కొంగొత్తగా పరిచయమూ చేస్తోంది. ఇప్పటికే వంటల పైన బోలేదన్ని యూట్యూబ్ ఛానళ్లు వెబ్‌సైట్లూ ఉన్నాయి. గూగుల్‌లోకి వెళ్లి ఓ వంటను టైప్ చేశామనుకోండి. సెకన్ల తేడాలో అది మన కళ్లముందుకు వచ్చేస్తుంది. మరి దానికీ దీనికి తేడా ఏముందనుకోవచ్చు. కానీ ఉంది. గూగుల్‌లో కోరుకున్న వంటకంతో పాటు సిద్ధం చేసుకోవాల్సిన పదార్థాల జాబితా కనిపిస్తుంది. అవన్నీ రెడీ చేసుకుని వండేసరికి చాలా సమయం పట్టడం ఖాయం కాబట్టి ఎక్కువ మంది ఆ ఆలోచనను పక్కన పెట్టేసి అందుబాటులో ఉన్న పదార్థాలతోనే వచ్చినట్లు వండేస్తారు. అలా కాకుండా ఉన్న కూరలూ, పప్పులూ మసాలా దినుసులతోనే కాస్త వెరైటీగా ఏదయినా చేస్తే ఇంట్లో వాళ్లు 'వావ్, సూపర్, యమ్మీ' అంటూ లొట్టలేసుకుంటూ తింటారు కదా. ఏఐ షెఫ్‌ల సాయంతో అలాంటి ప్రయోగాలెన్నో చేయ చేయొచ్చు. అంటే మన అవసరాలూ, ఆరోగ్యం, తీసుకోవాలనుకునే పోషకాలూ, ఇష్టాలు, సందర్భాలూ, అందుబాటులో ఉండే పదార్థాలూ, ఇలా ప్రతిదాన్నీ దృష్టిలో పెట్టుకుని మరీ వంటకాలనూ సూచిస్తారు ఏఐ షెఫ్‌లు. ఎలా వాడుకోవచ్చంటే.. వంటింట్లో ఉన్న పదార్థాలతో ఏదో ఒకటి చేయడం వంట వచ్చిన వాళ్లకు చిటికెలో పని. అయినా కూడా కొత్తగా చేయాలనుకున్నప్పుడు ఏఐ షెఫ్‌లను ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు ఇంట్లో ఓట్స్, పెసర పప్పు ఉన్నాయి.ఆ రెండింటితో పొంగల్ కాక కొత్తగా ఏం చేయొచ్చని ఓసారి ఏఐ షెఫ్‌ను అడిగి చూడండి. పాన్ కేక్, రోటీ, దోశ వంటి ఆప్షన్లను ఇస్తూనే ఎలా చేయాలో కూడా చెప్పేస్తుంది. అదనంగా పోషక విలువలూ అడిగారనుకోండి. అవీ స్కీన్ మీద ప్రత్యక్ష మవుతాయి. మధుమేహం, అధికరక్తపోటు వంటి సమస్యలున్నా ఆ వివరాలను తెలియజేస్తూ వంట కాలను అడగొచ్చు.



అంతేందుకు వీగన్, కీట, జపనీస్, చైనీస్ ప్రొటీన్ వంటకాలను అడగొచ్చు. అంతెందుకు వీగన్, కీటో, జపనీస్ చైనీస్ ప్రొటన్ వంటకాలు.. ఇలా కోరుకున్న దాన్ని ఇట్టే తెలుసుకోవచ్చు. సూటిగా చెప్పాలంటే .. మన ఇంట్లో వాళ్లతో మాట్లాడు తున్నట్లుగానే 'ఈ రోజు డిన్నర్‌కి ఏం వండితే బాగుంటుంద్దీ 'చక్కెర వాడకుండా స్వీట్లు ఏమైనా చేయొచ్చా.. ఇలా ప్రతి ఆలోచననూ ఏఐ షెఫ్‌తో పంచుకోవచ్చు. ఆ వంటకాలను స్కాన్ చేసి పెట్టుకునే సదుపాయం కూడా ఉంటుంది. అంటే మనకంటే సొంతంగా ఓ వంటల పుస్తకాన్నే రెడీ చేసుకోవచ్చు అన్నమాట. కాబట్టి 'మై షెఫ్ ఏఐ' 'షెఫ్ జీపీట్టీ', ఏఐ షెఫ్ రెసిపీ జనరేటర్, 'స్మార్ట్ లాగిన్ అయి చూడండి.. మన వెంట ఓ పర్సనల్ షెఫ్ ఉన్నట్టే! ఆలస్యమెందుకు ట్రై చేయండి మరి!


ఇప్పుడంతా స్మార్ట్ యుగం. హార్డ్‌వర్కర్ అన్న పేరుకన్నా స్మార్ట్ వర్కర్ అన్న పదానికే ఇప్పుడు క్రేజ్ ఉంది. తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తిని ఇవ్వడం అన్నది ఇటు పనిచేసేవారికీ హాయిగొలిపే అంశమే. మీరూ స్మార్ట్ వర్కర్‌టీ మారి పోవాలనుకుంటే రోజును ప్రారంభించబోయే ముందే ఆ రోజు ఏం చేయాలి అన్నదాని మీద అవగాహన ఉండాలి. స్టాండప్ కాల్స్, రివ్యూ, క్లయింట్ మీటింగ్, ఇంటర్నల్‌డిస్కషన్స్.. ఇలాంటివన్నీ ఎప్పుడెప్పుడు ఉంటాయి అన్నది ఒకసారి అవలోకించుకుంటే మంచిది.

## ఆధ్యాత్మికం

# వరుణుడి కరుణ

సకల జీవరాశికీ మేలుచేసేది భగవంతుడు ఒక్కడే కరువు కాటకాలు సంభవించే దేవుడికే మొర పెట్టు కుంటారు. చెట్టుకో, పుట్టకో, రాయికో మొక్కుకుంటారు. పూజలు చేస్తారు. విరాటపర్వం చదువుతారు. కష్టాల నుంచి విముక్తి ప్రసాదించమని భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తారు. మన మొర ఆలకించేది, కరువు లేకుండా కరుణించేది వరుణుడే ఈ లోకాన్ని సదా సంరక్షి ంచే వరుణదేవుడి కరుణ అందరూ పొందాలి. పడమటి దిక్కుకు పాలిస్తూ తెల్లని, చల్లనివాడైన వరుణుడి ప్రస్తావన భారత, విష్ణు ధర్మోత్తర పురాణాల్లో కనిపిస్తుంది. ఈ జలాధిదేవత మనల్ని కరుణించాలంటే. నీళ్లను జాగ్రత్తగా విని యోగిస్తూ జలనంవదనం వృద్ధిచేయాలి. జలాన్ని పూజించాలి. మేఘాలు వరుణుడి అధీనంలో ఉంటాయి. వరుణుడు వర్షాలు కురిపించడంలో సిద్ధహస్తుడే కానీ, నీళ్లను నిరక్ష్యంచేస్తే ఆగ్రహిస్తాడని గ్రహించాలి. వరుణుడు శాంతస్వభావం గల దైవం. ఈ స్వామికి నక్షత్రాలు నేత్రాలని వాటితో విశ్వాన్ని గమనిస్తూ, ఎక్కడ కరువు సంభవించినా తక్షణం కరుణ చూపిస్తే పురాణ కథలు చెబుతు న్నాయి. వరుణదేవుడు సముద్రగర్భంలో విశ్వకర్మ నిర్మించిన మణిమయ మందిరంలో కొలువుదేరి ఉంటాడు. ఓం జలబింబాయ విద్మహే నీల పురుషాయ ధీమహి తన్నో వరుణః ప్రచోదయాత్ అనే మంత్రంతో ఈ జలాధిదేవతను స్మరించాలి. పుష్కరుడు, మనువు... వరుణుడి సంతానం. వరుణ దేవుడు చతుర్భుజాలతో దర్శన మిస్తాడు. భక్తితో ప్రార్థిస్తే ఇట్టే కరిగిపోయే దయామూర్తి. ఆ స్వామి కరుణిస్తే అకాల వర్షాలు రావు. అతివృష్టి, అనావృష్టి ఉండవు. సకల సౌభాగ్యాలూ చేకూ

# చర్మకాంతికి..



కాంతులీనే చర్మం కావాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. అందుకోసం మార్కెట్లో దొరికే క్రీమ్‌లు, ఫేస్ ప్యాక్‌లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఇవి కొన్నిసార్లు చర్మానికి హాని కలిగిస్తుంటాయి. అలాకాకుండా మన ఇంట్లో దొరికే వస్తువులతో నిగనిగలాడే చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు.

హెర్బల్ ఫేస్ ప్యాక్‌లు ఒక బౌల్‌లో ఒక చెంచా శనగపిండి, ఒకచెంచా పెరుగు, అరచెంచా తేనే వేసి బాగా కలిపి ఒక చెంచా పెరుగు, అరచెంచా తేనె వేసి బాగా ముఖానికి , మెడకి రాసుకోవాలి. ముని వెళ్లతో మృదువుగా మర్దన చేయాలి. పావు గంట తరవాత చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. మెత్తని టవల్‌తో సున్నితంగా అద్దుకుంటూ తుడవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మానికి తేమ అంది నిగారింపు సంతరించు కుంటుంది. ముఖాన్ని సహజంగా మెరిపించడంలో ముల్తానీ మట్టి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. టీనేజ్‌లో మొటిమలకు కారణమైన సైబర్ ఉత్పత్తిని ఇది అడ్డుకుంటుంది. రెండు చెంచాల ముల్తానా మట్టిని కొంచెం పెరుగు, కొన్ని చుక్కల రోజ్ వాటర్ వేసి ప్యాక్‌లా చేసి ముఖమంతా పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత నీళ్లతో కడిగేసుకోవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మ రంధ్రాలు శుభ్రపడి మెటిమలు, మచ్చలు తగ్గుతాయి.

హోమ్ మేడ్ స్కబ్ బౌల్ ఒక చెంచా బియ్యంపిండి, ఒక చెంచా పెరుగు, ఒక చెంచా తేనే వేసి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించాలి. ఆరిన తర్వాత వేళ్లతో ఒక దిశలో మర్దన చేస్తూ ప్యాక్‌ను తొలగించాలి. తరవాత చల్లని నీళ్లతో కడగాలి. ఇలా రెండు వారాలకు ఒకసారి చేస్తే మృతకణాలు తొలగి పోతాయి.

చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పని సరి. ప్రతి రోజు విటమిన్లు, మినరల్స్, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్ ఇ అనే సూర్యరశ్మిలోని అల్ట్రా వయోలెట్ కిరణాల నుంచి చర్మాన్ని కాపాడుతుంది. ఇది ఎక్కువగా బాదం, వాల్‌నట్స్‌లో దొరుకుతుంది. వీటితో పాటు ఒత్తిడి ఆందోళన దరిచేరకుండా చూసుకోవాలి. ప్రశాంతంగా ఉండడం వల్ల హార్మోన్ల పనితీరు సక్రమంగా ఉండి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

# తమలపాకుతీగ పెంపకం

హిందూ సంస్కృతి పూజల్లో, శుభ సందర్భాల్లో తమలపాకుది అగ్రస్థానం. ఈ మొక్కను నాటడానికి నీరు నిలవని సారవంతమైన మట్టి అవసరం. అయితే, నేల పొడిబారకుండా తేమగా ఉంచుకోవడమూ ముఖ్యమే. కొద్దిగా ఆమ్లతత్వం ఉంటే ఇవి చక్కగా ఎదుగుతాయి. ఇది పెప్పర్ కుటుంబానికి చెందినది కావడంతో మాస్ పోల్స్, ఎత్తైన చెట్లు, గ్రిల్స్ వంటివాటిపైకి సులువుగా ఎగబాకుతుంది. సులువుగా పెరుగుతుందిలా... తమలపాకు మొక్కను నాటితే ఎక్కువ శ్రద్ధ పెట్టాలేమా అన్న భయం అక్కర్లేదు. దీన్ని పెంచేందుకు నీరు నిలవని సారవంతమైన మట్టి అవసరం. నీళ్లా రోజు పోయాలి. తేమ నిలిచి ఉండేం దుకు మొక్క చుట్టూ ఉన్న మట్టిలో కోకోపీట్ కలిపితే సరి. దీనికి ప్రత్యక్ష సూర్యకాంతి అవసరం లేదు. నీడలోనూ ఆరోగ్యంగానే ఎదుగుతుంది. తమలపాకు మొక్కకు ఎరువుల అవసరం పెద్దగా లేకపోయినా పెద్దగా, నాణ్యంగా ఆకులు రావాలంటే మాత్రం ప్రతి ఇరవై రోజులకోసారి నైట్రోజన్ ఎక్కువగా ఉండే ఫెర్టిలైజర్‌ని వేయాలి. దీన్ని కొమ్మ కత్తిరింపుల ద్వారానూ పెంచుకోవచ్చు. ఎండిన కొమ్మలు, కింది భాగంలో ఉన్నవి తీసేస్తూ ఉంటే పైవి నిగనిగలాడుతూ వస్తాయి. చెంచా వేపనూనెను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేస్తే సరి.

# బిసిబేలె బాత్!

అప్పటికప్పుడు అన్ని దినుసులనూ వేయించి, నూరాలంటే కొంచెం పెద్ద ప్రహసనమని.. పౌడర్ కొనుక్కుంటాం. అందులో నిలవుండేందుకు రసాయనాలు కలుపుతారు. అందువల్ల ఈ పొడిని ఇంట్లోనే చేసుకుందామా.. ఇది చేసేందుకు.. శనగ పప్పు,



ధనియాలు 4 చెంచాల చొప్పున, ఎండుకొబ్బరి తురుము 3 చెంచాలు, మినప్పప్పు, గసగసాలు 2 స్పూన్ల చొప్పున, నువ్వులు, ఆవాలు, జీలకర్ర చెంచా చొప్పున ఎండుమిరపకాయలు 12, లవంగాలు 3, యాలకులు 2, ఇంగువ ముప్పావు చెంచా, మిరియాలు అర చెంచా, దాల్చినచెక్క అంగుళం ముక్క, కరివేపాకు ఒక కట్ట, పావు చెంచా మెంతులను సిద్ధంగా ఉంచుకోవాలి. ఎలా చేయాలంటే.. కడాయిలో ఆవాలు, శనగ పప్పు, మినప్పప్పు, మెంతులు, జీలకర్ర, ధనియాలను ఒక దాని తర్వాత ఒకటి చొప్పున వేసి వేయించాలి. అవి మంచి వాసన వస్తుండగా పల్లెంలోకి తీసి, నువ్వులు, గసగసాలను వేయించి తీయాలి. తర్వాత.. దాల్చినచెక్క, లవంగాలు, మిరియాలు, యాలకులకు వేయించాలి. వాటినికూడా తీసి.. కరివేపాకు, ఎండు మిరపకాయలను.. అవీ వేగాక..కొబ్బరి తురుమును వేయించాలి.అన్నిటినీ చల్లారనిచ్చి.. ఇంగువ జతచేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీన్ని తడిలేని, గాలిచొరబడని సీసాలో భద్రం చేసుకుంటే సిర.. ఎప్పుడంటే అప్పుడు 'బిసిబెలెబాత్' చేసుకోవచ్చు.

## ఏడ్చే పిల్లలను పట్టించుకోవద్దు..

ఏదైనా కావాలి అని పిల్లలు ఏడ వడం ఆలస్యం.. 'అమ్మ మ్మా.. వద్దమ్మా' అని బతిమా లేస్తాం. అన్నం తిననని మరింకెలాగో మొండికేస్తే చాలు కోరిందల్లా తెచ్చి చేతిలోపెడతాం. ఇలాగైతే వాటి విలువ వాళ్లకెలా తెలు స్తుంది? కాబట్టి.. కిందపడో ఏదైనా గాయం తగిలో ఏడు స్తుంటే వాళ్ల ధ్యాస మళ్లించాలినసందే. బుజ్జగించి ఏడుపు ఆపేలా చూడాల్సిందే. వద్దన్న పనిచేసో.. లేదన్న వస్తువు కావాలనో ఏడు స్తోంటే మాత్రం వాళ్లనలా వదిలే యండి. మనసు చివుక్కు మ న్నా.. ఆ గోలకి తల నొప్పి వచ్చినా పట్టించుకోవద్దు. అప్పుడే భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం, తమని తాము సంభాళించుకోవడం వంటివి పిల్ల లకు తెలుస్తాయి. అలాగే ప్రతి చిన్నదానికీ ఏడుపే పరి ష్కారం కాదని తెలుస్తుంది. ఇక అలక! వాళ్లకి వాళ్ల హాని తలపెట్ట చేయనంతవరకూ దాన్నీ పట్టించు

# దక్షిణాది నుంచి తూర్పుకు వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 20,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీదుగా దక్షిణాది నుంచి తూర్పుకు అస్సాం-బెంగళూరు సెక్టార్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. న్యూటిన్సుకియా నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 05952ప్రత్యేక రైలు జూన్ 26వరకు ప్రతి గురువారం సాయంత్రం 6.45గంటలకు న్యూటిన్సుకియానుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 9గంటలకు బెంగళూరు చేరుకుం టుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి న్యూటిన్సుకియా వెళ్లే నెంబర్ 05951ఎక్స్‌ప్రెస్ జూన్ 29వరకు ప్రతి ఆదివారం రాత్రి 11.20గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 1.50గంటలకు న్యూటిన్సుకియా చేరుకుంటుంది. ఈ రైలు సర్వీసులు రాష్ట్రంలో గూడూరు, విజయవాడ, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం, పలస స్టేషన్లలతోపాటు తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలలోని అన్ని ముఖ్యమైన స్టేషన్ల లో నిలుస్తాయి.

# సాంకేతికతను అందిపుచుకుంటున్న ఎపి

## ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సంచాలకులు ఎస్. ఢిల్లీరావు

**విజయవాడ.ఏప్రిల్20,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయరంగంలో వస్తున్న ప్రతి సాంకేతికతను ఆంధ్రప్రదేశ్ అందిపుచ్చుకుంటుందని ఏపీ వ్యవసాయ సంచాలకులు ఎస్. ఢిల్లీరావు స్పష్టం చేసారు. తిరువనంతపురంలో భారత ప్రభుత్వం నిర్వహించిన ప్రధానమంత్రి ఫాసల్ భీమా యోజన రెండు రోజుల జాతీయ సమీక్ష సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున వ్యవసాయ సంచాలకులు ఎస్. డిల్లి రావు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో ఫాసల్ భీమా యోజన సాంకేతిక వినియోగం , అమలు పై జరిగిన ముఖాముఖి చర్చలో డిల్లి రావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫాసల్ భీమా యోజన పథకం అమలులో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక అంశాలను వినియోగిస్తూ అమలు పరుచటములో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు.దిగుబడి అంచనా కొరకు ఉపగ్రహ సాంకేతికత ద్వారా యస్ టెక్ సాంకేతిక విధానం, వాతావరణ ఆధారిత బీమా అంచనాల కొరకు విండ్స్ సాంకేతిక అంశం, భవిష్యత్ కార్యాచరణ పై చర్చా కార్యక్రమంలో వివరించారు.,ప్రధాన మంత్రి ఫాసల్ భీమా యోజన పథకం రైతులకు మరింత సులభతరంగా చేరువ అవ్వటానికి , పరిధిని పెంచుకోవటానికి తీసుకోవాల్సిన చర్యలు, వివిధ రాష్ట్ర ముల లో పంటల భీమా అమలు తీరు ,మార్గదర్శక నియ మాలలో సవరణలు, ఆధునీకరించవలసిన అంశములపై చర్చించారు. ఈ సందర్భంగముగ డిల్లీ రావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతలను 2023-24 నుండి దిగుబడి అంచనాలు కొరకు యస్ టెక్ ట్రిలీగ్గి విధానం రాష్ట్రంలో అమలవుతోందని పేర్కొన్నా రు. 2024-25 నుండి ఉపగ్రహ ఆధారిత దిగుబడి అంచనా సాంకేతికత ను కాకినాడ మరియు నంద్యాల జిల్లాల్లో వరి పంటపై విజయవంతంగా అమలవుతోంది అని తెలిపారు . ఈ విధానం ద్వారా దిగుబడి అంచనాలో ఖచ్చితత్వం, పారదర్శకత పెరిగిందని తెలిపారు. దాని సానుకూల ఫలితాలతో సంతృప్తి చెంది, 2025-26 లో ఈ సాంకేతికతను ఐదు వరి సాగుచేసే జిల్లాల్లో విస్తరించేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. అదనంగా వాతావరణ ఆధారిత బీమా పథకం అమలు లో విండ్స్ కార్యక్రమము జూ।విదీలీ ద్వారా వాతావరణ నమోదు కేంద్రాల నెటవర్క్ ను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని కోరడం జరిగింది దీనికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం జరిగింది అని తెలుపుతూ ఈ చర్యల వల్ల భీమా యోజన పథకం మరింత సమర్ధవంతంగా అమలు చేయడంలో కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉపసంచాలకులు భీమా పథకం డి వేణుగోపాల్ వివిధ అంశములపై డిల్లీ రావు కి సహకరించారు.కేంద్ర ప్రభుత్వ ఉన్నతాదికారులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ,వివిధ భీమా సంస్థల ప్రతినిధులు ,నిపుణులు పాల్గొన్న ఈ ముఖాముఖి చర్చాలో తమ అభిప్రాయాలను వెల్లడించారు.



# భార్య వేధింపులకు టెకీ ఆత్మహత్య

## నా బూడిదను డ్రైనేజీలో కలపండి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్20:** ఉత్తరప్రదేశ్‌లో టెకీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన భార్య, ఆమె కుటుంబం తనను మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తోందని ఆరోపిస్తూ ఆత్మహత్య చేసుకున్నాడు. తన మరణం తర్వాత కూడా న్యాయం జరగకపోతే తన బూడిదను డ్రైనేజీలో కలుపాలని చెబుతూ ఒక సెల్ఫీ వీడియో తీసి దగ్గరి బంధువుకు షేర్ చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. మోహిత్ యాదవ్ అనే వ్యక్తి ప్రియ అనే యువతిని ఏడేళ్లుగా ప్రేమించాడు. పెద్దలను ఒప్పించి రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఒక సిమెంట్ కంపెనీలో ఫీల్డ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే దంపతుల మధ్య గొడవలు తలెత్తాయి. భార్య తరఫు కుటుంబం తనను వేధింపులకు గురిచేస్తోందని, బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ మోహిత్ ఒక వీడియో రికార్డు చేశాడు. ఆ తర్వాత ఆ వీడియోను దగ్గరి బంధువుకు షేర్ చేసి ఒక హోటల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.


'2 నెలల క్రితం నా భార్య ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా ఉద్యోగంలో చేరింది. ఆ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమెకు మా అత్తయ్య అబార్షన్ చేయించింది. ఆమెపై ఉన్న బంగారు ఆభరణాలను బలవంతంగా దగ్గర పెట్టుకుంది. మా పెళ్లి సమయంలో వారి నుంచి నేను ఒక రూపాయి కట్నం కూడా తీసుకోలేదు. కానీ నాపై తప్పుడు కేసులు పెట్టారు. నాకు నా తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఆస్తులను తన పేరిట బదిలీ చేయాలని నా భార్య కూడా తరచూ గొడవలు పెట్టుకునేది. ఈ విషయంపై ఆమె, ఆమె కుటుంబసభ్యులు నన్ను మానసికంగా చిత్రహింసలకు గురిచేశారు. వారు చెప్పినట్లు చేయక పోతే నా కుటుంబసభ్యులపై కూడా కేసులు పెడతామని బెదిరించారు' అని మోహిత్ ఆ వీడియోలో చెప్పాడు.

'నా కుటుంబం గురించి నేను ఎంతో ఆందోళన చెందుతున్నాను. వారి వేధింపులు తట్టుకోలేక పోతున్నా. అమ్మానాన్న నన్ను క్షమించండి. నేను చనిపోయాక కూడా న్యాయం జరగకపోతే నా బుడిదను కాలువలో కలుపండి'అని వీడియోలో ఆవేదన వ్యక్తంచేశాడు. మోహిత్ ఆత్మహత్య సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జెడియు-బిజెపిది అవకాశవాద కూటమి

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**బక్సర్, ఏప్రిల్ 20:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కేవలం కుర్చీ కోసమే పార్టీలు మారు తుంటారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అన్నారు. రాష్ట్రంలో జెడియు-బిజెపి కూటమిని 'అవకాశవాద' కూటమిగా పేర్కొన్నారు. బక్సర్‌లోని దాల్‌సాగర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' ర్యాలీలో ఖర్గే ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ యేడాది చివరలో బీహార్‌లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వాన్ని అధికారం నుంచి తప్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 'నితీశ్ కుమార్, బిజెపి మధ్య పొత్తు అవకాశవాద పొత్తు. ఇది రాష్ట్ర ప్రజలకు మేలు చేసేది కాదు. నితీశ్‌కుమార్ కేవలం కుర్చీ (సీఎం సీటు) కోసమే పార్టీలు మారు తుంటారు. మహాత్మాగాంధీ హంతకుల ఐడియాలజీ కలిగిన వారితో ఆయన చేతులు కలిపారు' అని ఖర్గే విమర్శించారు. ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాలను ఆయన ప్రస్తావిస్తూ.. అభివృద్ధి అంశాలపై కంటే విభజన అంశాలపైనే ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారించిందని చెప్పారు. పార్లమెంట్ సెషన్‌లో ఎక్కువ సమయం వక్ఫ్ బిల్లుపై చర్చతోనే నడిచిందన్నారు. హిందువులు, ముస్లింల గురించి మాట్లాడి ప్రజలను తప్పుదారి పట్టిస్తే ఓట్లు పడతాయనే అభిప్రాయంతో మోదీ, బిజెపి నేతలు ఉంటారని, ఇక పనిచేయాల్సిన అవసరం ఏముందని ఖర్గే ప్రశ్నించారు.



**మోదీ ఇస్తామన్నా ఆర్థిక ప్యాకేజీ ఏమైంది?**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యేడాది క్రితం ఇచ్చిన వాగ్దానం ఏమైందని ఖర్గే నిలదీశారు. '2015 ఆగస్టు 15న బీహార్‌కు రూ. 1.25 లక్షల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని ప్రధానమంత్రి ప్రకటించారు. ఆ సంగతేమైందని నితీశ్‌కుమార్‌ను రాష్ట్ర ప్రజలు నిలదీయాలి. మోదీ అబద్ధాల ఫ్యాక్టరీ నడుపుతున్నారు' అని ఖర్గే విమర్శించారు. ఇందుకు సంబంధించిన విడియోను సభికులకు చూపించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమికి ప్రజలు ఓటు వేయాలని కోరుతూ ఖర్గే తన ప్రసంగాన్ని ముగించారు.

**నేషనల్ హెరాల్డ్ కేసుపై..** నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియగాంధీ, రాహుల్‌గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇటీవల ఛార్జిషీటు నమోదు చేయడాన్ని కూడా ఖర్గే ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా టార్గెట్ చేసేందుకే ఇలా చేశారని, తమ నాయకులు వీటికి బెదిరిపోరని, దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ తన ప్రాణాలను అర్పించారని అన్నారు. పేదలకు బిజెపి, ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని, మెరుగైన సమాజం కెసం వారెప్పుడూ ఆలోచించరని, కులం, మతం పేరుతో సమాజాన్ని విడగొట్టాలని చుస్తాయని విమర్శించారు. వక్ఫ్ బిల్లును ఆమోదించడం వెనుక మతపరమైన విభజనలు సృష్టించే కుట్ర ఉందని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

# కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండాలి

## ఎపి బిజెపి అధ్యక్షురాలు ఎంపి పురందేశ్వరి

**విజయవాడ ఏప్రిల్ 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రమాదకర క్యాన్సర్ నివారణకు ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండాలని ఎపీ బిజెపి అధ్యక్షురాలు ఎంపీ పురందేశ్వరి పిలుపునిచ్చారు. విజయవాడ పడమటలో సిటిజన్ ఫోర్స్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి ఆమె వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. పామర్రు నియోజకవర్గం మూళ్లపూడిలో ఈ క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తన తల్లి బసవతారకం 1984లో క్యాన్సర్‌తో మృతి చెందారని ఆమె పడిన బాధను కళ్లారా చూశామని ఎంపీ గుర్తుచేసుకున్నారు. ఆ ఆవేదనతోనే బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటైందని చెప్పారు. క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. 2022లో 14 లక్షల మంది క్యాన్సర్‌తో మృతి చెందారు. ప్రతి 9 మందిలో ఒకరు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. గుట్కాలు, ధూమపానం వల్ల క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. అయినా వీటిని నిషేధించలేకపోతున్నాం. క్యాన్సర్ వైద్యానికి అయ్యే ఖర్చును భరించేలా చాలా మంది పేదరికంలో కూరుకుపోతున్నారు. క్యాన్సర్ వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకురావాల్సిన అవసరం ఉంది. వైద్య సదుపాయాలు పట్టణాలు, నగరాలకే పరిమితమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సదుపాయాలు పెరగాలి. క్యాన్సర్ కేసులు పెరగకుండా ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలి. ప్రతి జిల్లాల్లో క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది అని ఎంపీ పురందేశ్వరి తెలిపారు.



# నీటిలో పడిన బాలుడిని కాపాడిన యువకుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్20:** తమిళనాడులో జరిగిన ఒక ఘటన తాలూకు వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఓ బాలుడు విద్యుత్ షాక్‌కు గురికావడం... అదే సమయంలో అటువైపుగా వచ్చిన ఓ యువకుడు అది చూసి బాలుడిని తన ప్రాణాలకు తెగించి కాపాడటం ఆ వీడియోలో ఉంది. వర్షం నీటిలో కరెంట్ తీగ తెగిపడడంతో బాలుడు విద్యుత్ షాక్ బారిన పడ్డాడు. ఈ ఘటన ఈ నెల 16న జరగగా శనివారం వీడియో బయటకు రావడంతో నెట్టింట వైరల్‌గా మారింది. అరుంబాక్కంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. 24 ఏళ్ల కన్నన్ తమిజ్ సెల్వన్ అనే యువకుడు కజాదెన్ ర్యాన్ (9) అనే మూడో తరగతి చదువుతున్న బాలుడిని రక్షించారు. కరెంట్ షాక్‌కు గురై వర్షపు నీటిలో పడి ఉన్న ర్యాన్‌ను అక్కడి నుంచి బయటకు తీసి, సీపీఆర్ చేశారు.అనంతరం ఆసుపత్రికి తరలించడంతో అతడు బతికాడు.ఇక తన ప్రాణాలను పణంగా పెట్టి బాలుడిని కాపాడిన సెల్వన్‌పై తమిళనాట ప్రశంసలు కురుస్తున్నాయి. అలాగే నెటిజన్లు కూడా అతడిని మెచ్చుకుంటున్నారు. సమయస్ఫూర్తితో బాబును కాపాడిన సెల్వన్ రియల్ హీరో అని కొనియాడుతున్నారు.

## ప్రపంచకప్ షూటింగ్‌లో

# సురుచికి మూడో స్వర్ణం

### స్టార్ షూటర్ మనూ రజతానికే పరిమితం



**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్ యువషూటర్ 18 ఏళ్ల సురుచి సింగ్ దూసుకొచ్చింది. మనూ భాకర్‌ను వెనక్కి నెట్టిన సురుచి ఆదివారం స్వర్ణపతకాన్ని సొంతం చేసుకుంది. దీంతో సురుచి ఖాతాలో మూడో స్వర్ణం చేరింది. పెరూ రాజధాని లిమా నగరంలో ప్రపంచ కప్ షూటింగ్ టోర్నీలో భారత్ స్టార్ షూటర్, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ మనూ భాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో బరిలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత మొదటిసారిగా బరిలోకి దిగిన మనూ స్వర్ణ పతకం గెలవడం ఖాయమన్న అంచనాలు అమెపై ఉన్నాయి. కానీ చివరకు అనూహ్య ఫలితం వచ్చింది. భారత్ షూటర్ సురుచి పసిడి కాంతులు వెదజల్లింది. ఒలింపిక్ మెడలిస్ట్ మనూ రజతానికి పరిమతం కావాల్సి వచ్చింది. మనూ భాకర్‌పై గెలిచిన రెండో రోజు సురుచి పిస్టల్ మళ్లీ మెరిసింది. ఈ సారి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కే చెందిన సౌరభ్‌తో కలిసి సురుచి మరో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. కాగా అంతకు ముందు వారమే అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో జరిగిన ప్రపంచ కప్‌లో స్వర్ణం నెగ్గిన సురుచి ఓవరాల్‌గా ఇది మూడో స్వర్ణం. అయితే మొదటి స్వర్ణంతో పోలిస్తే మనూ భాకర్‌ను ఓడించి సాధించిన పసిడి పతకం విలువ పెద్దదిగా మారింది.

## జాతీయ రేస్ వాకింగ్‌లో..

# రామ్ బాబు, సెబాస్టియన్లకు పసిడి





**న్యూఢిల్లీ:** జాతీయ ఓపెన్ రేస్ వాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఇరువురు అథ్లెటిక్స్ పసిడి పతకాలతో మెరిశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్ బాబు పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. చండీగఢ్‌లో జరిగిన రేస్‌లో రామ్ 35 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 32 నిముషాల 53.50 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్ర స్థానంలో నిలిచాడు. 2022 ఆసియా క్రీడల్లో మంజు రాణితో కలిసి మిక్స్‌డ్ రేస్ వాక్‌లో కాంస్యం నెగ్గిన రామ్ బాబు జాతీయ పోటీల్లోనూ అదే జోరును కనపర్చాడు.

అయితే తన పేరిట ఉన్న జాతీయ రికార్డు 2 గంటల 29 నిముషాల 56 సెకన్లను మాత్రం సవరించ లేకపోయాడు. అదేవిధంగా 20 కిలోమీటర్ల విభాగంలో సెబాస్టియన్ స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకునానడు. 1 గంట 21 నిముషాల 46.47 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. అలాగే అమిత్ 1 గంటల 21 నిముషాల 51.46 సెకన్లతో రజత పతకాన్ని దక్కించుకోగా, అమన్ జ్యోతి సింగ్ 1 గంట 22 నిముసాల 12.72 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని కాంస్య పతకాన్ని సాధించాడు.



# రాయల్ ఛాలెంజర్స్ హ్యాట్రిక్

### పంజాబ్‌పై 7 వికెట్ల తేడాతో ఆర్సీబీ ప్రతీకార విజయం

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రతీకార విజయం సాధించింది. చిన్నస్వామి స్టేడియంలో తమను చిత్తుగా ఓడించిన పంజాబ్ కింగ్స్‌పై 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తొలుత సుయాశ్ శర్మ(2-26), కృనాల్ పాండ్యా(2-25)ల విజృంభణతో పంజాబ్‌ను 157 కట్టడి చేసిన బెంగుళూరు ఛేదనలో చెలరేగింది. ప్రత్యర్థి బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వని విరాట్ కోహ్లీ (73 నాటౌట్), ఇమ్పాక్ట్ ప్లేయర్ దేవ్‌దత్ పడిక్కల్ (61)లు హాఫ్ సెంచరీలతో హోరెత్తించారు. జితేశ్ శర్మ (11) సిక్సర్ బాదడంతో మరో 7 బంతులు ఉండగానే లక్ష్యాన్ని 18.5 ఓవర్లలో ఛేదించింది. ఇక సాల్ట్ 1, రజత్ 12, జితేశ్ 11.. పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్, హర్‌ప్రీత్, చాహల్ తలో వికెట్ తీశారు. ఇక సొంత ఇలాకాలో పంజాబ్ కింగ్స్ ఆరంభం అదిరినా భారీ స్కోర్ కొట్టలేకపోయింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు విజృంభించడంతో టాపార్డర్ విఫలమైంది. ఆదివారం తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన పంజాబ్ కింగ్స్‌కు శుభారంభం లభించినా కూడా పెద్ద స్కోర్ చేయలేకపోయింది. నాలుగు ఓవర్లలోనే 42 రన్స్ చేసిన పంజాబ్‌ను రాయల్ ఛాలెంజర్స్ స్పిన్నర్లు దెబ్బకొట్టారు. పవర్ ప్లే తర్వాత చకచకా వికెట్లు తీసి ఆతిథ్య జట్టును ఒత్తిడిలోకి నెట్టారు. రెండో ఓవర్ నుంచే ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (33)లు దంచారు. యశ్ దయాల్ బౌలింగ్‌లో ప్రభ్ బౌండరీ బాదగా, ప్రియాన్ష్ 6, 4తో విజృంభించాడు. ఆ తర్వాత భువీని ఉతికేస్తూ ప్రభ్ మూడు ఫోర్లు సాధించి పంజాబ్ స్కోర్ 30 దాటించాడు. స్పిన్నర్ కృనాల్ పాండ్యాను రంగంలోకి దింపిన ఆర్సీబీ కెప్టెన్ ఈ జోడీని విడదీశాడు. తొలి వికెట్ పడినా పంజాబ్ బ్యాటర్లు జోరు తగ్గించలేదు. హేజిల్‌వుడ్ వేసిన పవర్ ప్లే ఆఖరి ఓవర్లో ప్రభ్ ఫైన్ లెగ్ దిశగా సిక్సర్ బాదాడు. పవర్ ప్లేలో 6-22తో పటిష్టంగా నిలిచిన పంజాబ్ వరుసగా వికెట్లు కోల్పోయింది. రొమారియో షెపర్డ్ బౌలింగ్‌లో శ్రేయస్ పెద్ద షాట్ ఆడగా కృనాల్ పరుగెడుతూ చక్కని క్యాచ్ అందుకున్నాడు. దాంతో పంజాబ్ వికెట్ల పతనం మొదలైంది. టిమ్ డేవిడ్ త్రోతో నేహాల్ వధేరా(5) రనౌటయ్యాడు. సుయాశ్ శర్మ 14వ ఓవర్లో ఇంగ్లిస్ (29), మార్కస్ స్టోయినిస్ (1)ను బౌల్డ్ చేసి పంజాబ్‌ను మరింత కష్టాల్లోకి నెట్టాడు. 114కే 6 వికెట్లు పడిన దశలో శశాంక్ సింగ్ (31 నాటౌట్), మార్కో యాన్సెన్ (25 నాటౌట్)లు విలువైన ఇన్నింగ్స్ ఆడారు. ఏడో వికెట్‌కు అభేద్యమైన 43 రన్స్ జోడించి పంజాబ్‌కు పోరాడగలిగే స్కోర్ అందించారు. ఆఖరి బంతికి శశాంక్ సిక్సర్ బాదడంతో పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 రన్స్ కొట్టింది.

# ఐపీఎల్‌లో యూత్ హవా






### అదర గొడుతున్న ప్లేయర్లు

### టీమిండియాలో పోరెల్, ఆర్య, సుదర్శన్‌లకు ఛాన్స్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్-2025, సీజను 18 భారత జాతీయ జట్టుకు కొత్త రక్తాన్ని అందించేలా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ టోర్నీలో కనిపించిన యువ ప్రతిభ భారత్ టీ20 జట్టులోకి ప్రవేశించేందుకుతగినంత అర్హతను సంపాదించింది. మూడు అన్‌క్యాప్డ్ యువ బ్యాట్స్‌మెన్ అదరగొడుతున్నారు. వీరిలో ఒక్కొక్కరి ఆటతీరు భారత జట్టులో తగిన స్థానం దక్కించుకునేలా ఉంది. ఈ యువత తళుక్కుమంటే భవిష్యత్ టీమిండియాకు కొత్త శక్తిని అందిస్తుందని స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో భారతబ్యాటింగ్ లైనప్‌ఇప్పటికే బలంగా ఉన్నప్పటికీ,ప్రస్తుత ఐపీఎల్‌లో వెలుగులోకి వచ్చిన ముగ్గురు అన్‌క్యాప్డ్ బ్యాటర్లు సెలక్టర్లను ఆకర్షించడంలో విజయవంతమయ్యారు. వీరిలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన అభిషేక్ పోరెల్, పంజాబ్ కింగ్స్ తరఫున ఆడుతున్న ప్రియాంష్ ఆర్య, గుజరాత్ టైటాన్స్‌ను ప్రతినిధ్యం వహిస్తున్న సాయి సుదర్శన్‌లు ఉన్నారు. ఇక అభిషేక్ పోరెల్ ఇప్పటి వరకు 7 మ్యాచ్‌లలో 174 పరుగులు చేసి, 147.46 స్ట్రైక్ రేట్‌తో ఆకట్టుకున్నాడు. తన వికెట్ కీపింగ్ నైపుణ్యాలతో పాటు ఎడమచేతి బ్యాటింగ్ స్టైల్ ద్వారా జట్టులో వైవిధ్యం తీసుకురాగలడు. మ్యాచ్ పరిస్థితులను బట్టి తన ఆటను సర్దుబాటు చేయగలగడం అతనికిప్రత్యేకత. అతనిప్రదర్శనను చూసిన వారెవరికైనా ఇదిభవిష్యత్ భారతటీ20 జట్టుకు ఉపయోగపడే విలువైన స్కిల్‌సెట్‌గా అనిపించకమానదు. ఇక టోర్నమెంట్‌ను ఊపెత్తేలా చేసిన మరో పేరు ప్రియాంష్ ఆర్య. అతను కేవలం 7 మ్యాచ్‌ల్లోనే 232 పరుగులు చేసి, 209.01 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌ను నమోదుచేశాడు. నాణ్యమైన బౌలింగ్‌ను ధైర్యంగా ఎదుర్కొంటూ, ఎలాంటి వెనుకడుగు వేయకుండా ఆటను సాగిస్తున్న అతని ధోరణి ఆకర్షణీయంగా మారింది. ఆర్యలాంటి ఆటగాడు టాప్ ఆర్డర్‌లో త్వరిత పరుగులకు దారితీసే సామర్థ్యాన్ని కలిగి ఉండటం జట్టుకు పెద్దలాభం. కాగాతొలుత 2023 ఫైనల్‌లో నిలిచిన సాయి సుదర్శన్, ఇప్పుడు ఈ ఐపీఎల్‌లో తన స్థిరమైన ప్రదర్శనతో మళ్లీ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. గుజరాత్ టైటాన్స్ తరఫున కేవలం 7 మ్యాచ్‌లలోనే 365 పరుగులు చేసి, 52.14 సగటుతో పాటు 153.36 స్ట్రైక్‌రేట్‌తో చెలరేగి ఆడాడు. ఎడమచేతి బ్యాట్స్‌మెన్‌గా స్పిన్, పేస్ రెండింటినీ ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో రాణిస్తున్న సుదర్శన్, భారత బ్యాటింగ్‌లో యాంకర్ పాత్ర పోషించగలవాడు. అతని శాంతమైన తత్వం, సాంకేతిక పరంగా పటుత్వం అతన్ని మెగా టోర్నీలకు సిద్ధంగా ఉన్న ఆటగాడిగా నిలబెడుతోంది. ఈ ముగ్గురు ఆటగాళ్లను చూస్తే, భారత క్రికెట్‌కు ఎదురుగా ఉన్న భవిష్యత్ ఎంతో ఉజ్వలంగా కనిపిస్తోంది. వీరిలాంటి యువత ఎంట్రీ ఇవ్వడం జట్టుకు నూతన శక్తిని, పోటీని కలిగించడమే కాకుండా, ప్రస్తుత ఆటగాళ్లను తమ స్థానాన్ని నిలుపుకునేందుకు మరింత కష్టపడేలా చేస్తుంది. ఐపీఎల్ వేదికగా తళుక్కుమన్న ఈ యువ బ్యాట్స్‌మెన్ త్వరలో టీమిండియా బ్లూ జెర్సీలో దర్శనమిచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు.





# వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్‌లో ఫైనల్స్‌కు

# అనాహత్, చోత్రాని

**న్యూఢిల్లీ:** ప్రపంచ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత్ రైజింగ్ స్టార్స్ అనాహత్ సింగ్, వీర్ చోత్రాని ఫైనల్లోకి దూసుకెళ్లారు. కౌలాలంపూర్‌లో భారత్ కాలమానం ప్రకారం ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్లో ఐదో సీడ్, 17 ఏళ్ల అనాహత్ 11-2, 11-7, 11-6తో హాంకాంగ్‌కు చెందిన హెలెన్ టాంగ్‌పై విజయం సాధించింది. 21 నిముసాల్లో ముగిసిన పోరులో అనాహత్ తన ప్రత్యర్తికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగింది. ఇప్పటి వరకూ ఈ ఇద్దరి మధ్య ఐదు మ్యాచ్‌లు జరగ్గా, అన్నింటిలోనూ అనాహత్ విజయం సాధించడం విశేషం. ?ఇక ఫైనల్లో హాంకాగ్‌కు చెందిన టోబీ ట్సెతో అనాహత్ తలపడనుంది. కాగా భారత్ మరో ప్లేయర్, రెండో సీడ్ ఆకాంక్ష పరాజయం పాలైంది. ఆకాంక్ష 3-11, 10-12, 12-10, 8-11తో టోబీ ట్సె చేతిలో ఓడింది. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ ప్లేయర్ వీర్ చోత్రాని కూడా ఫైనల్లో అడుగుపెట్టాడు. సెమీ ఫైనల్లో వీర్ చోత్రాని 11-7, 11-6, 7-11, 11-4తో ఎనిమిదో సీడ్, హాంకాంగ్‌కు చెందిన సీడ్ చి హిమ్ వాంగ్‌పై విజయం సాధించాడు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ప్లేయర్లు మే 9 నుండిఇ 17 వరకూ చికాగోలో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధిస్తారు.

# మధ్యతరగతికి అందని ద్రాక్ష పసిడి

**ముంబై, ఏప్రిల్ 20:** ఇవాళున్న పరిస్థితుల్లో ఫంక్షన్లొస్తే టెన్షన్లే. సగటు తండ్రి గుండెల్లో గులకరాయి పడ్డట్టే. ఇకమీదట కాసుబంగారమైనా స్టేటస్ సింబలే. ముఖ్యంగా ఆడపిల్ల పెళ్లికి పూనుకుంటే.. ఆ కుటుంబం బడ్జెట్ లెక్కలు పూర్తిగా మారిపోతాయి. అమ్మాయి నగలకు ఎన్ని లక్షలు ఖర్చు పెట్టావని చూడరు.. మీ అమ్మాయికి ఎన్ని తులాలు పెడుతున్నావనే లెక్కలే ఆరా తీస్తారు అవతలి వాళ్లు. అందుకే పెళ్లికి జ్యుయెలరీ షాపింగ్ అంటే ఆషామాషీ కాదు. పైగా బంగారం ధరలు పెరిగినంత వేగంగా మధ్యతరగతి కుటుంబాల



ఆదాయం పెరగడం లేదు. వేతన జీవుడి జీత భత్యాలు ఏటా పది లేదా పదిహేను శాతమే పెరుగుతాయి. ముఖ్యంగా అల్పాదాయ వర్గాల వారైతే అంతకంతకూ ఆర్థికంగా కుంగిపోతూనే ఉన్నారు.ఒక సర్వే ప్రకారం ఒక మధ్యతరగతి కుటుంబం సగటు వార్షికాదాయం 5 లక్షలకు అటూఇటూనే. లోయర్ మిడిల్‌క్లాస్ మంత్లీ యావరేజ్ ఇన్‌కమ్ 33 వేలు. వీటిలో 19 వేల దాకా నెలవారీ ఖర్చులు పోనూ మిగతాది పొదుపు చేసుకోవడమో, బంగారం కొనిపెట్టుకోవడమో చేసేవాళ్లు. కానీ.. అంతంత మాత్రంగా నడిచే అనేక రంగాల్లో శాశ్వత ఉపాధి అనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. పడుతూ లేస్తున్న రియలెస్టేట్ లాంటి కొన్ని సెక్టార్స్‌లో ఐతే కూలీనాలీ చేసుకుని బతికేవాళ్లు, చిన్నసైజు జీతగాళ్లు ఆర్థికంగా అంతకంతకూ చితికిపోతున్నారు. ఒక నెల్లో వచ్చిన రాబడి మరుసటి నెల్లో వస్తుందన్న గ్యారంటీ ల్లేవు. అయితే పదోపదిహేనో వేలకు నెలంతా పనిచేసుకుని ఆ జీతంరాళ్ల మీదే బతుకుబండిని లాగేవాళ్లు.. బంగారం వైపు చూసే అవకాశాలే లేవిప్పుడు. బ్రాండెడ్ బంగారం కొనుక్కునే బడా ఫ్యామిలీలు సైతం ఇప్పుడున్న ధరలతో బెంబేలెత్తిపోతున్నాయి. మరి.. పదికాసుల గొలుసు లేందే మెడ బోసిపోయినట్టుండే మధ్యతరగతి మగువల పరిస్థితి మరీ దారుణం. నెలకు వెయ్యో రెండువేలో మిగలబెట్టుకుని.. జ్యుయెలరీ షాపుల్లో పొదుపు స్కీములు కట్టుకుని.. ఏడాది కాగానే ఏదైనా వస్తువు కొనుక్కునేవాళ్లు కొందరు. పుట్టినరోజుకో పెళ్లిరోజుకో రెండుగ్రాముల ఉంగరమైనా తీసుకుందామని ఆశపడే వాళ్ల గుండెలు గుభేల్ మంటున్నాయిప్పుడు. సాంప్రదాయం కోసమో, కుటుంబ గౌరవం కోసమో, బంధుగణంలో పరువు పోతుందన్న బెంగతోనో కొన్నిసార్లు బంగారం కొనుగోలు చేయడం తప్పదు. తులమో అరతులమో కొనుక్కోవాల్సిన ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో మధ్యతరగతి జీవుడు ఏం చేస్తాడు.. అప్పోసప్పో చేసైనా సరే జ్యూవెలరీ షాపింగ్ చేస్తాడు.. ఆవిధంగా చేతులారా ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయి ఇల్లు గుల్ల చేసుకోకతప్పదా..? అందుకే.. లక్ష అనే ఆ రెండక్షరాలూ సగటు మధ్యతరగతి జీవుణ్ణి పీడకలలా వెంటాడుతున్నాయి.

# బ్యాంక్ ఖాతా లేకున్నా చెల్లింపులు..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరగడంతో నేడు డబ్బు లావాదేవీలలో భారీ మార్పు వచ్చింది. గత కొన్ని సంవత్సరాలుగా భారతదేశంలో డిజిటల్ చెల్లింపులు వేగంగా పెరుగుతున్నాయి. చిన్నపాటి చెల్లింపుల నుంచి ఫీజు చెల్లింపుల వరకు కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. డిజిటల్ చెల్లింపు సౌకర్యాలను అందించే ప్లాట్‌ఫామ్‌లు ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయడానికి కొత్త లక్షణాలను కూడా ప్రవేశపెడుతున్నాయి. లక్షలాది మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చే ఒక ఫీచర్‌ను కూడా ఫోన్‌పే ప్రవేశ పెట్టింది. అవసరమైన సమయాల్లో తన వినియోగదారులకు సహాయం చేయడానికి ఫోన్‌పే యుపిఐ సర్కిల్ ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్ సహాయంతో వినియోగదారులు తమ కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు యుపిఐ చెల్లింపులు చేయగలుగుతారు. బ్యాంకు ఖాతా లేని లేదా ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఉపయోగించని వారికి ఈ ఫీచర్ ప్రత్యేకంగా ఉపయోగపడుతుంది. అలాంటి వినియోగదారులు యుపిఐ ఉపయోగించే వారి స్నేహితులకు చెల్లింపులు చేయగలుగుతారు.





**ఎన్‌పిసిఐ ఒక పెద్ద సమస్యను పరిష్కరించింది:** ఈ ఫీచర్‌ను యుపిఐ ప్రారంభించింది. ఎన్‌పిసిఐ గతంలో దీన్ని గూగుల్ పే యాప్‌కు మాత్రమే పరిమితం చేసింది. కానీ ఇప్పుడు దీనిని ఫోన్‌పేలో కూడా అందుబాటులోకి తెచ్చారు. ఫోన్‌పే తన అధికారిక ఎక్స్ ఖాతా నుండి ఒక పోస్ట్ ద్వారా యుపిఐ సర్కిల్ ఫీచర్ రాకను ప్రకటించింది. బ్యాంక్ ఖాతా లేదా నెట్ బ్యాంకింగ్ సౌకర్యం లేని సభ్యులకు మీరు ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలనుకుంటే మీరు ముందుగా ఆ సభ్యుడిని ఫోన్‌పే ఖాతాకు జోడించాలి. దీని తర్వాత మాత్రమే మీరు వారికి యుపిఐ చెల్లింపులు చేయగలుగుతారు. ప్రకటన సభ్యులందరూ చెల్లింపు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే, చెల్లింపు అభ్యర్థన ప్రాథమిక సభ్యునికి చేరుతుంది. ఆ తర్వాత మీరు చెల్లింపును సులభంగా చేయగలుగుతారు. యూపీఐ సర్కిల్ ఫీచర్‌ను ఉపయోగించడానికి ముందుగా మీ స్మార్ట్‌ఫోన్‌లో ఫోన్‌పే యాప్‌ను తెరవండి.ఇప్పుడు మీరు యాప్‌లో కిందికి స్క్రోల్ చేసినప్పుడు మీకు యుపిఐ సర్కిల్ ఎంపిక కనిపిస్తుంది. యుపిఐ సర్కిల్ ఎంపికపై క్లిక్ చేసిన తర్వాత మీరు మీ సన్నిహితులు, కుటుంబ సభ్యులను మీ ఖాతాకు జోడించవచ్చు. ప్రాథమిక వినియోగదారులు తమ యాప్‌కు ద్వితీయ వినియోగదారులను జోడించడానికి యుపిఐ ఐడి లేదా క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించవచ్చు. సభ్యులను జోడించిన తర్వాత మీరు ఇతరులకు ఆన్‌లైన్ చెల్లింపులను సులభంగా చేయవచ్చు. ఇక్కడ ప్రాథమిక వినియోగదారుడు యూపీఐ సర్కిల్‌ను సృష్టించవచ్చు.

# వాణిజ్యం

# లావాదేవీల్లో జాగ్రత్తలు తప్పనిసరి

**ముంబై, ఏప్రిల్ 20:** దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్నాయంటే ప్రజలు తమ ఆర్థిక నిర్వహణ కోసం పొదుపు బ్యాంకు ఖాతాలను ఎక్కువగా వినియోగిస్తున్నారని అర్థం. అయితే ఆ ఖాతాలకు ఆర్థిక పరిమితి ఉందని అది దాటితే ఆదాయపు పన్ను శాఖ నోటీసులు ఇస్తుందనే విషయం చాలా మందికి తెలియదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్‌ఇండియా నిర్దేశించిన నిబంధనల ప్రకారం ప్రజలు ఒక ఆర్థిక సంవత్సరంలో తమ పొదుపు ఖాతాలో రూ. 10 లక్షల వరకు నగదు జమ చేయడానికి అనుమతి ఉంటుంది. అయితే ఈ పరిమితిని మించిపోవడం వల్ల ఆటోమెటిక్‌గా పన్ను విధించరు. అయితే ఆదాయపు పన్ను శాఖ అధికారులు మాత్రం నోటీసులు ఇస్తారు. వార్షిక సమాచార రిటర్న్ (ఏఐఆర్) ఫ్రేమ్‌వర్క్ కింద బ్యాంకులు అధిక విలువ కలిగిన నగదు లావాదేవీలను ఆదాయపు పన్ను శాఖకు నివేదించాల్సి ఉంటుంది. మీ డిపాజిట్లు రూ. 10 లక్షల పరిమితిని దాటితే ఆ నిధుల మూలాన్ని మీరు వివరించాల్సి ఉంటుంది. మూలాన్ని అధికారులకు నివేదించడంతో ఇబ్బందులు ఎదురైతే ఆ మొత్తంపై 60 శాతం వరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత బ్యాంకుల్లో రూ.50,000 వరకు నగదు డిపాజిట్ల కోసం మీరు మీ పాన్ కార్డును చూపించాల్సిన అవసరం లేదు. ఆ మొత్తాన్ని మించిన ఏదైనా లావాదేవీ చేయాలంటే కచ్చితంగా పాన్ వివరాలను అందించాల్సి ఉంటుంది. ఈ నిబంధన వల్ల లెక్కించని సంపదను పర్యవేక్షి ం చడానికి, అలాగే బ్యాంకింగ్ మార్గాల ద్వారా సంభావ్య మనీలాండరింగ్‌ను అరికట్టడానికి వీలు అవుతుంది. అలాగే ప్రజలు స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు లేదా డిజిటల్ కెమెరాలు వంటి అధికవిలువ కొనుగోళ్లకు రసీదులు,



ఇన్‌వాయిస్‌లను నిర్వహించడం కూడా చాలా ముఖ్యమని నిపుణులుచెబుతున్నారు. ఆదాయపు పన్ను అంచనాల సమయంలో ఈ రికార్డులు కీలకమైన డాక్యుమెంటేషన్‌గా ఉపయోగపడతాయి. ప్రత్యేకించి అలాంటి వస్తువుల విలువ మీరు నివేదించిన ఆదాయానికి అసమానంగా కనిపించినప్పుడు. మీ పొదుపు ఖాతాలో డబ్బు ఉంచుకోవడం పూర్తిగా చట్టబద్ధమైనదే అయినప్పటికీ నియంత్రణా సరిహద్దుల్లోనే ఉండటం చాలా ముఖ్యం. ఆదాయ పత్రాలకు మద్దతు లేకుండా అకస్మాత్తుగా పెద్ద మొత్తాలు రావడం వల్ల సమస్యలు తలెత్తవచ్చు. సురక్షి తంగా ఉండటానికి ఆదాయ వనరు ల స్పష్టమైన వివరాలను మీ వద్ద ఉంచుకోవాలి. అవ సరమైనప్పుడు మీపన్ను రిటర్న్‌లలో

# మార్కెట్‌కు 'ఇవి' కార్ల క్యూ..

**ముంబై, ఏప్రిల్ 20:** ఎంజీ విండ్సర్ ఈవీ సెప్టెంబర్ 2024లో భారత మార్కెట్లోకి ప్రవేశించింది. టాటా నెక్సాన్ 'ఇవి' అధిగమించి తనదైన ముద్ర వేసింది. ప్రస్తుతం విండ్సర్ 'ఇవి' 37.9 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో అమర్చబడిఉంది. ఈ కారు 331 కిలోమీటర్ల పరిధిని అందిస్తుంది. అయితే తాజాగా ఎంజీ విండ్సర్ 50 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ఎంపికను ప్రారంభించాలని యోచిస్తోంది. ఈ నెలలో అంటే ఏప్రిల్ 2025లో ప్రారంభించాలని భావిస్తున్న ఈ లాంగ్‌రేంజ్ వెర్షన్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 460 కిలోమీటర్లు ప్రయాణించే అవకాశం ఉంది. హ్యుందాయ్ భారత మార్కెట్లో టాటా నెక్సాన్ 'ఇవి' వంటి వాటికి పోటీగా కొత్త కాంపాక్ట్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీను లాంచ్ చేయాలని ప్రయత్నాలు చేస్తుంది. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్ట్ గురించి వివరాలు తక్కువగా ఉన్నప్పటికీ ఎలక్ట్రిక్ వెన్యూ 2025 చివరి నాటికి దేశంలో విడుదల కానున్న నెక్స్ట్‌జెన్ ఐసీఈ వెన్యూ ఆధారంగా ఉంటుందని భావిస్తున్నారు. వెన్యూ ఈవీ బహుశా ఈజీఎంపీ(కే) ప్లాట్‌ఫారమ్ ఆధారంగా పని చేస్తుంది. ఇది రాబోయే ఇన్‌స్టర్ ఆధారిత ఈవీ కోసం కూడా ఉపయోగించే ఉంది. అయితే ఈ కారు గురించి ప్రస్తుతానికి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. వెన్యూ 'ఇవి' ఒకే చార్జ్‌పై దాదాపు 400 కిలోమీటర్ల క్లెయిమ్ రేంజ్‌తో వస్తుందని నిపుణులు అంచనా వేస్తుంది. కియా ఫిబ్రవరి 2025లో భారత మార్కెట్లో సైరోస్‌ను ప్రారంభించింది. ఈ సంవత్సరం చివరి నాటికి లేదా 2026 ప్రారంభంలో ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ భారత మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం ఉంది. సైరోస్ 'ఇవి' అప్‌డేటెడ్ బంపర్లు, కొత్త ఏరోఎఫిషియన్సీ అల్లాయ్ వీల్స్, కొన్ని 'ఇవి' నిర్దిష్ట బ్రాండింగ్‌లను పొందుతుందని అంచనా వేస్తున్నారు.

# భారత జాబ్ మార్కెట్ భేష్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ భారత ఉద్యోగ మార్కెట్ బలంగా నిలబడిందని, పలు రంగాల్లో నియామకాలు మెరుగ్గా సాగాయని మైఖేల్ పేజ్ ఇండియా (అంతర్జాతీయ నియామకాల సంస్థ) ఎండి నిలయ్ ఖండేల్‌వాల్ తెలిపారు. సాంకేతిక నైపుణ్యాల్లో లోతైన అనుభవం, వ్యయ నియంత్రణలు, సిబ్బంది కొత్త నైపుణ్యాలను వేగంగా అలవరుచుకోవడాన్ని భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి మందగమనంతో అంతర్జాతీయంగా కొన్ని ప్రాంతాల్లో నియామకాల పట్ల అప్రమత్త ధోరణి నెలకొనగా, భారత్‌లో మాత్రం నిపుణులకు డిమాండ్ ఉన్నట్లు చెప్పారు. ముఖ్యంగా టెక్నాలజీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఈ పరిస్థితి ఉన్నట్లు తెలిపారు. స్టెమ్ విభాగంలో ఆధిపత్యంతో భారత్ నైపుణ్య కేంద్రంగా కొనసాగుతోందని, పోటీతో కూడిన వేతనాలు, ప్రభుత్వ మద్దతుతో నైపుణ్యాల కల్పన, అంతర్జాతీయ క్యాపబులిటీ కేంద్రం (జిసిసిలు) విస్తరణ



ఇందుకు మద్దతుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. జిసిసిలు ఎఐ, ఆటోమేషన్, ఆర్‌అండ్‌టిపై దృష్టిసారించడం వల్ల ఆవిష్కరణలకు భారత్ కీలక కేంద్రంగా మారినట్లు చెప్పారు. స్కిల్ ఇండియా, ఎఐ ఆధారిత నైపుణ్యాల అభివృద్ధి నిపుణులకు ఉపాధి అవకాశాలను పెంచుతాయన్నారు. భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించాలంటే, నైపుణ్యాల అభివృద్ధిని వేగవంతం చేయాలంటూ, ఎఐ, సెమీ కండక్టర్ పరిశ్రమల్లో అధిక నైపుణ్య మానవ వనరుల అవసరం ఉంటుందని సూచించారు. ఉద్యోగం-వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం పెరుగుతున్నందున ఉత్పాదకత ఆధారిత పని నమూనాలపై కంపెనీలు దృష్టిసారించాల్సి ఉంటుందన్నారు. ఈవై జిసిసి సర్వే, 2024ను ఉదహరిస్తూ, అంతర్జాతీయ సంస్థల్లో 50శాతం భారత్‌లో తమ జిసిసి కార్యకలాపాలను విస్తరించాలని చూస్తున్నట్లు తెలిపారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.